సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
ఆదివారం, 15.02.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 116
పేజీలు: 12 వెల: రూ. 5

# అహంకారం.. ఆసీస్ పతనం?

## కిందపడ్డ కంగారూ.. గర్వం నేర్పిన పాఠం అదేనా?

- వరుస ఓటములు.. ఆసీస్ షాక్
- మైండ్ సెట్ మార్పు లేకే పరాజయాలు
- వినయం మరిచిన ఆసీస్?

11



ఒకప్పుడు ఆస్ట్రేలియా అంటే మైదానంలో ఎదురులేని సైన్యం. ప్రత్యర్థి ఎవరైనా సరే, గెలుపు తమదే అన్నంత ధీమా. కానీ, 2023 ప్రపంచకప్ విజయం తర్వాత ఆ జట్టులో పెరిగిన అతివిశ్వాసం, ప్రత్యర్థుల పట్ల చూపిన అగౌరవం ఇప్పుడు వారినే కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయా? వరల్డ్ కప్ ట్రోఫీపై కాలు పెట్టి కూర్చున్న నాటి 'అహంకారం' నుంచి, నేడు పసికూనల చేతిలో చిత్తవుతున్న 'నిస్సహాయత' వరకు.. ఆస్ట్రేలియా క్రికెట్ పతనం వెనుక దాగున్న చేదు నిజాలపై ఒక ప్రత్యేక విశ్లేషణ.

# శివోహం

## మహాశివరాత్రికి వేములవాడ.. ఏడుపాయల గుడి, వేయిస్తంభాల గుడి సహా శైవక్షేత్రాలు సిద్ధం



- మహాశివరాత్రి జాతరకు ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- భారీ పోలీసు బందోబస్తు
- నేటి నుండి మూడు రోజులు జాతర
- వేములవాడకు 2.5 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా
- భక్తుల కోసం రెండు లక్షల లడ్డూలు తయారీ

09



రాష్ట్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు అంబరాన్నంటుతున్నాయి. దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ రాజన్న క్షేత్రం, ప్రకృతి ఒడిలో వెలసిన ఏడుపాయల వనదుర్గా మాత సహా వరంగల్ లోని వేయిస్తంభాల గుడి, ఇతర శైవక్షేత్రాల సన్నిధులు భక్తుల కోసం ముస్తాబయ్యాయి. నేటి నుంచి మూడు రోజుల పాటు వైభవంగా సాగే ఈ జాతరలకు అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. లక్షలాదిగా తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు, రవాణా, వైద్య సదుపాయాలను సిద్ధం చేశారు.

# ఓమన్‌పై ఐర్లాండ్ భారీ విజయం

- స్కాట్లాండ్ పై అతికష్టం మీద గెలిచిన ఇంగ్లండ్
- న్యూజిలాండ్ vs సౌతాఫ్రికా హోరాహోరీ

11



# కొలంబో చేరుకున్న టీమిండియా

## పాకిస్తాన్ తో నేడు తలపడనున్న భారత్



- ఈ మ్యాచ్ లోనూ అభిషేక్ డౌటే?
- వాషింగ్టన్ సుందర్ కు ఛాన్స్ ఉండేనా?
- మ్యాచ్ కు వరుణ గండం?

11



## ఎక్స్ అఫీషియో సభ్యులకు

# ఓటు మెలిక

## స్థానిక ఓటరు అయితేనే ఎక్స్ అఫీషియో ఓటు

- మున్సిపల్ ఎన్నికల్లో కీలక మార్పులు చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- హైకోర్టు ఆదేశాలతో ఎస్ఈసీ కఠిన మార్గదర్శకాలు
- ఎంపీలు, ఎమ్మెల్సీలకు కొత్త నిబంధనలు అమలు
- ఇష్టమైన మున్సిపాలిటీలో ఓటు వేసే అవకాశానికి చెక్
- అర్హతలేని ఎక్స్ అఫీషియో ఓట్లు చెల్లవని స్పష్టం
- హంగ్ మున్సిపాలిటీల్లో సమీకరణాలు మారే సూచనలు

మేయర్, చైర్మన్ ఎన్నికల ముందు కీలక నిర్ణయం

ఈనెల 16న మున్సిపల్ పీఠాల ఎన్నికలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లో ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఓటు వేయాలంటే.. సదరు ప్రజాప్రతినిది కచ్చితంగా ఆ పురపాలిక పరిధిలో ఓటరు అయి ఉండాల్సిందేనని రాష్ట్ర ఎన్నికల సంఘం తేల్చి చెప్పింది. ఈనెల 16న కార్పొరేషన్లలో మేయర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరగనున్న ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం శనివారం మార్గదర్శకాలు జారీ చేసింది. మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో హంగ్ ఏర్పడిన పురపాలికల్లో మేయర్, చైర్మన్ ఎన్నికల్లో అత్యంత కీలకమైన ఎక్స్ అఫీషియో సభ్యుల ఓటు హక్కుపై మార్గదర్శకాలను విడుదల చేసింది. ఎంపీలు, ఎమ్మెల్సీలు ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఓటు వేయాలంటే ఆ మున్సిపాలిటీలోని ఓటర్ జాబితాలో వారి పేరు ఉండాలని ఈసీ స్పష్టం చేసింది. ఒకవేళ మిగతా 02లో

# రెఫరెండమా?

## మున్సిపల్ ఫలితాలపై రాజకీయ చర్చల హోరు

- స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి సహజంగానే ఆధిక్యం
- అభివృద్ధికి ఓటర్ల వ్యూహాత్మక నిర్ణయం
- మున్సిపల్ ఫలితాలు.. అసెంబ్లీ తీర్పునకు సంబంధం లేదా?
- రెఫరెండం అన్న విపక్షాలు.. ఫలితాల తర్వాత మౌనం
- స్థానిక సమీకరణాలు, వ్యక్తిగత ప్రభావం కీలకం
- ఓటరు నాడి వేరు.. స్థానిక అవసరాలే ప్రధాన నిర్ణయకర్తలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై రాజకీయ పార్టీలు ఎవరి విశ్లేషణ వారు చేసుకుంటున్నారు. ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ ఎన్నికలను ప్రభుత్వ పాలనకు రిఫరెండం గా తీసుకోవాలని సవాల్ విసిరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆ సవాల్‌ను వ్యక్తిగతంగా స్వీకరిస్తానని బదులిచ్చారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికలను ఎప్పుడూ ప్రభుత్వ పనితీరుకు సంపూర్ణ రెఫరెండంగా భావించలేమని చరిత్ర చెబుతోంది. ఇది రెఫరెండం కాదని.. కేవలం స్థానిక మంత్రమేనని విశ్లేషకుల అంచనా.

**అధికార పక్షానికే పట్టం.. సహజ సూత్రం**

సాధారణంగా ఏ రాష్ట్రంలోనైనా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగినప్పుడు మిగతా 02లో






# పాలమూరు టూ రాయచూర్

## మహబూబ్‌నగర్-గూడబెల్లూరు ఫోర్ లైన్ హైవేకు కేంద్రం ఆమోదం

- రూ.3,175 కోట్లతో NH-167 విస్తరణకు గ్రీన్ సిగ్నల్
- హైదరాబాద్-గోవా ఎకనామిక్ కారిడార్‌లో కీలక భాగం
- 80 కి.మీ మార్గం.. ప్రయాణ సమయం గంటన్నర తగ్గే అవకాశం
- త్వరలో టెండర్లు.. భూసేకరణ ప్రక్రియ వేగవంతం

03

హంగ్‌స్థానాల్లో

# కాంగ్రెస్ జెండా ఎగరాలి

## మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం



- మున్సిపల్ విజయంపై దృష్టి, అభివృద్ధి లక్ష్యాలపై దిశానిర్దేశం
- సమష్టి కృషితోనే విజయమని మంత్రులకు అభినందనలు తెలిపిన సీఎం
- రెండేళ్లలోనే ప్రజా ప్రభుత్వం నమ్మకం గెలుచుకుందన్న రేవంత్ రెడ్డి
- కార్యకర్తల శ్రమ వల్లే కాంగ్రెస్‌కు ఘన ఫలితాలంటూ ప్రశంసలు
- సంక్షేమం-అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచనలు
- మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశంలో ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఆదేశాలు

02

# పెరిగిన ఓటు బ్యాంక్

## కార్పొరేషన్లు.. మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జైత్రయాత్ర

- 39.80 శాతం ఓట్లతో అధికార పార్టీ హల్ చల్
- 'హస్తం' గాలికి రాలిన గులాబీ రెక్కలు
- కరీంనగర్ మినహా ఎక్కడా వికసించని కమలం
- ప్రధాన పార్టీలకు స్వతంత్రుల గట్టిపోటీ

రాష్ట్రవ్యాప్తంగా నగరాలు, పట్టణాల్లో ఓటర్ల సంఖ్య : 52,43,023

మున్సిపల్ ఎన్నికల్లో పోలైన ఓట్లు : 37,81,232

7 కార్పొరేషన్లలో సీట్లు (414)

| | |
|---|---|
| కాంగ్రెస్ | 190 |
| బీజేపీ | 75 |
| బీఆర్ఎస్ | 60 |
| ఇతరులు | 89 |
| మొత్తం | 414 |

02

116 మున్సిపాలిటీల్లో వార్డులు (2581)

| | |
|---|---|
| కాంగ్రెస్ | 1,347 |
| బీఆర్ఎస్ | 716 |
| బీజేపీ | 261 |
| ఇతరులు | 257 |
| మొత్తం | 2,581 |

## విధ్వంసం నుంచి

# పునర్నిర్మాణం వైపు

## రూ.3.32 లక్షల కోట్లతో ఏపీ బడ్జెట్

- అన్ని రంగాలకు భారీ కేటాయింపులు
- గత పాలనపై విమర్శలు, ప్రస్తుత అభివృద్ధిపై ధీమా వ్యక్తం చేసిన చంద్రబాబు
- సంక్షేమం-అభివృద్ధికి సమ ప్రాధాన్యత
- అసెంబ్లీ గౌరవ పునరుద్ధరణే లక్ష్యం.. సీఎం కీలక వ్యాఖ్యలు
- పెన్షన్లు, తల్లికి వందనం, స్త్రీశక్తి -సంక్షేమంలో భారీ ఖర్చులు
- అన్నదాత సుఖీభవతో రైతులకు ఆర్థిక భరోసా

10



వైసీపీ పాలనలో జరిగిన విధ్వంసాన్ని గుర్తు చేస్తూ, రాష్ట్రాన్ని పునర్నిర్మాణ దిశగా తీసుకెళ్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో స్పష్టం చేశారు. సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తూ రూ. 3.32 లక్షల కోట్ల బడ్జెట్‌తో పాటు వ్యవసాయానికి ప్రత్యేకంగా రూ. 53,752 కోట్ల కేటాయింపులు చేసి, రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. దాదాపు రూ. 3.32 లక్షల కోట్లతో బడ్జెట్ ను ఈరోజు ఏపీ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. అన్ని రంగాలకు భారీ కేటాయింపులు చేశారు.

# మోడీ సాహసం..

## అస్సాం హైవే మీద దిగిన విమానం

సీ-130జే యుద్ధ విమానంతో మోడీ ల్యాండింగ్

09

- చైనా సరిహద్దుల వద్ద వ్యూహాత్మక అడుగు
- హైవేనే రన్‌వేగా మార్చిన రక్షణ శాఖ
- ఈశాన్యంలో తొలి ఎమర్జెన్సీ ఎయిర్ స్ట్రిప్ ఏర్పాటు



ముద్ర

నేడు టీ20 వరల్డ్ కప్ 2026లో ఇండియా వర్సెస్ పాకిస్తాన్ మ్యాచ్ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా క్రీడాభిమానులు ఎదురుచూస్తున్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 15.02.2026
www.mudranews.in | @mudranews



శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయం



కర్నూలు

ఇది ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటి. నల్లమల అడవుల్లో ఉన్న ఈ క్షేత్రం శైవ, శక్తి పీఠంగా ప్రసిద్ధి.

# చెదిరిన ఓటు బ్యాంకు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
'హస్తం'సునామీలో.. ప్రధాన పార్టీల ఓటు బ్యాంకు చెల్లాచెదురైంది. ఈ నెల 11 విడుదలైన పుర ఫలితాల్లో రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు.. 116 మున్సిపాలిటీల్లో ఓటర్ల తీర్పు ఏకపక్షంగా వెల్లువెత్తింది. ఇందులో కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు గణనీయంగా పుంజుకుంది. 2020 జనవరిలో జరిగిన మున్సిపల్ ఎన్నికలతో పోలిస్తే ఈ సారి తొమ్మిదింతలు పెరిగింది. 2020లో రాష్ట్రంలో 120 మున్సిపాలిటీలకు జరిగిన ఎన్నికల్లో కేవలం 3 స్థానాల్లో గెలిచిన కాంగ్రెస్... ఈసారి ఏకంగా 64 పుర పీఠాలను కైవసం చేసుకున్నది. మొత్తం పోలైన ఓట్లతో పోలిస్తే అప్పుడు కేవలం 09 శాతం ఓటు బ్యాంకు సాధించిన కాంగ్రెస్.. ఈసారి 39.80శాతం ఓట్లు సాధించింది. గత ఎన్నికల్లో తెలంగాణ ఇచ్చింది తామేనంటూ ప్రజల్లో వెళ్లి భంగపడ్డ కాంగ్రెస్ పార్టీ.. ఈ సారి గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి అక్రమాలు, రెండున్నరేళ్ల తమ పాలనలో చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించి ముందుకెళ్లింది. దీంతో అసెంబ్లీ, సర్పంచి ఎన్నికల్లో మార్పు కోరుకున్న ప్రజలు ఈ సారి మున్సిపల్ ఎన్నికల్లోనూ ఓటు బ్యాంకు రూపంలో కాంగ్రెస్ కు వెన్నంటి నిలిచారు. పుర పోరులోనూ కొత్త ఆశలు.. ఆకాంక్షలతో ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించారు. ఇటు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మాత్రం అసెంబ్లీ, లోక్ సభ, సర్పంచ్ ఎన్నికల్లో చవి చూసిన ఫలితాలనే మున్సిపల్ పోరులో చవి చూసింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన బీఆర్ఎస్ ను నగర, పట్టణ ప్రజలు ఈ సారి ఆదరించలేదు. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో ఎదుర్కొన్న విచారణలు, అవినీతి ఆరోపణలతో ఉక్కిరిబిక్కిరి అయిన బీఆర్ఎస్ పుర ఓటర్ల దృష్టిని ఆకర్శించడంలో ఘోరంగా విఫలమైంది. ఫలితంగా గత మున్సిపల్ ఎన్నికల్లో ఎనిమిది కార్పొరేషన్లలో దూసుకెళ్లిన కారు.. ఈ సారి ఒక్క కార్పొరేషన్ పైనా గులాబీ జెండా ఎగురవేయలేకపోయింది. అప్పట్లో పట్టణాల్లోనూ పరుగులు పెట్టిన కారు 120 మున్సిపాలిటీలకు గానూ 109 స్థానాలు సొంతం చేసుకోగా.. ఈ సారి ఫలితాల్లో బోల్తా పడింది.116 మున్సిపాలిటీలకు కేవలం 13 స్థానాలతోనే సరిపెట్టుకున్నది. మొత్తం పోలైన ఓట్లలో కేవలం 28.75శాతం ఓట్లు మాత్రమే సాధించింది. ఇక అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో తొమ్మిది చొప్పున సీట్లతో వికసించి.... ప్రస్తుతం రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయం తామేనంటూ గొప్పలు చెప్పుకున్న కమలం పార్టీకి.. ఈ ఎన్నికల్లో చావు తప్పి కన్ను లొట్టబోయినంత పనైంది. ఏడు కార్పొరేషన్లలో ఒక్క కరీంనగర్ లో తప్పా ఎక్కడా తన ప్రభావాన్ని చూపలేకపోయింది. ఇటు 116 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగితే ఒక్క పుర పీఠంపైనా కాషాయం జెండా ఎగురించలేకపోయింది. ఈ క్రమంలో 15.67శాతం ఓట్లతోనే సరిపెట్టుకున్నది. మరోవైపు.. అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కు మద్దతు తెలిపి.. ఈ సారి ఒంటరిగా బరిలో నిలిచిన సీపీఐ అనూహ్యంగా.. కొత్తగూడెం కార్పొరేషన్ పై ఎర్రజెండా ఎగురవేసింది. ఈ ఎన్నికల్లో మొత్తం 49,450 ఓట్లు సాధించిన ఆ పార్టీ 1.30శాతం ఓట్లు సాధించి ఇతర పార్టీలకు షాక్ ఇచ్చింది. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో కార్పొరేషన్లతో పాటు అనేక మున్సిపాలిటీల నుంచి తన అభ్యర్థులను బరిలో దింపిన ఎంఐఎం పార్టీ ఎక్కడా తన ప్రాభావాన్ని కనబర్చలేకపోయింది. నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్, నల్గొండ వంటి ముఖ్య నగరాల్లో తనకు గట్టిపట్టు ఉందని భావించిన ఆ పార్టీకి ఆయా కార్పొరేషన్ ఓటర్లు ఆదరించలేదు. దీంతో ఈ ఎన్నికల్లో 3.28 శాతం ఓట్లు సాధించింది. మరోవైపు ఈ సారి ఎన్నికల్లో జాగృతి మద్దతులో బరిలో నిలిచిన ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్ బీ) రాష్ట్రంలో ప్రధాన పార్టీలు, నాయకులకు అందరికీ ఝలక్ ఇచ్చింది. ఇందులో భాగంగా గద్వాల జిల్లాలోని వడ్డేపల్లి మున్సిపాలిటీపై సింహం జెండా ఎగురవేసింది. ఈ ఎన్నికల్లో 1.51శాతం ఓట్లు సాధించి అందరినీ ఔరా అనిపించింది. వీరితో పాటు ప్రధాన పార్టీల నుంచి టిక్కెట్లు ఆశించి భంగపడి.. స్వతంత్రంగా పోటీ చేసిన అభ్యర్థులు ఈ ఎన్నికల్లో అందరి దృష్టిని ఆకర్శించారు. 3,14,096 ఓట్లు సాధించి 8.30శాతం ఓటింగ్ తో ప్రధాన పార్టీ అభ్యర్థుల గెలుపును పరోక్షంగా అడ్డుకున్నారు. వీరి పోటీతో మొత్తం 38 మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడగా.. అక్కడ ఏ పార్టీ అధికారంలో రావాలన్నా వారే కింగ్ మేకర్లుగా మారారు. దీంతో ప్రధాన పార్టీలన్నీ స్వతంత్రుల మద్దతు కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. తాయిలాలు, ఆఫర్లతో బుజ్జగించి వారిని తమ వైపు లాక్కునే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో ఈ నెల 16న జరగనున్న కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నికలో వీరి మద్దతు అనివార్యమైంది. దీంతో ఈ ఎన్నిక ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతున్నది.



### మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వారీగా పోలైన ఓట్ల శాతం

| పార్టీ | పోలైన ఓట్లు | శాతం |
|---|---|---|
| కాంగ్రెస్ | 15,05,006 | 39.80 |
| బీఆర్ఎస్ | 10,87,347 | 28.75 |
| బీజేపీ | 5,92,823 | 15.67 |
| స్వతంత్రులు | 3,14,096 | 8.30 |
| ఎంఐఎం | 1,24,236 | 3.28 |
| ఏఐఎఫ్ బి | 57,129 | 1.51 |
| సీపీఐ | 49,450 | 1.30 |
| సీపీఎం | 22,048 | 0.58 |
| జనసేన | 13,504 | 0.37 |
| బీఎస్పీ | 7,115 | 0.20 |

# రెఫరెండమా?

**(మొదటిపేజీ తరువాయి)**
ఓటర్లు అధికారంలో ఉన్న పార్టీ వైపు మొగ్గు చూపడం ఒక సహజమైన ప్రక్రియ. మున్సిపాలిటీలు, పంచాయతీలు అభివృద్ధి చెందాలన్నా, నిధులు సకాలంలో విడుదల కావాలన్నా రాష్ట్ర ప్రభుత్వ సహకారం తప్పనిసరి. అందుకే, ప్రజలు తమ స్థానిక వార్డుల అభివృద్ధిని కాంక్షించి, అధికార పార్టీ అభ్యర్థులకే ఓటు వేసేందుకు ప్రాధాన్యత ఇస్తారు. ఇది పాలనపై మెప్పు కాదు, స్థానిక అవసరాల కోసం తీసుకునే ఒక వ్యూహాత్మక నిర్ణయం మాత్రమే అనుకోవచ్చు.

**గత చరిత్ర చెబుతున్న సత్యం**

చరిత్రను పరిశీలిస్తే స్థానిక ఎన్నికల ఫలితాలకు, అసెంబ్లీ ఎన్నికల తీర్పునకు పొంతన ఉండదు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేవలం నాలుగు మున్సిపాలిటీలకే పరిమితమైంది. కానీ, సరిగ్గా మూడున్నరేళ్ల తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అదే కాంగ్రెస్ అనూహ్య విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. దీన్ని బట్టి చూస్తే, స్థానిక సంస్థల ఫలితాలు రాబోయే అసెంబ్లీ ఎన్నికల భవిష్యత్తును నిర్ణయించవని స్పష్టమవుతోంది.
విపక్షాల వాదన – గెలిచినప్పుడు మౌనం ప్రభుత్వ వ్యతిరేకతను చాటిచెప్పేందుకు విపక్షాలు ఏ ఎన్నికలు జరిగినా వాటిని రెఫరెండం అని పిలవడం రివాజుగా మారింది. అయితే, ఫలితాలు ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చినప్పుడు మాత్రం ఆ అంశంపై విపక్షాలు మౌనం వహిస్తాయి. నిజానికి స్థానిక ఎన్నికల్లో గెలుపు ఓటములు అభ్యర్థుల వ్యక్తిగత ప్రభావం, స్థానిక కుల సమీకరణాలు , ప్రభుత్వ అండదండలపై ఆధారపడి ఉంటాయి తప్ప, కేవలం ముఖ్యమంత్రి పనితీరుపైనే ఆధారపడి ఉండవు.

**అభివృద్ధికి లభించిన అదనపు బలం**

ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన ఆధిక్యాన్ని ప్రభుత్వం మరింత వేగంగా అభివృద్ధి చేయడానికి ప్రజలు ఇచ్చిన మద్దతుగా చూడాలి. అధికార పార్టీకి క్షేత్రస్థాయిలో బలం చేకూరడం వల్ల ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి వేగంగా వెళ్లే అవకాశం ఉంటుంది. వార్డు మెంబర్లు, చైర్మన్లు అధికార పార్టీ వారే ఉంటే పాలనలో సమన్వయం సులభమవుతుందనే భావనతోనే ఓటర్లు ఈ తీర్పు ఇచ్చారని విశ్లేషించవచ్చు. కేటీఆర్ విసిరిన రెఫరెండం సవాల్ రాజకీయ విమర్శలకు వేదికగా మారినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఓటరు నాడి వేరుగా ఉంది. స్థానిక సంస్థలు నిలబడాలంటే రాష్ట్ర ప్రభుత్వ మద్దతు అవసరమని భావించిన ఓటర్లు, ప్రస్తుత ప్రభుత్వానికి మరింత బాధ్యతను అప్పగించారు. ఈ ఫలితాలు ప్రభుత్వానికి బలాన్ని ఇచ్చాయి తప్ప, ప్రజాభిప్రాయం పూర్తిగా ప్రభుత్వానికి అనుకూలంగా ఉందని చెప్పలేం.





## ఎక్స్ అఫీషియో సభ్యులకు ఓటు మెలిక




**(మొదటి పేజీ తరువాయి)**
మున్సిపల్ పరిధిలో ఓటరుగా నమోదు కాకపోతే.. వారు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఓటేయటానికి, కొనసాగడానికి అనర్హులని తేల్చి చెప్పింది. నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేకుండా ఓట్లు వేస్తే అవి చెల్లవని స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులకు రాష్ట్ర ఎన్నికల సంఘం సర్క్యులర్ జారీ చేసింది. గతంలో రాజ్యసభ ఎంపీలు, ఎమ్మెల్సీలు రాష్ట్రంలోని తమకు నచ్చిన మున్సిపాలిటీని ఎంచుకుని ఎక్స్ అఫీషియో సభ్యులుగా మేయర్, ఛైర్మన్ ఎన్నిక కోసం ఓటు వేసే అవకాశం ఉండేది. ఆ సమయంలో ఈ అంశంపై వివాదం కొనసాగింది. దీన్ని విచారించిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం.. స్థానికంగా ఓటు లేకుండా ఇతర మున్సిపాలిటీల్లో ఓటు వేయటం నిబంధనలకు విరుద్ధమని వెల్లడించింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలోనే తాజాగా ఎస్ఈసీ నిర్ణయం తీసుకుంది. ఇదీలావుంటే.. హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీల్లో ఎక్స్ అఫీషియో ఓట్లు కీలకంగా మారాయి. ఎస్ఈసీ కొత్త నిబంధనలతో.. స్థానికంగా ఓటు లేని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు తమ ఓటును వినియోగించుకోలేని పరిస్థితి నెలకొన్నది. దీంతో అనేక చోట్ల మున్సిపల్ పీఠాల సమీకరణాలు మారే అవకాశాలున్నాయి. మరోవైపు మేయర్, మున్సిపల్ ఛైర్మన్ల ఎన్నికకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేసింది ఎస్ఈసీ. ఈనెల 16న ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో మధ్యాహ్నం 12.30కి ప్రత్యేక సమావేశం నిర్వహించి తొలుత వార్డు సభ్యులు, కార్పొరేటర్లతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఆ తర్వాత మేయర్, డిప్యూటీ మేయర్లు, ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్ల ఎన్నిక జరగనుంది.

## కాంగ్రెస్ జెండా ఎగరాలి

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
మున్సిపల్ ఫలితాల్లో హంగ్ ఏర్పడిన స్థానాల్లో వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ మంత్రులు, సీనియర్ నాయకులకు సూచించారు. క్షేత్రస్థాయిలో స్వతంత్రులు, ఇతర పార్టీ అభ్యర్థులతో సంప్రదింపులు జరిపి ఆయా పుర పీఠాలపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ఫలితాల విడుదల తర్వాత తదుపరి కార్యచరణపై దృష్టి సారించిన సీఎం..శనివారం జూబ్లీహిల్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రులు, సీనియర్ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేషన్లు, పురపాలక సంఘాల ఫలితాలపై చర్చించారు. మున్సిపల్ ఎన్నికల్లో కష్టపడిన ప్రతి ఒక్కరిని సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. ఆశించిన ఫలితాలు రావడంతో సంతృప్తిని వ్యక్తం చేసిన సీఎం హంగ్ మున్సిపాలిటీల విషయములో వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లాలని సూచించారు. కాగా ఈ నెల 11న విడుదలైన ఫలితాల్లో 38 మున్సిపాలిటీల్లో హంగ్ వచ్చింది. వీటిలో సాధ్యమైనన్ని మున్సిపాలిటీలలో అధికారం నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. స్వతంత్రుల మద్దతుతో సుమారు 20 వరకు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేసే అవకాశాలున్నాయని పార్టీ నేతలు భావిస్తున్నారు. ఆ దిశగా తీసుకోవాల్సిన వ్యూహంపై సీఎం దిశానిర్దేశం చేశారు. మేయర్, ఛైర్మన్ ఎంపిక కార్యచరణపై నేతలకు ఆదేశాలు జారీచేశారు. ఎక్స్ అఫీషియో ఓటర్ల నమోదుపై సీఎం సూచనలు చేశారు.

## బీజేపీ ఆత్మవిమర్శ చేసుకోవాల్సిందేనా?



**ముద్ర డెస్క్ :**
తెలంగాణలో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల ఫిబ్రవరి 11న ఎన్నికలు జరిగాయి. 13న కౌంటింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. 2,569 వార్డుల్లో 1,530 స్థానాలు గెలిచి పట్టణ రాజకీయాల్లో బలం చాటుకుంది. కార్పొరేషన్లలో 140 సీట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఇక బీఆర్ఎస్ 781 వార్డులు, కార్పొరేషన్లలో 53 మాత్రమే గెలిచి ద్వితీయ స్థానంలో ఉంది. జాతీయ పార్టీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ 245 వార్డులు, కార్పొరేషన్లలో 66 డివిజన్లు గెలిచింది. అయితే గతంతో పోలిస్తే బీజేపీ సీట్లు గణనీయంగా తగ్గాయి. ఎంపీలు, ఎమ్మెల్యే సీట్లు పెరిగినా.. ఆ తర్వాత జరిగిన పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ బలం తగ్గడం ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉంది.

**హంగ్ మున్సిపాలిటీల సవాల్..**
ఇక మున్సిపల్ ఎన్నికల్లో 26 మున్సిపాలిటీల్లో ఎలాంటి పార్టీకీ మెజారిటీ లేకపోవడంతో స్వతంత్రులు, వామపక్షులు కీలకం. కాంగ్రెస్ ఎక్కువ స్థానాలు సాధించేందుకు కొఆప్షన్ వ్యూహాలు రూపొందిస్తోంది. కాంగ్రెస్ పంచాయతీ విజయాల తర్వాత పట్టణాల్లో కూడా బలపడింది. బీఆర్ఎస్ పట్టణ ప్రజల అసంతృప్తికి గురై చతికిలబడింది. బీజేపీకి ఎమ్మెల్యేలు, ఎంపీల ప్రాంతాల్లో (ఆదిలాబాద్, కామారెడ్డి) మెరుగైన ఫలితాలు వచ్చినా, మొత్తంగా తగ్గుదల. భైంసాలో రెబెల్స్ విజయం పార్టీ అంతర్గత సమస్యలను తెలియజేస్తోంది.
పట్టణ ఓటర్లు స్థానిక సమస్యలు పరిష్కరించే అభ్యర్థులకు ప్రాధాన్యం ఇచ్చారు. కేంద్రం పంచాయతీలకు, మున్సిపాలిటీలకు నేరుగా నిధులు ఇస్తున్నా.. బీజేపీని ఆదరించలేదు. బీజేపీని జాతీయ పార్టీగా, దేశ రక్షణ పార్టీగానే తెలంగాణ ప్రజలు చూస్తున్నారు. స్థానిక సమస్యలు పరిష్కరించే పార్టీగా భావించడం లేదు. ఈ విషయపై బీజేపీ దృష్టి పెట్టాలి. బీజేపీ బలం తగ్గడం తెలంగాణతో పాటు, దేశ విషయాలపై ప్రజల అభిప్రాయాన్ని సూచిస్తుంది.

## నేడు మహాశివరాత్రి.. లింగోద్భవ కాలమిదీ?

శివుడు అభిషేక ప్రియుడు. భక్తసులభుడు కూడా. దేవుళ్ళ యందు శంకరుడు ఎంతో శ్రేష్టుడు. అందువల్లే శంకరుడికి పూజ చేస్తే ఎన్నో జన్మల పుణ్యం లభిస్తుంది. పాపాలు తొలగిపోతాయి. శివరాధన వల్ల మోక్షం లభిస్తుంది. సామ్రాజ్యసిద్ధి కలుగుతుంది.
శివుడికి పూలు అంటే చాలా ఇష్టం. ఆరాధన అత్యంత ప్రీతిపాత్రం. ఏ పేరుతో పిలిచినా పలుకుతాడు శంకరుడు. అందువల్లే 8 విభూతులను, సమస్తంగా సంపదలను పరిపూర్ణంగా అందిస్తాడు శంకరుడు.
శివరాత్రి రోజున శంకరుడు లింగం రూపంలో ఆవిర్భవిస్తాడు. సమస్త భక్తకోటిని అనుగ్రహిస్తుంటాడు. అందువల్లే భక్తులు మహాశివరాత్రిని పరమ పుణ్య పవిత్ర దినంగా భావిస్తుంటారు. ఆరోజున శివుడిని ఆరాధిస్తే జన్మ చరితార్థం అవుతుంది. అందువల్లే జన్మకో శివరాత్రి అని సామెత పుట్టింది. శివుడిని స్మరించడం వల్ల స్వామి అనుగ్రహం కలుగుతుంది.
మహాశివరాత్రి రోజు స్వామివారి నామస్మరణ చేస్తే పరిపూర్ణమైన అనుగ్రహం లభిస్తుంది. మహాశివరాత్రి రోజు లింగోద్భావ కాలం ఏర్పడుతుంది. కొన్ని సందర్భాలలో లింగోద్భవ కాలం అర్ధరాత్రి పూట కాస్త అటు ఇటుగా వస్తూ



ఉంటుంది.
ఈ ఏడాది లింగోద్భవ కాలం రాత్రి 12 గంటల మూడు నిమిషాల 10 సెకండ్ల నుంచి 12 గంటల 53 నిమిషాల 52 సెకండ్ల వరకు ఉంటుంది. సమయంలో శివుడికి అభిషేకం జరిపితే ఎంతో పుణ్యం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి.
వివిధ కారణాల వల్ల శివుడికి అభిషేకం జరపలేనివారు పంచాక్షరి మంత్రాన్ని జపిస్తే.. శివుడు అనుగ్రహిస్తాడని.. సకల పాపాల నుంచి తొలగిస్తాడని శివపురాణం చెబుతోంది. శివరాత్రి రోజు నుదుటన విభూతి రేఖలు ధరించాలని.. రుద్రాక్షలను మెడలో మాలగా ధరిస్తే పుణ్యం లభిస్తుందని.. స్వామివారి సన్నిధిలో దీపాలు వెలిగిస్తే.. పరమేశ్వరుడి కరుణాకటాక్షాలు లభిస్తాయని వేద పండితులు చెబుతున్నారు.

## బంగ్లాదేశ్‌లో మార్పు.. భారత్‌కు అనుకూల వాతావరణం?

బంగ్లాదేశ్‌లో 18 నెలల తర్వాత మార్పు రాబోతోంది. ఫిబ్రవరి 12న పార్లమెంటు ఎన్నికలు జరిగాయి. షేక్ హసీనా పతనం తర్వాత 18 నెలల అస్థిరతకు తెరపడనుంది. బంగ్లాదేశ్ ఎన్నికల్లో బీఎన్‌పీ ఘన విజయం సాధించింది. తారీఖ్ రహ్మాన్ నేతృత్వంలో కొత్త పాలన ఆరంభం ద్వారా భారత వ్యతిరేక శక్తులు బలహీనపడ్డాయి.

**యూనస్ పాలనలో ఉద్రిక్తతలు**
మహ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వం చైనా, పాకిస్తాన్ మద్దతుతో భారత్తుపై విద్వేషాలు రేకెత్తించింది. సిలిగురి కారిడార్, సెవెన్ సిస్టర్స్ వంటి సున్నిత అంశాలు, హిందూ సమాజంపై దాడులు ద్వైపక్ష సంబంధాలను దెబ్బతీశాయి. విద్యార్థి నేతల హత్యలు భారత వ్యతిరేక ప్రచారంగా మారాయి.

**బీఎన్‌పీ విజయతో..**
తారీఖ్ రహ్మాన్ తిరిగి దేశానికి వచ్చి తొలి సమావేశంలో హిందువుల స్వేచ్ఛకు హామీ ఇచ్చారు. మరోవైపు పాక్ అనుకూల జమాత్–ఏ–ఇస్లామీని ప్రజలు తిరస్కరించారు. ఎన్నికల్లో గెలిచిన తారీఖ్ రహ్మాన్‌కు భారత ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఇక యూనస్ కూడా తారీఖ్ ఎన్నికను ప్రశంసించారు.

**పాకిస్తాన్ ఏడుపు..**
ఇదిలా ఉంటే జియో పాలిటిక్స్‌లో పాక్‌లో కీలక పరిణామాలు జరుగుతున్నా. ఆ దేశ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ అమెరికా తమను 'టాయిలెట్ పేపర్'లా వాడుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశాడు. విద్యా విధానంలోనూ 1998 నుంచి అమెరికా ఆధిపత్యం చెలాయిస్తోందని, అమెనికా అనుకూల పాఠాలే బోధింస్తోందని తెలిపారు. బార్సినరీ వంటి ఆరోపణలు పాక్ బలహీనతను తెలియజేస్తున్నాయి.

**భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం..**
ఇక ఇటీవల కుదిరిన భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంలోని కఠిన నిర్ణయాలను అమెరికా ఉపసంహరించుకుంది. 500 బిలియన్ డాలర్ నిబంధన తొలగించింది. పల్స్, ఫార్మా ఎగుమతులపై జీరో టారిఫ్ హామీలు ఇచ్చింది. ఈ డీల్‌తో ఎగుమతులు 40 నుంచి 80 బిలియన్ డాలర్లకు పెరిగే అవకాశం. అఖండ భారత మ్యాప్ వివాదం తొలగించారు. రష్యా ఆయిల్ చర్చలు కొనసాగుతున్నాయి.

**ట్రంప్ విధానాల ప్రభావం**
ట్రంప్ వ్యాపార ఒత్తిడి విధానం దేశాలను కలవరపెడుతోంది. ఎఫ్‌స్టీన్ ఫైల్స్‌లో పేరు, ఇరాన్ యుద్ధ సూచనలు వివాదాలు సృష్టిస్తున్నాయి. అమెరికా ప్రయోజనాలు పైన పెట్టుకుని మిత్ర–శత్రువులను ఒత్తిడి చేస్తోంది. బీఎన్‌పీ పాలన భారత్‌తో సహకారాన్ని పెంచి, పొరుగు స్థిరత్వాన్ని తీసుకువస్తుంది. పాక్ బలహీనత, అమెరికా ఒప్పందాలు భారత వాణిజ్యానికి ఊరట ఇస్తాయి. రష్యా మిత్రత్వం కొనసాగుతూ ట్రంప్ అనిశ్చితులను సమతుల్యం చేస్తాయి. దీర్ఘకాలంలో ప్రాంతీయ భద్రత పెరుగుతుంది.



## ఇరాన్‌పై విరుచుకుపడబోతున్న అమెరికా..

**ముద్ర, డెస్క్ :**
అగ్రరాజ్యం అమెరికా అధినేత డొనాల్డ్ ట్రంప్.. వెనెజువెలా విజయం తర్వాత గ్రీన్‌లాండ్ ఆక్రమణకు యత్నించారు. యురోపియన్ యూనియన్ నుంచి వ్యతిరేకత రావడంతో ప్రస్తుతానికి తోక ముడిచాడు. ఇప్పుడు తన ఫోకస్ ఇరాన్‌పై పెట్టాడు. ఇరాన్‌లో ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో అక్కడి ప్రజల నిరసనలను ఆసరాగా చేసుకుని ఇరాన్‌పై దాడికి సమాయత్తమవుతున్నాడు. ఏ క్షణంలో అయినా ఇరాన్‌పై విరుచుకు పడేందుకు బలగాలను మోహరించాడు. అణు కార్యక్రమాలు ఆపాలనే లక్ష్యంతో ఈ దాడులకు సిద్ధమవుతునర్నాడు? ఒకవైపు చర్చలు జరుగుతున్నప్పటికీ యుద్ధ నౌకల తరలింపు మధ్య ప్రాచ్యంలో టెన్షన్ పెంచుతోంది.
ప్రపంచంలోనే అతిపెద్ద విమానవాహక నౌక యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్. ఫోర్డ్‌ను కేరిబియన్ నుంచి అమెరికా మధ్యప్రాచ్యానికి పంపుతోంది. యూఎస్ఎస్ అబ్రహాం లింకన్ ఇప్పటికే అరేబియా సముద్రంలో ఉంది. వెనెజువెలాలో మదూరో అరెస్ట్‌కు చేపట్టిన ఆపరేషన్‌లో ఈ నౌక పాల్పంచుకుంది.
అమెరికా ఇరాన్ అణ్వాయుధాలు కలిగి ఉన్నాయని ఆరోపిస్తోంది. తక్షణ నిలిపివేయాలని, ఒప్పందం కుదుర్చుకోవాలని డిమాండ్ చేస్తోంది. ఇరాన్ ఖండించినా ట్రంప్ నమ్మడం లేదు. దీంతో దాడితోనే ఇరాన్‌ను దారికి తెచ్చుకోవాలని భావిస్తోంది. మరోవైపు అరబ్ దేశాలు యుద్ధ దాడి భయంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.
చర్చలతోపాటు సైనిక బలప్రదర్శన ఇరాన్‌ను ఒత్తిడి చేస్తూ బెదిరింపు పెంచుతోంది. ఇది ప్రాంతీయ స్థిరత్వాన్ని పరీక్షిస్తుంది. యుద్ధం జరిగితే ఆర్థికం, ఇంధన ధరలు ప్రపంచవ్యాప్తంగా ప్రభావితమవుతాయి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
15.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews
3 జనరల్ న్యూస్
General news

తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ శైవ ఆలయాలు

శ్రీకాళహస్తి ఆలయం (తిరుపతి సమీపం) పంచభూతాల లింగాల్లో వాయు లింగంగా ప్రసిద్ధి. రాహు-కేతు దోష నివారణకు భక్తులు ఎక్కువగా వస్తారు.



# నిజామాబాద్ లో ప్రతిపక్షంలో ఉంటాం

- **కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కు గట్టిపోటీ ఇచ్చాం**
- **వార్డు సభ్యులు, కార్పొరేటర్లను ఎత్తుకెళ్తే తీవ్ర పరిణామాలు**
- **నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్**



**ముద్ర, నిజామాబాద్:**

నిజామాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో 28 డివిజన్లలో విజయం సాధించి సింగిల్ లార్జెస్ట్ పార్టీగా నిలిచిన బీజేపీ ప్రతిపక్షంలో ఉంటుందని స్థానిక ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రకటించారు. ఈ ఎన్నికల్లో తాము కాంగ్రెస్, బీఆర్ఎస్ ను డామినేట్ చేశామన్నారు. తన పార్లమెంట్ పరిధిలోని మిగతా మున్సిపాలిటీల్లోనూ బీఆర్ఎస్ కంటే ఎక్కువ సీట్లు సాధించామన్నారు. శనివారం నిజామాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎలాగైనా గెలిచాం కాదా అని కాంగ్రెస్.. మున్సిపల్ వార్డు సభ్యులు, కార్పొరేటర్లను బలవంతంగా ఎత్తుకెళ్తే బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ బలమైన ప్రభుత్వమేమి కాదన్న అర్వింద్.. సీఎం రేవంత్ రెడ్డి బలమైన పొజిషన్‌లో లేరన్నారు. సీఎంను ప్రజలు ఛీ కొడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీస్ శాఖను తన స్వార్ధ రాజకీయాలకు ఉపయోగించుకుంటోందని ఎంపీ ఆరోపించారు. పోలీసులు తనపై కేసులు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. వాస్తవానికి తానే పోలీసుల పై కేసు పెట్టాలన్నారు. ఈ నెల 11న జరిగిన ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను పోలింగ్ బూత్ ల నుంచి బయటికి పంపిన పోలీసులు.. కాంగ్రెస్ కు ఓటు వేయాలని చెప్పారని మండిపడ్డారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లను ఎత్తుకెళ్లడానికి కాంగ్రెస్ వారికి సహాయం చేస్తున్నారని ఆరోపించారు. పోలీసులు శాంతి భద్రతలు పరిరక్షిస్తారా లేక బ్రేక్ చేస్తారా అని ప్రశ్నించారు. రాజకీయాలను భ్రష్టుపట్టించారనే కేసీఆర్‌ను ప్రజలు ఓడించారని ఇప్పుడు రేవంత్ రెడ్డి మళ్లీ అదే చేస్తున్నారని దుయ్యబట్టారు. రాజకీయాల్లో హుందాతనం ఉండాలని కార్పొరేటర్లు ఎవరికి మద్దతు ఇవ్వాలనేది వారి వారి పార్టీలు నిర్ణయించుకుంటాయన్నారు.

# పాలమూరు టు రాయచూర్

- **రాష్ట్రంలో కొత్తగా ఫోర్ లైన్ హైవే**
- **గూడబెల్లూరు వరకు హైవే**
- **కేంద్రం గ్రీన్ సిగ్నల్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో మరో 4 లైన్ హైవే అందుబాటులోకి రానుంది. మహబూబ్‌నగర్ నుంచి గుడబెల్లూరుకు ఈ హైవే నిర్మించనున్నారు. ఈ మేరకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.3,175 కోట్ల నిధుల విడుదలకు పచ్చజెండా ఊపింది. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. తెలంగాణలో మరో కొత్త హైవే అందుబాటులోకి రానుంది. మహబూబ్‌నగర్ నుంచి కర్ణాటక సరిహద్దు గుడబెల్లూరు వరకు చేపట్టనున్న 4 లైన్ల జాతీయ రహదారి (ఎన్ హెచ్167 ) ప్రాజెక్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ హైవే నిర్మాణానికి రూ.3,175 కోట్ల నిధుల విడుదలకు పచ్చజెండా ఊపింది. ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ కేంద్ర కేబినెట్ భేటీ ముగిసింది. ఈ భేటీలో మహబూబ్‌నగర్ గుడబెల్లూరు 4 లైన్ల హైవే నిర్మాణానికి రూ.3,175 కోట్ల నిధుల చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మొత్తంగా రూ. 1.60 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు కేబినెట్ భేటీలో ఆమోదం తెలిపారు. ఇక మహబూబ్‌నగర్ గుడబెల్లూరు ప్రాజెక్టు హైదరాబాద్ గోవా ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా ఉంది. దీనివల్ల హైదరాబాద్ నుంచి రాయచూర్, మంత్రాలయం, మరియు గోవా వెళ్లే ప్రయాణికులకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. రూ.3,175 కోట్ల వ్యయంతో 80.01 కిలోమీటర్లు హ్యామ్ విధానంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఈ ప్రాజెక్టు చేపట్టనుంది. ఈ రహదారి మహబూబ్‌నగర్ నుంచి మొదలై.. దేవరకద్ర, మరికల్, మఖ్తల్, మాగనూరు మీదుగా గూడెబల్లూరు ( రాయచూర్ సరిహద్దు) వరకు సాగుతుంది. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉండటానికి మహబూబ్‌నగర్, దేవరకద్ర, మరికల్, మఖ్తల్, మాగనూరు పట్టణాల వద్ద ప్రత్యేకంగా బైపాస్ రోడ్లను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 2 లైన్ల రోడ్డును 4 లైన్లుగా మార్చడం



వల్ల ప్రయాణ సమయం దాదాపు 1.5 గంటలు తగ్గుతుంది. నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల ఆర్థిక అభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుంది. హైదరాబాద్ నుంచి గోవా వెళ్లే వారికి ఇది అత్యంత వేగవంతమైన మార్గంగా మారుతుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర క్యాబినెట్ ఆమోదం లభించగా.. టెండర్ల ప్రక్రియ కూడా ప్రారంభం కానుంది. భూసేకరణకు సంబంధించిన నష్టపరిహారం చెల్లింపులు కూడా జరుగుతున్నాయి. ఇక రాష్ట్రంలో మరికొన్ని రోడ్డు ప్రాజెక్టులు కూడా ప్రారంభ దశలో ఉన్నాయి. మన్ననూరు శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు కూడా ప్రారంభం కానున్నాయి. శ్రీశైలం ఆలయానికి దగ్గరగా ఈ కారిడార్ నిర్మించనున్నారు. దీంతో శ్రీశైలం వెళ్లే వారికి సమయంతో పాటు దూరం తగ్గనుంది.

# గుమ్మడి నర్సయ్యకు గౌరవ డాక్టరేట్



**ముద్ర, ఇల్లెందు:**

నిస్వార్థ ప్రజా ప్రతినిధి ప్రజా పోరాటాల యోధుడు పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు నేటికీ ఉద్యమమే ఊపిరిగా బతుకుతున్న ప్రజలే ప్రాణంగా, అభివృద్ధి ధ్యేయంగా పోరాడుతున్న ఇల్లెందు నియోజక వర్గానికి ఐదుసార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన గుమ్మడి నరసయ్య గ్లోబల్ పీస్ యూనివర్సిటీ చెన్నై వారి నుండి గౌరవ డాక్టరేట్ అందుకున్నరు.

# తెలంగాణలో ఎంఐఎం ఆటలు సాగనివ్వం

- **ఎంఐఎం ప్రాబల్యమున్న పట్టణాల్లో బీజేపీ బలపడింది**
- **మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో బీఆర్ఎస్, ఎంఐఎం అనైతిక పొత్తులు**
- **అయినా ప్రజలు బీజేపీనే ఆశీర్వదించారు**
- **మీడియాతో కేంద్రమంత్రి బండి సంజయ్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

తెలంగాణలో ఎంఐఎం ఆటలు సాగనివ్వబోమని కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. ఇప్పటి వరకు ఎంఐఎం ప్రాబల్యం ఉన్న నియోజకవర్గాలు, పట్టణాల్లో బీజేపీ బలపడిందన్నారు. ప్రతి ఎన్నికల్లో ఎంఐఎం బలం తగ్గిందన్నారు. త్వరలోనే రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగురవేస్తామని చెప్పారు. శనివారం హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. ఎంఐఎం రివైవల్ డే నిర్వహించడంపై మండిపడ్డ ఆయన దేనికోసం రివైవల్ డే చేస్తున్నారని ప్రశ్నించారు. రజాకర్ల రాజ్యం తెస్తారా.. మహిళలను కించపరిచి బతుకమ్మ ఆడిస్తారా.. పాత రాజ్యం తెస్తామని ఎంఐఎం రివైవల్ డే చేస్తుందా? అని నిలదీశారు. మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ కాంగ్రెస్‌తో బీఆర్ఎస్, ఎంఐఎం అనైతిక పొత్తులు పెట్టుకొని బీజేపీని ఓడించాలని కుట్ర పన్నాయన్నారు. అయినా ప్రజలు మాత్రం తమను ఆశీర్వదించారని చెప్పారు. అత్యధిక స్థానాలు చేజిక్కించుకున్న తాము పక్కా ప్లాన్‌తో వ్యూహాత్మకంగా కరీంనగర్ మేయర్ పీఠాన్ని దక్కించుకోబోతున్నామని స్పష్టం చేశారు. ప్రజల నిర్ణయానికి వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యవహరిస్తే.. వారి మధ్య ఉన్న లోపాయికారి ఒప్పందం బయట పెడతానని తేల్చి చెప్పారు. ఎంఐఎం పార్టీ... ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు అనుసంధానకర్తగా పనిచేస్తుందని ఆరోపించారు. కరీంనగర్‌లో కార్యకర్తల కష్టం, ప్రధాని మోదీ ఆశీస్సులతో గెలవడం సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం



చేశారు. స్వతంత్ర అభ్యర్థులు బీజేపీలో చేరారని, మేయర్ పీఠానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ దాటేశామని వెల్లడించారు. మున్సిపల్ పీఠం ఎన్నికలో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంతో పొత్తు ఉండదని స్పష్టం చేశారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ అభివృద్ధి కోసం ఇప్పటివరకూ రూ.1,400 కోట్ల పనులు చేశామని తెలిపారు. ఎన్నికల్లో భాజపా అభ్యర్థులను గెలిపించినందుకు కరీంనగర్ ప్రజలకు బండి కృతజ్ఞతలు చెప్పారు. కాగా రాష్ట్రంలో బీజేపీ గెలుపుపై పార్టీ శ్రేణులతో కలిసి ఆయన మిఠాయిలు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు.

# సీఎం రేవంత్ తో వడ్డేపల్లి ఏఐఎఫ్ బి కౌన్సిలర్ల భేటీ

- **పార్టీ మారట్లేదని స్పష్టీకరణ**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీకి చెందిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్ బి) కౌన్సిలర్లు శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వడ్డేపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో మొత్తం ఎనిమిది మంది కౌన్సిలర్లు సీఎంతో భేటీ అయ్యారు. మున్సిపాలిటీ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ముఖ్యమంత్రితో చర్చించారు. సీఎంతో భేటీ తర్వాత.. బయట మీడియాతో మాట్లాడిన వడ్డేపల్లి శ్రీనివాస్... తాము కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. తాము పార్టీ మారడం లేదన్న ఆయన కేవలం తమ మున్సిపాలిటీ పరిధిలోని అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం నుంచి సహకారం కోరేందుకే సీఎంను కలిశామని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధికి తమ వంతు పూర్తి సహకారం ఉంటుందనీ నిధుల విషయంలో సానుకూలంగా స్పందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు.

# ఫార్ములా ఈ కేసులో కీలక మలుపు

- **ఐఏఎస్ అరవింద్‌కుమార్‌పై ప్రాసిక్యూషన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్**
- **కేటీఆర్ తర్వాత ఐఏఎస్ అధికారిపై కూడా చర్యలకు అనుమతి**
- **అవకతవకల ఆరోపణలపై విచారణ వేగం**
- **చార్జ్‌షీట్ దాఖలకు ఏసీబీ సిద్ధం**
- **ఉన్నతాధికారులు, నేతలపై కేసు ప్రభావం పెరుగుతోంది**
- **ప్రాసిక్యూషన్ అనుమతులతో రాజకీయ వేడి**
- **ఫార్ములా ఈ కేసు న్యాయపరంగా కీలక దశలోకి**
- **ఈ కార్ రేస్ కేసులో ఐఏఎస్ అరవింద్ ప్రాసిక్యూషన్**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

సంచలనం రేపిన ఫార్ములా ఈకార్ రేసు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ కేసులో ఏ2 నిందితుడిగా ఉన్న సీనియర్ ఐఏఎస్ అరవింద్ కుమార్ ప్రాసిక్యూషన్‌కు కేంద్రం అనుమతి ఇచ్చింది. ప్రాసిక్యూషన్ చేసుకోవచ్చని రాష్ట్రానికి సూచించింది. మరోవైపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు సైతం ఇప్పటికే గవర్నర్ నుంచి అనుమతి లభించింది. రాజకీయ నాయకులు, అధికారుల ప్రాసిక్యూషన్‌కు అనుమతి రావడంతో ఏసీబీ అధికారులు వారిపై ఛార్జిషీట్ దాఖలుకు సిద్ధమవుతున్నారు. దాదాపు తొమ్మిది నెలలు ఈ కేసుపై విచారణ జరిపిన ఏసీబీ అధికారులు గతేడాది సెప్టెంబర్ 9న ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు ను కలిసిన అధికారులు ఆయనతో కీలక అంశాల గురించి చర్చించారు. కేసులో నిందితులుగా ఉన్న వారిపై చార్జిషిట్ దాఖలు చేసేందుకు గవర్నర్ అనుమతి కోసం ఇప్పించాలని కోరారు. గవర్నర్ నుంచి అనుమతి రాగానే ఈ కేసులో ఏ1గా ఉన్న మాజీ మంత్రి కేటీఆర్, ఏ2 సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, ఏ3 హెచ్ఎండీఏ మాజీ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఏ4, ఏ5లపై చార్జ్షీటు దాఖలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. దీంతో కేటీఆర్ విచారణకు గవర్నర్ గతంలోనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌ను రెండు సార్లు ప్రశ్నించిన ఏసీబీ అధికారులు అరవింద్‌ను మూడు సార్లు విచారించారు. తాజా పరిణామంతో ఈ కార్ అవినీతి వ్యవహారంపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందోననే చర్చ రాష్ట్ర రాజకీయాల్లో జోరుగా సాగుతున్నది. ఫార్ములా ఈకారు రేస్‌లో భారీగా అవినీతి జరిగిందని ఏసీబీ ఇప్పటికే నిగ్గు తేల్చింది. కేసులో క్విడ్ ప్రోకోను అధికారులు స్పష్టమైన సాక్షాధారాలతో నిరూపించింది. ఫార్ములా ఈరేసు కోసం స్పాన్సర్‌షిప్ ఇచ్చిన సంస్థ నుంచి రేసు నిర్వహించిన సంస్థకు రూ.44 కోట్లు చెల్లింపులు జరిగినట్లుగా గుర్తించారు. అందుకు బదులుగా స్పాన్సర్‌షిప్ సంస్థ నుంచి రూ.44 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్‌ను బీఆర్ఎస్ తీసుకున్నట్లుగా తెలుస్తున్నది.



# పురపోరులో పొంగులేటి మ్యాజిక్

- **10 రోజుల్లో.. 249 వార్డుల్లో ప్రచారం**
- **70 శాతం సక్సెస్ రేటుతో 174 వార్డుల్లో గెలుపు**
- **శీనన్న వ్యూహంతో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ లో హస్తం ప్రభంజనం**

**ముద్ర, ఖమ్మం :**

మున్సిపల్ ఎన్నికల కురుక్షేత్రంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి (శీనన్న) ఒక అజేయ శక్తిగా నిలిచారు. ముఖ్యమంత్రి రేవంతన్న అప్పగించిన బాధ్యతను సవాలుగా తీసుకున్న ఆయన, తన వ్యూహ చతురతతో ఫలితాలను తలకిందులు చేశారు. కేవలం అంకెలే కాదు.. ఆ అంకెల వెనుక ఉన్న ఆయన కష్టం, ప్రచారం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కేవలం 10 రోజుల్లోనే అసాధ్యమనుకున్న సమీకరణాలను సుసాధ్యం చేసి చూపారు.

ఏదులాపురం 32 వార్డుల్లో ఏకంగా 24 చోట్ల జయకేతనం ఎగురవేసి సత్తా చాటారు. కొత్తగూడెం కార్పొరేషన్ సింగరేణి హృదయంలో 22 స్థానాలను కైవసం చేసుకున్నారు. కల్లూరు అండ్ సత్తుపల్లి కల్లూరులో 12, సత్తుపల్లిలో 17 వార్డులను హస్తం ఖాతాలో వేశారు. ఇల్లెందు అండ్ అశ్వారావుపేట ఇక్కడ కూడా ఇల్లందులో 19, అశ్వారావుపేటలో 17 స్థానాల్లో గెలిచి తన పట్టును నిరూపించుకున్నారు.

**ఓరుగల్లు కోటపై హస్తం జైత్రయాత్ర!**

రేవంతన్న ఆశీస్సులతో ఉమ్మడి వరంగల్ జిల్లా బాధ్యతలను స్వీకరించిన శీనన్న, అక్కడ కూడా ప్రత్యర్థుల కోటలను బద్ధలు కొట్టారు. భూపాలపల్లి అత్యంత కీలకమైన ఈ మున్సిపాలిటీలో 16 వార్డులను గెలుచుకుని పట్టు సాధించారు. పరకాల అండ్ స్టేషన్ ఘన్‌పూర్ పరకాలలో 13, స్టేషన్ ఘన్‌పూర్‌లో 13 స్థానాలను గెలిపించి జిల్లాలో కాంగ్రెస్ ప్రాభవాన్ని చాటారు. మొత్తంగా మంత్రి పొంగులేటి ప్రచారం నిర్వహించిన 249 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ 174 స్థానాలను గెలుచుకుంది. అంటే సుమారు 70 శాతం గెలుపు రేటుతో ఆయన 'మోస్ట్ సక్సెస్‌ఫుల్' లీడర్‌గా నిలిచారు. పగలు రేయి ఏకంచేసి ఆయన సాగించిన సుడిగాలి పర్యటనలు, రేవంతన్న సంక్షేమ పథకాలపై ప్రజలకు కల్పించిన భరోసా ఓట్ల వర్షంగా కురిసింది. మాట ఇస్తే తప్పని నైజంతో, అభివృద్ధిపై ఉన్న నిబద్ధతతో శీనన్న ప్రజాప్రభుత్వంలో తన మార్క్ రాజకీయాలను మరోసారి చాటిచెప్పారు.

# రేవంత్ కు అభినందనల వెల్లువ

**ముద్ర, తెలంగాణ:**



తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి పార్టీ జాతీయ నాయకత్వం నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. పార్టీ జాతీయ నాయకులతో పాటు పలు రాష్ట్రాలకు చెందిన నేతలు రేవంత్ రెడ్డితో ఫోన్ లో మాట్లాడి అభినందనలు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి, సుస్థిర పరిపాలన, సామాజిక సాధికారత కోసం స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగుతున్న తెలంగాణ ప్రభుత్వానికి ప్రజల నుంచి సంపూర్ణ మద్దతుకు ఈ ఫలితాలు నిదర్శనంగా నిలుస్తాయని నేతలు అభిప్రాయపడ్డారు. ఈ ఫలితాలు కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలకున్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తున్నాయని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. సామాజిక న్యాయం, ఆర్థిక సాధికారత, రాష్ట్ర ప్రజల పురోభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఖర్గే ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, సమ్మిళిత వృద్ధి కోసం పనిచేస్తున్న కాంగ్రెస్‌కు తెలంగాణ ప్రజలు స్థానిక ఎన్నికల్లో స్పష్టమైన ఆమోద ముద్ర వేశారని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలిపారు. స్థానిక ఎన్నికల్లో విజయం కోసం కృషి చేసిన కార్యకర్తలు, నాయకులకు రాహుల్ గాంధీ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ప్రజల తెలంగాణ కోసం కాంగ్రెస్ దార్శనికత స్పష్టంగా ఉందని, అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరే లక్ష్యానికి కట్టుబడి పనిచేస్తుందని అన్నారు. లోక్‌సభ సభ్యురాలు, ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకానికి ఈ ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఈ విజయాన్ని సాధ్యం చేయడంలో కృషి చేసిన ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, నాయకుల నిబద్ధతకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబం అభివృద్ధి దిశగా సుసంపన్నమైన తెలంగాణను నిర్మించాలన్న కాంగ్రెస్ సంకల్పానికి ఈ విజయం మరింత బలాన్ని చేకూరుస్తుందని అన్నారు.

ఎన్నికల్లో ఈ ఘన విజయం కాంగ్రెస్ నమూనా పరిపాలనకు ప్రజలు ఇచ్చిన ఆమోదమని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ (ఆర్గనైజేషన్స్) కేసీ వేణుగోపాల్ అభివర్ణించారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బలమైన నాయకత్వం, పార్టీతో సమన్వయంతో ఈ ఘన విజయం సాధ్యమైందని ఎంపీ, లోక్‌సభలో కాంగ్రెస్ విప్ మానిక్కం టాగోర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజలు సంపూర్ణ విశ్వాసం ఉంచారని ఈ ఎన్నికలు రుజువు చేస్తున్నాయని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కోశాధికారి విజయ్ వసంత్ తెలిపారు. కింది స్థాయి వరకు కాంగ్రెస్ ప్రజల్లో బలంగా వేళ్లూనుకుందని ఈ ఎన్నికల ఫలితాలు తార్కాణమని అన్నారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించినందుకు రేవంత్ రెడ్డి గారికి అభినందనలు తెలియజేస్తూ, ప్రభుత్వ పనితీరుకు ప్రజల ఆమోదానికి ఇది నిదర్శనమని ఆల్ ఇండియా కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి సచిన్ సావంత్ ఎక్స్ ద్వారా పేర్కొన్నారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సందర్భంగా రాజ్యసభ సభ్యుడు అభిషేక్ సింఘ్వి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలకు అభినందనలు తెలిపారు. ఇటీవలి ఉపఎన్నికలతో పాటు మున్సిపల్ ఎన్నికల్లోనూ ప్రజలు తిరుగులేని విజయాన్ని చేకూర్చారని పేర్కొన్నారు.

# సీఎం రేవంత్ ను కలిసిన ఇల్లెందు ఎమ్మెల్యే కోరం

**ముద్ర. కొత్తగూడెం:**



తెలంగాణ రాష్టంలో జరిగిన పురపాలక ఎన్నికల అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మర్యాద పూర్వక కలిశారు. ఇల్లందు పురపాలకం కాంగ్రెస్ పార్టీ 19/24 విజయం పట్ల ఎమ్మెల్యే కోరంను సీఎం అభినందించారు. కష్టపడి పార్టీని గెలిపించారని సీఎం అన్నారు. రేవంత్ రెడ్డిని కలిసిన వారిలో రాష్ట్ర నీటి పారుదల కార్పొరేషన్ చైర్మెన్ మువ్వా విజయ్ బాబు తదితరులు ఉన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
ఆదివారం 15.02.2026



మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిననేల ఇదీ.. తెలంగాణరక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

రాచకొండ వైభవం

# చరిత్ర, ప్రకృతి, మత సామరస్యాల అపురూప సంగమం!

## రాచకొండ గుట్టల్లో జరిగే ఉర్సు, ఉత్సవాలను వెళ్లి చూసొద్దామా..!

రాచకొండ అంటేనే గుట్టలు... గుహలు... గోపురాలు, అబ్బురపరిచే శిల్పాలతో పాటు కోనసీమ అందాలను మైమరిపించే విధంగా రాచకొండ గుట్టలు దర్శనమిస్తాయి. రాతి కట్టడాలు, కోట గోడలు,గోల్కొండను మైమరిపించే విధంగా అద్భుతంగా ఉంటాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లా- రంగారెడ్డి జిల్లాల సరిహద్దు ప్రాంతమైన రాచకొండ ప్రాంతాన్ని1361లో రేచర్ల పద్మనాయకు లు రాజధానిగా చేసుకుని పరిపాలన కొనసాగించారు. తెలంగాణ లో కాకతీయ రాజుల తర్వాత చెప్పుకోదగ్గ రాజులు రాచకొండ వెలమ ప్రభువులు. వీరినే రేచర్ల పద్మనాయకులు అని పిలిచేవారు. చరిత్రకు తెలిసినంత వరకు వీరు తమ మూల పురుషుడు చెవిరెడ్డి( బేతాళ నాయకుడు) మొదలుకొని క్రీ.శ 1553 మంచి కాకతీయు లకు సామంతులుగా నల్లగొండ జిల్లాలోని ఆమనగల్లు. పిల్లలమర్రి ప్రాంతాలను పాలించారు కాకతీయులు క్రీ.శ 1323 లో పథకం అయ్యాక ఓరుగల్లు రాజ్యాన్ని పాలించిన ముసునూరు నాయకుల కు సానుకూలంగా ఉన్నారు. కానీ సింగమ నాయుడు క్రీ.శ 1957 తర్వాత అనతి కాలంలోనే సింగమనాయకుడు జల్లిపల్లి యుద్ధంలో మరణించారు. సింగమ కొడుకు అన్న పోతమ నాయుడు క్రీ.శ1361 రాజధాని అమనగల్లు నుంచి "రాచకొండ" కు మార్చా డు. తన తమ్ముడు మాదా నాయకుడిని దేవరకొండలో నియ మించారు. వీరి పాలన తెలంగాణ జిల్లాల్లో రాచకొండను రాజ ధానిగా చేసుకుని దశాబ్దానికి పైగా పాలన కొనసాగింది. రాచకొండ రాజులు పడమర ఉన్న బహమనీ సుల్తాన్ లతో స్నేహం చేసి కోస్తా ఆంధ్రులను రెడ్డి రాజుల ను అణచి వేశారు. అనంతరం కళింగ (ఒరిస్సా) గణపతి రాజులతో స్నేహం చేసి బహుమానం సుల్తాన్ లను ఓడించారు. చివరికి విజయనగరం (కర్ణాటక-ఆంధ్ర) రాజుల తో స్నేహం చేస్తున్న సమయంలో బహుమనీల చేతిలో రాజ్యాన్ని పోగొట్టుకున్నారు. తిరిగి వారి నుంచి క్రీస్తు శకం 1536 లో గోల్కొండ పాలకుడు కులీ కుతుబ్ షా రాచకొండను వశపరచుకున్నారు. క్రీ.శ 1433-60 మధ్య, క్రీ.శ 1475-1503 మధ్యకాలంలో రాచకొండ బహమనీ సుల్తానుల స్థానిక పాలన కేంద్రంగా ఉంది రాచకొండ గుట్టలు వేలాది ఎకరాల్లో విస్తరించి ఉన్నప్పుడు ప్రధానంగా సంకెళ్లబాయి గుట్ట నుంచి వెళ్లి పాలన కార్యక్రమాలు కొనసాగాయి. సంకెళ్ల బావి గుట్టను పరిశీలిస్తే సుమారు 600 అడుగుల ఎత్తు లో గల ఈ గుట్ట చుట్టూ పెద్ద పెద్ద బండరాళ్ళతో నిర్మించిన కోట కూడా ఉంది.పడమర వైపు పెద్ద ద్వారం దాటాక రామాలయం ఉంది. గుడికి దక్షిణ భాగాన కోనేరు, కోటవైపు వెళ్తున్నప్పుడు మరో దిక్కూటాలయం. గుట్టపైన రెండు బండరాళ్ల మధ్య లో ఉండే బావిలో ఎల్లప్పుడూ నీరు ఉండటం విశేషం. దీనికి వంద మీటర్ల



దూరంలో ఉత్తరాన బహుమనీ ముస్లింలు ( మాలిక్ నిమత్) ఆలయం శిలలో క్రీ.శ.1484 లో నిర్మించిన మసీదు ఉంది. కోట మధ్యలో అగ్రస్థానాన రాజ మందిరం దానికి కుడి వైపు మూలలో ఒక ఆలయం శిథిలమై ఉంది. గుట్ట పరిసర ప్రాంతాల్లో ఎటుచూసినా కోటలు కనిపి స్తాయి. గుట్టకు ఉత్తరాన కిలోమీటర్ దూరంలో హజ్రత్ గాలీబ్ షహీద్ దర్గా ('గాడిపీర్ల దర్గా' )దర్శనమిస్తుంది.ఈ దర్గావద్ద నేటికీ ప్రతి శివరాత్రికి హిందూ,ముస్లింల మత సామరస్యానికి ప్రతీకగా వారంరోజుల పాటు ప్రస్తుతం ఉర్సు ఉత్సవాలు ప్రారంభమైనవి ఈ నెల 13 శుక్రవారం ప్రారంభమై వారం రోజుల పాటు అంగరంగ వైభవంగా ఘనంగా జరుగుతాయి.సుమారు సమీపంలోని ఆరు జిల్లాల నుంచి భక్తులు పాల్గొని ఘనంగా ఉర్సు ఉత్సవాలు జరుపు కుంటారు. వెళ్లాల్సిన వారు రాచకొండ ప్రాంతానికి వెళితే ఒక మంచి ప్రదేశాన్ని చూశామనే తృప్తిని పొందుతారు అనేదిమాత్రం చెప్పవచ్చు. నరసింహులు గుట్టపైన ఒక పెద్ద గృహాలయం ఉంది. మరో నరసింహ ఆలయం నిర్మించారు. దాని ముందు బండరాళ్ల కు ద్వాదశ ఆశార్ల మూర్తులను కేంద్రాలుగా ఉన్నాయి. రాచకొండ లో అపారమైన కళా సంపద, నాటి పాలకుల రాజ ప్రసాదాలు, రంగురాళ్ల క్యారీలు, కొండలు, లోయలు, అందమైన ప్రకృతి అటవీ సంపద. రాచకొండ లో నిత్యం సందర్శకులు వచ్చే ఇటీవల గుప్త నిధుల తవ్వకాల మూలంగా బయటపడిన 14 అడుగుల ఎత్తయిన శివలింగం ఉంది.నిత్యం వేలాది మంది ప్రజలు దర్శనానికి విచ్చేస్తారు మహాశివరాత్రి పర్వదినంగా తండోపతండాలుగా జనం వస్తారు.

అదేవిధంగా ఈ ప్రాంతానికి గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్సీ హోదాలో ఉన్న కర్నె ప్రభాకర్ ప్రత్యేక దృష్టి సారించి ఈ ప్రాంత బిడ్డ కావడంతో ఈ ప్రాంతం పై ప్రేమతో చట్టసభల్లో రాచకొండ విశిష్టతను రాచకొండ పరిధిలోని 150 పైచిలుకు దేవాలయాలను, వాటికి నిత్య దీపారాధన,చారిత్రక కట్టడాలను, చెరువులు, కుంటలు,కోనేర్లులను, రాచకొండ ప్రాంతానికి సందర్శిం చడానికి విచ్చేసే పర్యాటకులకు సౌకర్యాలు కల్పించడానికి నిధులు మంజూరు చేయాలని కోరిన సందర్భంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించి చారిత్రక నేపథ్యం కలిగిన రాచకొండను అభివృద్ధి పరచాలనే ఆలోచనతో సౌకర్యాలు కల్పించి,నిధులు వెచ్చించింది కొంతమేరకు అభివృద్ధికి పునాదులు పడ్డాయి..దాంతోపాటు తన నియోజకవర్గ అభివృద్ధి నిధులతో రాచకొండ గ్రామానికి అందరికీ అందుబాటులో ఉండే మార్గంలో మట్టి రోడ్డును వేయించాడు. బస్ షెల్టర్ నిర్మించారు.ఇంకా అనేక రకాల మౌలిక సదుపాయాలు కల్పించాడు ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్.ఈ ప్రాంతానికి సాగు నీరు అవసరమని గ్రహించి శాసనమండలిలో ఈ ప్రాంత రైతన్న బాధలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, తన ఆలోచనలోంచి ఆవిష్కృతమైన" రాచకొండ ఎత్తిపోతల పథకం"న్ని పట్టుబట్టి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ని ఒప్పించి, మెప్పించి రూపకల్పన చేపించాడు. అప్పటి ప్రభుత్వం ఈ ప్రాంతానికి రాచకొండ ఎత్తిపోతల ద్వారా సాగునీరు అందించేందుకు కృషి చేసింది సంకల్పించింది.దానికి సంబంధించిన పనులు డిపిఆర్ సిద్ధం కొరకు సర్వే కొరకు ప్రభుత్వం కొంత నిధులు కూడా వెచ్చించింది పనులు కుడా ప్రారంభమైనవి. చూడాలి మరి ఇప్పుడేమో ప్రభుత్వం మారింది కాంగ్రెస్ సర్కార్ వచ్చింది..రాచకొండ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తుందా, ఈ ప్రాంతానికి సకాలంలో నీళ్లు ఇస్తుందా అనేది వేచి చూడాల్సిందే.ఈ రాచకొండ ప్రాంత అభివృద్ధికి వివిధ గ్రామాల్లోని యువకులు,నాయకులు స్వచ్ఛందంగా కమిటీని ఏర్పాటు చేసుకొని 'రాచప్ప' కమిటీ పేరా ప్రతి సోమవారం శివాలయం వద్ద అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పర్యాటకులకు రాచకొండ అందాలను, చరిత్రను వివరిస్తున్నారు. గత బిఆర్ ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ చొరవతో తెలంగాణ టూరిజం శాఖ సహకారంతో రాచప్ప కమిటీ ఆధ్వర్యంలో గత ఎనిమిదేళ్ల క్రితం రాచకొండ పర్యటక ఉత్సవాలు ప్రారంభించారు నాటి నుండి ప్రతి ఏడాది కొనసాగిస్తూ వస్తున్నారు ఉత్సవాలు.అలనాటి రాజులైన రేచర్ల పద్మనాయక వంశీయులు రాచకొండ ను రాజధానిగా చేసుకుని పరిపాలించిన క్రమంలో వారు నిర్మించిన అనేక గుళ్ళు, గోపురాలు,శత్రుదుర్భేద్య కట్టడాలు నిర్మించిన తటాకాలు చెక్కిన శిల్ప కళాసంపద, ద్వారా మండపాలు, కోనేరు, ఇత్యాది ఆనవాళ్ళతో కూడిన అద్భుత ఫోటో ప్రదర్శన, బయల్పడిన శివలింగం, రామాలయం, దర్గాలు ముఖ్యమైనది. అప్పటి పూర్వ వైభవం అవగాహన కల్పించడానికి యాత్రికులకు భక్తులకు అశేష ప్రజానీకానికి సందర్శించేందుకు వీలు కల్పించడం కోసం ఉత్సవాల ప్రధాన ఉద్దేశం....



ప్రతి సంవత్సరం రాచకొండలో జరిగే హజ్రత్ గాలీబ్ షహీద్ షరీఫ్ ఉర్సు ఉత్సవాలకు మహాశివరాత్రి సందర్భంగా రెండు రోజులపాటు అక్కడే ఉండి ఆనందంగా ప్రకృతి అందాలను ఆస్వాదిస్తుంటారు. రాచకొండ గుట్టల్లో వారం రోజులపాటు జరిగే శివరాత్రి ,ఉర్సు, పర్యటక ఉత్సవాల కొరకు వెళ్లాలనుకునేవారు హైదరాబాద్ నుండి ఎల్బీనగర్ నుండి విజయవాడ జాతీయ రహదారిలో కోయ్యలగూడెం నుండి కుడివైపుకు మల్లీ పీపల్ పహాడ్, అల్లాపురం మీదుగా రాచకొండకు చేరుకోవచ్చు... లేదా ఇబ్రహీంపట్నం నుండి ఆరుట్ల మీదుగా రాచకొండ కు చేరుకోవచ్చు. నల్లగొండ పరిసర ప్రాంతాల నుండి విచ్చేసే వాళ్లు సంస్థాన్ నారాయణపురం నుండి వెళ్లొచ్చు. మార్గమధ్యలో సరళ మైసమ్మ దేవాలయం అల్లపురంలో ఉంటుంది దర్శించుకుని రాచకొండకు చేరుకోవచ్చు. జనం రాచకొండను చూడడానికి ఇక్కడ ప్రకృతి అందాలను ఆస్వాదించడానికి మహాశివరాత్రి సందర్భంగా ఇక్కడ జరిగే ఉర్సు ఉత్సవాలను, జాతరను పర్యాటక ఉత్సవాలను వీక్షించేందుకు చూసి ఆనందించేందుకు వస్తుంటారు. ఇంటి పేరే రాచకొండ గా ఉన్నప్పటికీ తమ భూములపై అక్కడివారికి పూర్తిస్థాయి హక్కులు లేవు నేటికీ పాసుబుక్కులు లేవు, అటవీశాఖ అధికారుల నుండి ఇబ్బందులు, ప్రభుత్వ సౌకర్యాలు రావు, పూర్తిస్థాయిలో హక్కుల ను కల్పించాలని మా భూముల కు కొత్త పాసుబుక్కులు మంజూరు చేయాలని, ఇప్పించాలని కలవని లీడర్ లేదు, మొక్కని దేవుడు లేదు.చూడాలి మరి ఎప్పుడు పూర్తిస్థాయిలో హక్కులు కలుగుతాయో. ఏడాదికోసారి జరిగే రాచకొండ ఉర్సు ఉత్సవాలకు తప్పనిసరిగా సాధ్యమైనంతవరకు అందరం పాల్గొంటాం.చక్కటి అనుభూతిని ఆనందాన్ని పొందుతాం. ఇక మిగతా వాళ్లంతా వాళ్ల అనుభవాలను, జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ రాచ కొండ గుట్టలను, కోనలను,కుంటలను కలియ తిరిగి సాయం త్రానికి దర్గా వద్దకు చేరుకొని రంగుల రత్నం, రింగులాట జాతరలో కనిపించే వాటన్నిటిని ఆస్వాదిస్తూ ఎంజాయ్ చేస్తారు.... పైన వాళ్లంతా ఒక్కొక్కరు ఒక్కో కులం,మేమంతా స్నేహితులం.

- గుండమల్ల
సతీష్ కుమార్
సంస్థాన్ నారాయణపురం.
94931 55522



# సర్పయాగ స్థల ప్రాశస్త్యం... ఏడుపాయల

(సందర్భం: మహా శివరాత్రి జాతర)



సర్పయాగం జరిగిన పుణ్య భూమి... అదే ఏడుపాయల. గరుడ గంగగా పేరొందిన మంజీరా నది ఉద్భవించడం, నది ఏడుపాయలుగా చీలి మళ్లీ ఒకచోట కలిసి ముందుకు సాగడం గురించి పురాణ కథలున్నాయి. ద్వాపర యుగాంతంలో పాండవ వంశపు కడపటి రాజు, పాండువుల మునిమనుమడైన జనమేజయుడు తన తండ్రి పరిక్షిత్తు మహారాజు మరణానికి కారణమైన సర్పజాతిని సమూలంగా అంతమొందించేందుకు సప్తరుషులతో సర్పయాగం చేసిన స్థలామే నేటి ఏడుపాయల అని చారిత్రకత ప్రతీతి. ఇక్కడ సర్పయాగం జరిగినట్లు నేటికి ఆనవాళ్లు కనిపిస్తాయి. నదీ పాయల మధ్య ఉన్న బండరాళ్లపై యజ్ఞ గుండాలు ఏర్పాటు చేసినట్టు గుంతలు ఉండగా, ఏడుపాయలకు సమీపంలోని ఎల్లాపూర్ బ్రిడ్జి వద్ద నది ఒడ్డున మట్టిని తవ్వితే విభూతి మాదిరిగా తెల్లని మట్టి లభ్యమవుతుంది. కాగా జనమేజయుడు తలపెట్టిన సర్పయాగంలో పడి సర్పాలన్నీ ఆహుతవుతుండగా నాగుల తల్లి కద్రువ విజ్ఞప్తి మేరకు గరుత్మంతుడు పాతాళం నుంచి భోగవతి నదిని తీసుకువచ్చి సర్పయాగ స్థలికి రాగానే ఏడుపాయలుగా చీలి యజ్ఞశాల, యజ్ఞగుండాలన్నింటిని ముంచెత్తి సర్పజాతికి పుణ్యలోకగతులు ప్రాప్తించినట్టు చరిత్ర చెబుతోంది. మంజీరా నది ఏడుపాయలుగా చీలి ప్రవహించడం వల్లే ఈ ప్రాంతానికి ఏడుపాయల అనే పేరు స్థిరపడగా, గంగాదేవి కాలి అందె (మంజీరా) మూలంగా ఏర్పడినందున ఇక్కడ ప్రవహించే నదికి మంజీరా నది అని పేరు వచ్చింది. వనదుర్గ మంత్ర మహిమ వల్ల ఇదంతా జరిగిందని భావించి సప్తరుషులు కలసి ఏడుపాయల్లో వనదుర్గామాతను ప్రతిష్టించారు. నేటికి వానాకాలంలో నదీ పాయ ఒడ్డున రాతి గుహలో కొలువైన వనదుర్గా భవాని మాత పాదాలను తాకూతు మంజీరా నది ప్రవహిస్తుండటం విశేషం.

### మూడు రోజుల పాటు జాతర

ప్రతి యేటా మూడు రోజుల పాటు జాతర జరుగుతుంది. ఈనెల 15 నుండి 17 వరకు మూడు రోజులపాటు ఏడుపాయల జాతర జరుగనుంది. తొలిరోజు మహాశివరాత్రి రోజు వనదుర్గామాతకు అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు ఉంటాయి. రెండో రోజు జాతరలో ప్రధాన ఘట్టమైన బండ్ల ఊరేగింపు ఉంటుంది. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన వంద ఎడ్ల, గుమ్మటాల బండ్లు ఊరేగింపులో పాల్గొంటాయి. మూడోరోజు రథోత్సవం కన్నుల పండువగా జరుగు తుంది. జాతరలో మూడు రోజులు బోనాలు, సిగాలు, పోతరాజుల విన్యాసాలు, జానపదుల సందడితో తెలంగాణ సంస్కృతి ఉట్టిపడుతుంది. జాతరలో ప్రధాన కార్యక్రమాలు మూడు రోజుల పాటే ఉన్నా వారం పాటు రద్దీ బాగా ఉంటుంది.

### స్టేట్ టూరిజం ఫెస్టివల్

ఏడుపాయల జాతరను రాష్ట్ర ప్రభుత్వం 'స్టేట్ టూరిజం ఫెస్టివల్'గా నిర్వహిస్తోంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత ప్రభుత్వం ప్రతి ఏటా జాతర నిర్వహణకు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తోంది. అంగరంగ వైభంగా జరిగే ఏడుపాయల జాతరకు తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతోపాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున జనం తరలివస్తారు. చుట్టూరా నలువైపులా సహజ ప్రకృతి అందాలతో అలరారే పరిసరాలు... గలగల పారే నదీ పాయల మధ్య కన్నుల పండువగా జరిగే ఏడుపాయల జాతర ప్రతి ఒక్కరికి మధురానుభూతులను మిగిల్చే చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిపోతుంది.



- ఎ.శంకర్ దయాళ్ చారి, మెదక్

# ఓరుగల్లు శైవ వైభవం - శివతత్వ అంతరార్థం

## వరంగల్ జిల్లాలో శివాలయాలు

వరంగల్లుని ఏలిన కాకతీయ ప్రభువుల కాలం లో శివారాధనకు విశేష ప్రాధాన్యం లభించింది. కాకతీయులు శైవమతాన్ని ఆశ్రయించి శివుడిని పరమదేవుడిగా భావించారు. ఓరుగల్లు కోట ప్రాంగణంలో స్వయంభూ దేవాలయం, హనుమకొండలోని వేయి స్తంభాల గుడి, పాలంపేటలోని రామప్ప దేవాలయం వంటి ఆలయాలు శైవ భక్తికి ప్రతీకలుగా నిలిచాయి. రుద్రదేవుడు, గణపతి దేవుడు, ప్రతాప రుద్రుడు వంటి రాజులు శైవమత పరిరక్షణకు కృషి చేశారు. శివారాధన రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలలో కీలక పాత్ర పోషించింది. లింగారాధన ప్రధాన పూజా విధానంగా ఉండి, నిత్యాభిషేకాలు, రుద్రాభిషేకాలు, మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడేవి.

ఈ కాలంలో శైవ సంప్రదాయం శిల్పకళలో స్పష్టంగా ప్రతిఫలించింది. ఓరుగల్లు నగరంలోని కాకతీయుల కోట పరిసరాలలో ఉన్న స్వయంభూ (శంభులింగేశ్వర) శివాల యం కాకతీయుల ఆరాధ్యదైవానికి ప్రతీకగా నిలిచింది. "స్వయంభూ" అనే భావన ప్రకారం, అక్కడి శివలింగం స్వయంగా ప్రత్యక్షమైనదని భక్తులు విశ్వసిస్తారు. మహా శివరాత్రి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, జాగరణలు, రుద్రపారాయణాలు నిర్వహించబడు తుంటాయి.

హనుమకొండలోని వేయి స్తంభాల దేవాలయం శైవభక్తి, శిల్పకళా వైభవానికి చిరస్మరణీయ ఉదాహరణ. 12వ శతాబ్దంలో కాకతీయ రాజు రుద్రదేవుడు నిర్మించిన ఈ త్రికూటాలయం లో ప్రతిష్ఠించిన శివలింగం సున్నితమైన శిల్పనైపుణ్యంతో రూపొందించబడింది. నంది విగ్రహం కూడా అద్భుతంగా తీర్చిదిద్దబడింది. పానవట్టం అన్ని దేవాలయలలో ఉండేలాగా కాకుండా చతురస్రాకారం లో ఉండటం ఇక్కడి విశేషం.

హనుమకొండలోనే కొలువై ఉన్న మహిమాన్వితమైన సిద్ధేశ్వరాలయం, ఇటీవలే వెలుగులోకి వచ్చిన జలేశ్వరాలయం తో పాటు ... నగరం లో ఆకారపు వారి కాశీ విశ్వేశ్వరాలయం, భోగేశ్వరాలయం కూడా శివరాత్రి దినాన సందర్శించ తగిన ప్రాచీనదేవాలయాలు. అయితే హంటర్ రోడ్ లో రోకళ్ళ శాయంపేట కూడలి సమీపం లో హనుమద్గిరి పై పశ్చిమాభిముఖుడైన శివుడు, ఆ సమీపం లోని మరకత లింగ ఆలయం కూడా శివరాత్రి పర్వదిన వేళ భక్తుల కోర్కెలు తీర్చగల క్షేత్రాలుగా ప్రశస్తి పొందుతున్నాయి.

పాలంపేటలోని రామప్ప (రామలింగేశ్వర స్వామి) దేవాలయానికి యునెస్కో వారి గుర్తిపు లభించడం ఒక ప్రత్యేకత. ఇక్కడ శివలింగం శాస్త్రోక్త విధానాలతో ప్రతిష్ఠించబడింది. ఆలయంలోని శిల్పాలు నటరాజ, అర్ధనారీశ్వర రూపాల్లో శైవ తత్వాన్ని ప్రతిబింబిస్తాయి.



ఈ శివాలయాల్లో, ఈ నాటికీ శివరాత్రి రోజున దీక్షలు, రుద్రాభిషేకాలు విశేషంగా జరుగుతాయి. పాలకుర్తి లోని కొండపై కొలువైన సోమేశ్వరాలయం కాకతీయుల కాలానికి చెందిన ప్రాచీన శైవక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయంలో ప్రతిష్ఠించిన శివలింగం స్థానిక భక్తి పరంపరను ప్రతిబింబిస్తుంది. మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, జాగరణలు ఘనంగా నిర్వహించ బడతాయి. శిల్పకళా లక్షణాలు, గర్భగృహ నిర్మాణం శైవ సంప్రదాయ వైభవాన్ని తెలియజేస్తాయి. ఫణిగల (పూర్వపు వరంగల్ జిల్లా) లోని ప్రాచీన రామలింగేశ్వర ఆలయం శిలాశాసనాలు, గర్భగృహ నిర్మాణ శైలి ద్వారా శైవాచార ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. కురవి, కొత్తకొండ వంటి ప్రాంతాల్లోని శివాలయాలు (వీర భద్రేశ్వరుడు) గ్రామీణ భక్తి పరంపరను బలపరిచాయి.

ఈ ప్రాచీన దేవాలయాలు కేవలం ఆరాధనా స్థలాలు మాత్రమే కాక, కాకతీయుల సామాజిక ఏకత, కళాత్మక అభిరుచి, మతసహనానికి ప్రతీకలుగా నిలిచాయి. శివారాధన ద్వారా కాకతీయ ప్రభువులు తమ రాజకీయాధికారాన్ని ధార్మికాధికారంతో మేళవించి ప్రజల్లో ఐక్యత, భక్తి, సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందించారు.

జగత: పితరౌ వందే ... పార్వతీ పరమేశ్వరౌ అన్నారు పెద్దలు. పరమేశ్వరుడి రూపాన్ని, తత్వాన్నీ తండ్రితో అన్వయించారు మన పూర్వీకులు. పరమ శివుడి ఆకృతిలో ఒక్కొక్క ఆభూషణానికీ ఒక్కొక్క అంతరార్థం ఉన్నదనీ ... విజ్ఞులు చెబుతారు. శివుని త్రిశూలం సత్వ, రజ, తమో గుణాలకు ప్రతీకగా, ఆయన చేతిలో ఢమరుకం...శబ్ద బ్రహ్మ స్వరూపంగా, శివుని శిరస్సుని అలరించే చంద్రవంక మనోనిగ్రహానికి చిహ్నంగా ...గంగా దేవి శాశ్వతత్వానికి ప్రతీకగా అభివర్ణిస్తారు. దేహంపై సర్పాలు భగవంతుని జీవాత్మకి, మూడవ నేత్రం మనో నేత్రానికి సూచికలుగా పోలిక చెప్పారు.

ఆ పరమేశ్వరుడు ... దేహం పై ధరించిన ఏనుగు చర్మం అహంకారాన్ని జయించమనీ, ఆసనంపై పరచుకునే పులిచర్మం కోరికలను అణచుకొమ్మనీ, భస్మం పరిశుద్ధతని ఆవాహనం చేసుకొమ్మనీ, నంది వాహనం సత్ సాంగత్యం లో చరించమనీ ప్రభోదిస్తాయి.బ్రహ్మ, విష్ణువులు సృష్టి, స్థితులకు మూలమైతే .. మహేశ్వరుడు లయ కారకుడిగా గణించబడతాడు. వేద కాలంలో రుద్రునిగా పరిగణించబడిన పరమేశ్వరుడు సింధునాగరికత కాలానికి, పశుపతిగానూ లింగ రూపునిగానూ పూజలందుకున్నాడు. పరమేశ్వరుడు సనాతనుడు. ఆది మద్యాంత రహితుడు. తన మహేశ్వరాంశ తో బ్రహ్మ, విష్ణు అంశలనికూడా లయ స్థితికి తెచ్చే పరమ శివుడు, విరాట్ స్వరూపుడు. శివుని అష్ట మూర్త్యవ స్వరూపంగా, శ్రీ శివ మహా పురాణం పేర్కొంటుంది. భూమిని అధిష్టించి ఉండే రూపంలో శర్వునిగా... సర్వ జీవ కోటికీ ప్రాణ తుల్యమైన ఉదకాలను అధిష్టించే భూమిగా ... లోకాన్ని ప్రకాశింపచేసే అగ్నిపై నిలిచే రుద్రునిగా .... వాయువుకు అధిష్టానమైన ఉగ్రునిగా .... జీవాత్మలో వసియించే పశుపతిగా ... జగత్తుకు నేత్రసమానుడై సూర్యునిలో ప్రకాశించే ఈశాననునిలా .... సకల ప్రాణులనూ ... వృక్ష ఓషధులనూ ... పాడి పంటలను వృద్ధి పొందించే చంద్రునిపై అధికారం కలిగిన మహాదేవునిగా ... ఇలా... సూర్య, చంద్ర , పంచభూతాలపై అధిపత్యం వహించే ఎనిమిది రూపాలుగా ... సర్వ ప్రపంచానికీ మూలమైన ఆ పరమ శివుని అభిషేకిస్తే ... సర్వ దేవతలూ, ప్రకృతి శక్తులూ సంతుష్టి చెందుతాయి. శివుడు కైలాస వాసి మాత్రమే కాదు. స్మశాన సంచారి కూడా. అట్లాగే, శివుడు పీతాంబర ధరుడు కాదు. విభూది రాసుకుని, గజ చర్మాన్ని ధరించినవాడు. సువాసనా భరిత పుష్పాలతో సకల దేవతలనూ అర్చించినా....తుమ్మి పూవులతో, బిల్వ దళాలతో సంతుష్టి చెందే అల్ప సంతోషి.

అమృతాన్ని అందరికీ పంచి, హాలాహలాన్ని గొంతులో దాచుకున్న గరళ కంఠుడూ నీల కంఠుడూ...నిరాకారుడు, నిరాడంబరుడూ...నిరంజనుడూ ...బోళాశంకరుడూ....ఆ పరమ శివుడు. అలాంటి శివుణ్ణి సదా స్మరిస్తే .... "మద, మత్సర, కామ, క్రోధ, లోభ మోహాదులు" కొంచెమైనా మన నుంచి దూరమౌతాయి. అందుకే...ఆ మహాశివుడి తత్వాన్ని ఆకళింపు చేసుకుందాం.

ఎ.వి. అనిల్
ప్రసాద్
వరంగల్
9989292070



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
15.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ శైవ ఆలయాలు**

ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయం (తూర్పుగోదావరి) పంచారామ క్షేత్రాల్లో ఒకటి. చాళుక్య కాలానికి చెందిన అద్భుత నిర్మాణం కలిగి ఉంది.



## చీరాలకు పాలమూరు కార్పొరేటర్లు

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**
మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల అనంతరం పాలమూరు రాజకీయాలు ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా చీరాల సముద్ర తీరానికి చేరాయి. గెలిచిన 29మంది కాంగ్రెస్ అభ్యర్థులతోపాటు, కీలకమైన స్వతంత్ర అభ్యర్థులను కాంగ్రెస్ అధిష్టానం చీరాలలోని ఒక ప్రైవేట్ బీచ్ రిసార్ట్‌కు తరలించినట్లు సమాచారం.శుక్రవారం అర్ధరాత్రి బస్సుల్లో బయలుదేరిన అభ్యర్థుల బృందం శనివారం ఉదయానికి చీరాల తీరానికి చేరుకుంది. మేయర్ ఎంపికపై ఏకాభిప్రాయం కుదరకపోవడం, ఇతర పార్టీల నుంచి ప్రలోభాలు వచ్చే అవకాశం ఉండటంతో అధిష్టానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు ఎప్పటికికప్పుడు పరిస్థితి సమీక్ష చేస్తున్నారు. చీరాల క్యాంప్‌లో ఉన్న అభ్యర్థులకు కూడా తమలో మేయర్ ఎవరనే క్లారిటీ ఇవ్వకపోవడం గమనార్హం.

## దేవాలయాల వద్ద మౌలిక వసతులు కల్పించండి



**ముద్ర, తాండూర్ :**
వికారాబాద్ జిల్లా తాండూర్ మున్సిపల్ పరిధిలోని శివాలయాల వద్ద భక్తులకు ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని బిజెపి నూతన కౌన్సిలర్ అభ్యర్థులు మున్సిపల్ అధికారులను కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. హిందువుల ఆరాధ్య దైవమైన పండగ శివరాత్రి అని, వేలాది మంది భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి, ఆ పరమ శివుడి దర్శనం కోసం తండోపతండాలుగా ప్రజలు శివాలయాలకు వెళ్తుంటారని తెలిపారు. కావున భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మంచి నీటి సౌకర్యం, విద్యుత్ దీపాలు, ఆలయాల పరిశుభ్రత మొదలగు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను కోరారు. కార్యక్రమంలో నూతన బిజెపి కౌన్సిలర్లు, నాగారం మల్లేశం, అంతారం కిరణ్, శ్రీకాంత్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

## పేట 10వ వార్డు స్వతంత్ర అభ్యర్థి బిజెపిలో చేరిక



**ముద్ర, నారాయణపేట :**
నారాయణపేట 10వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన బి.జయశ్రీ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్రావు సమక్షంలో బిజెపిలో చేరారు. అయితే 10వ వార్డు నుంచి జయశ్రీ బిజెపి రెబల్ గా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ వార్డులో 1256 మంది ఓటర్లు ఉండగా 1023 ఓట్లు పోలయ్యాయి. ఇందులో కాంగ్రెస్ అభ్యర్థి అనూష 160 ఓట్లు, బిజెపి అభ్యర్థి సిద్ది విశాలాక్షి 386, బీఆర్ఎస్ అభ్యర్థి సుజాత 12ఓట్లు స్వతంత్ర అభ్యర్థి జయశ్రీకి 451ఓట్లు రాగా విజయం సాధించింది. స్వతంత్ర అభ్యర్థి చేరికతో బిజెపి కౌన్సిలర్ల సంఖ్యాబలం 12కు చేరింది.

## శ్మశాన వాటిక అభివృద్ధి కోసం వినతి

**ముద్ర, మల్కాజిగిరి :**
ఓల్డ్ నేరెడ్మెట్ ప్రాంతంలోని గౌడ సంఘం శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మర్రి రాజశేఖర్ రెడ్డికి గౌడ సంఘం నాయకులు వినతి పత్రం సమర్పించారు. మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. శ్మశాన వాటికలో ప్రాథమిక సౌకర్యాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని వారు ఎమ్మెల్యేను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే, సమస్యను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో ఈశ్వర్ గౌడ్, నరేందర్ గౌడ్, నర్సింహ గౌడ్, అభిషేక్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, తదితర గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జనార్దన్, నవీన్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.



# కాంగ్రెస్ లో అంచనాలు తారుమారు..!

- **మేయర్ పోటీలో ప్రధానంగా ఉన్న అభ్యర్థుల ఓటమి**
- **ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులకు తలనొప్పిగా మారిన మేయర్, డిప్యూటీ మేయర్ ఎంపిక**




**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**
అనుకున్నదొక్కటి... అయినది ఒక్కటి.. బోల్తా కొట్టారులే కాంగ్రెస్ అభ్యర్థులు. ఇద్దరు కాంగ్రెస్ మున్సిపల్ కార్పొరేషన్ అభ్యర్థులు మేయర్ పదవి దక్కించుకునేందుకు ఎన్నికలకు ముందే పావులు కదిపారు. ఈ ఇద్దరిలో ఒకరికి తప్పకుండా మేయర్ కుర్చీలో కూర్చునే వారు. ఇద్దరి ఎవరు గెలిసివచ్చినా మేయర్ పదవి కట్టబెడతామని పార్టీ కూడా నిర్ణయం తీసుకుంది. కానీ ఫలితం ముందర బొక్కబోర్లా పడ్డారు ఇద్దరు నేతలు. ఈ కార్పొరేషన్ బీసీ మహిళకు రిజర్వేషన్ కావడంతో ముఖ్యంగా నలుగురు అభ్యర్థులు మేయర్ పదవి ఆశించారు. అందులో ఇద్దరిలో ఒకరికి మేయర్ పదవి దక్కుతుందనే ఆశలో ఉన్నారు. 37 డివిజన్ నుంచి సీనియర్ కాంగ్రెస్ నేత ఎన్పి వెంకటేష్ తన కూతురు నేహాశ్రీ ని బరిలో ఉంచారు. ఇక్కడ ఈమె గెలుపొందితే మేయర్ పీఠం దక్కే అవకాశం ఉండేది. కానీ ఇక్కడ ఫలితం ఆమెకు బెడిసికొట్టింది. అనూహ్యంగా బీజేపీ అభ్యర్థిఃకి విజయం వరించింది. 41 డివిజన్ అభ్యర్థి ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ సతీమణి స్వప్న పోటీలో ఉన్నారు. తన భార్య కు మేయర్ పదవి ఇస్తే ముడా(మహబూబ్ నగర్ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ) చైర్మన్ పదవి వదులుకుంటానని ప్రకటించారు. ఈయన భార్యకే మేయర్ పదవి కట్టబెట్టాలని ఎమ్మెల్యే, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, ఇతర సీనియర్ కాంగ్రెస్ నేతలు అనుకున్నారు. కానీ ఇక్కడ ఫలితం తారుమారైంది. కాంగ్రెస్ గెలుస్తామనుకున్న ఈ స్థానంలో గులాబీ పార్టీ గెలుపొందింది. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి మేయర్ ఆశలు గల్లంతయ్యాయి. ఈ ఓటమి చెందిన నేతలు సొంత పార్టీ నేతల పైనే ఆరోపణలు చేస్తున్నారు. కొందరు కాంగ్రెస్ నేతలు తమకు మేయర్ పదవి వస్తుందనే ఉదేశ్యంతో తమ ఓటమికి పనిచేశారని, ఈ విషయంపై డీసీసీకి, ఎమ్మెల్యేకు, పార్టీ అధిష్టానంకు ఫిర్యాదు చేస్తామని అంటున్నారు. ప్రస్తుతం మేయర్ పదవి దక్కదనే అక్కసుతోనే ఇతర డివిజన్లలో పోటీ చేసిన కొందరు నాయకులు తమ ఓటమికి ప్రయత్నం చేశారని వారు ఆరోపిస్తున్నారు.

**మేయర్ కోసం ఇద్దరి పట్టు..**
మేయర్ పదవి రేసులో ఉన్న ఇద్దరి ఓటమితో గెలిచిన మరో ఇద్దరు తెరపైకి వచ్చారు. మొదటి నుంచి మేయర్ పదవి ఆశిస్తున్నా మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ తన భార్య ప్రసన్న లక్ష్మికి మేయర్ పదవి ఇవ్వాలని ఎన్నికల ముందునుంచే తన వాయిస్ గట్టిగానే వినిపిస్తున్నారు. ఎందుకంటే గతం లో ఆయన బీఆర్ఎస్ నుంచి మున్సిపల్ చైర్మన్ దక్కించుకుని అప్పటి బీఆర్ఎస్ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తో విబేదాలు వచ్చి కొంతకాలానికి ఆ పార్టీని వీడి కాంగ్రెస్ లో చేరారు. ఆయనతో పాటు పలువురు కౌన్సిలర్ల ను తన వెంట తెచ్చుకున్నారు. అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్ రెడ్డికి మద్దతుగా ప్రచారం చేసి ఆయన విజయంలో పాలుపంచుకున్నారు. అందుకే ప్రస్తుతం 49 డివిజన్ నుంచి ఎన్నికైన తన భార్య ప్రసన్నకు మేయర్ పదవి ఇవ్వాలని ఎమ్మెల్యే యెన్నం పై వత్తిడి తెస్తున్నారనే సమాచారం ఉంది. మరో డివిజన్ అభ్యర్థి కూడా మేయర్ పదవి తనకే ఇవ్వాలని ఎమ్మెల్యే, డీసీసీ పై ఒత్తిడి పెంచుతోంది. 58 డివిజన్ నుంచి కాంగ్రెస్ కార్పొరేషన్ అభ్యర్థిగా ఏకగ్రీవం అయిన చలువగాలి రమాదేవి కూడా మేయర్ పదవి కావాలని పట్టుబడుతున్నారు. ఈమెకు కాంగ్రెస్ రాష్ట్ర అధిష్టానం నుంచి జిల్లా డీసీసీ, ఎమ్మెల్యేకు ఒత్తిడి తెస్తున్నదని సమాచారం. ఈ ఇద్దరి వ్యవహారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ కు తలనొప్పిగా మారింది. మేయర్ ఎంపికను రాష్ట్ర అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి బంతిని వారి కోర్టు లో ఉంచి చక్రం తిప్పాలని ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు చూస్తున్నారని తెలిసింది. ఈ ఇద్దరి లో ఒకరి ఎంపిక కత్తి మీద సాములాంటిదే.

**డిప్యూటీ ఎవరికో...?**
మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్లో 60 డివిజన్ల కు గాను 29 డివిజన్లలో కాంగ్రెస్ గెలుపొందింది. ఇక్కడ మేయర్ పీఠం దక్కాలంటే మేజిక్ ఫిగర్ 31 డివిజన్లలో గెలుపొందాలి. కానీ కాంగ్రెస్కు 29, బీఆర్ఎస్కు 15, బీజేపీ 8, ఎంఐఎంకు 3, స్వతంత్రులు 5 స్థానాల్లో విజయం సాధించారు. ఇందులో కాంగ్రెస్ గట్టెక్కాలంటే ఎంఐఎం అభ్యర్థులు ముగ్గురిని, లేదా స్వతంత్రులను ఐదుగురిని కలుపుకోవాలి. వీరు కాంగ్రెస్కు మద్దతు ప్రకటిస్తే డిప్యూటీ మేయర్ పదవి అడిగే అవకాశం ఉంది. కానీ ఇప్పటికే ఈ పదవిపై 11 డివిజన్ నుంచి ఎన్నికైన మారెపల్లి సురేందర్ రెడ్డి పట్టుపడుతున్నారు. ఈయన ఎమ్మెల్యే కు అత్యంత సన్నిహితుడు కావడంతో ఆయనకే డిప్యూటీ మేయర్ దక్కే అవకాశం ఎక్కువగా ఉందనే మాటలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా మేయర్, డిప్యూటీ మేయర్ ఎంపిక, అటు కాంగ్రెస్ అధిష్టానంకు, ఇటు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ కు తలనొప్పిగా మారింది. ఈ టెన్షన్ కు మరో రెండు రోజుల్లో తెర పడనుంది.

# ఐటీ కారిడార్లో రోడ్ల విస్తరణకు కసరత్తు

- **అధికారుల సంయుక్త పరిశీలన**



**ముద్ర, శేరిలింగంపల్లి :**
ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించి, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడమే లక్ష్యంగా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో రోడ్డు విస్తరణ పనులపై దృష్టి సారించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కీలక మార్గాల్లో నెలకొన్న బాటిల్‌నెక్‌లను తొలగించి, రోడ్డు భద్రతను మెరుగుపరిచేందుకు శనివారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన ఐఏఎస్, జల మండలి అధికారి అశోక్ రెడ్డి ఐఏఎస్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ భోర్కడే హేమంత్ సహదేవరావు ఐఏఎస్, ట్రాఫిక్1 డీసీపీ జె.రంజన్ రతన్ కుమార్‌తోపాటు టీజీఐఐసీ జోనల్ మేనేజర్ ఎం. కవిత వివిధ శాఖల ఉన్నతాధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యంగా మాదాపూర్ లెమన్ ట్రీ హోటల్ నుంచి సైబర్ టవర్స్ వరకు, అక్కడి నుంచి మెడికోవర్ ఆస్పత్రి వరకు ఉన్న రహదారులను అధికారులు పరిశీలించారు. మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్గం చెరువు, నెక్టర్ గార్డెన్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సాఫీగా సాగకుండా అడ్డుపడుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రహదారి వెడల్పునకు ఆటంకంగా ఉన్న ఆక్రమణలు, విద్యుత్ స్తంభాలు, నీటి పైప్‌లైన్ల వంటి యుటిలిటీల మార్పుపై ఆయా శాఖల మధ్య సమన్వయం ఉండాలని అధికారులు ఆదేశించారు. పనులు జరిగే సమయంలో వాహనదారులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ విస్తరణ పనుల ద్వారా ఐటీ కారిడార్‌లో మౌలిక సదుపాయాలు మెరుగుపడటమే కాకుండా, ప్రయాణికుల భద్రత పెరుగుతుందని అధికారులు తెలిపారు.

## బాధితులకు భరోసా.. 110ఖాతాలు డీఫ్రీజ్ : డీసీపీ

**ముద్ర, శేరిలింగంపల్లి :**
సైబర్ నేరాల దర్యాప్తులో భాగంగా బ్యాంక్ అకౌంట్ ఫ్రీజ్ అయిన ఖాతాదారులకు ఉపశమనం కల్పించేందుకు శనివారం సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రత్యేక "డీఫ్రీజ్ ఖాతాల మేళా"లో ఎన్.ఒ.సిలు అందజేశారు. ఈ సందర్భంగా సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ డీసీపీ టి.సాయి మనోహర్ మాట్లాడుతూ.. నిజమైన ఖాతాదారుల సమస్యలను పరిష్కరించేందుకు, వారికి త్వరితగతిన న్యాయం చేసేందుకు ఈ ప్రత్యేక డీఫ్రీజ్ ఖాతాల మేళాను నిర్వహించామన్నారు. ఈ మేళా సందర్భంగా ఎన్. సి. ఆర్. పి. ద్వారా ఫ్రీజ్ చేసిన 110 బ్యాంక్ ఖాతాలను పరిశీలించి ఖాతాదారుల వివరాలు, లావాదేవీలపై సైబర్ క్రైమ్స్ పోలీసులు సవివరంగా ధృవీకరణ, విశ్లేషణ నిర్వహించామని తెలిపారు. నిజమైన ఖాతాదారులను గుర్తించి, చట్టపరమైన విధానాలను అనుసరించి వారి ఖాతాలను డీఫ్రీజ్ చేశామన్నారు. ఎన్ఓసీ అందుకున్న ఖాతాదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సైబరాబాద్ పోలీసులు ప్రజలకు పలు సూచనలు చేశారు. 'సైబర్ మోసం జరిగిన వెంటనే 1930 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని, బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటిపి లేదా వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దన్నారు. అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లు లేదా ఆన్‌లైన్ ఆఫర్లపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్స్ ఏసీపీ రవీందర్ రెడ్డి, సైబర్ క్రైమ్స్ ఇన్ స్పెక్టర్లు విజయ్ కుమార్, శివప్రసాద్, దుర్గా రామలింగప్రసాద్, రామిరెడ్డి, రాఘవేందర్, మధు, సైబర్ క్రైమ్స్ సబ్ ఇన్ స్పెక్టర్లు చంద్రశేఖర్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




## రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం

- **కల్వర్టును ఢీకొన్న క్రూజర్ వాహనం**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**
మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల, కోదాడ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందారు. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రానికి చెందిన భక్తులు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం మల్లన్న దర్శనార్థం క్రూజర్ వాహనంలో వెళుతుండగా.. ఊర్కొండ మండలం తిమ్మనపల్లి గ్రామ సమీపంలో వాహనం అదుపు తప్పి కల్వర్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు సహా ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మృతులు కర్ణాటకకు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. దైవ దర్శనానికి వెళ్తూ ఈ దుర్ఘటన చోటుచేసుకోవడంతో మృతుల కుటుంబాల్లో విషాదం నెలకొంది. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదానికి డ్రైవర్ నిద్రమత్తు కారణమై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

## బోలెరో ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు ఇద్దరి అరెస్ట్

**ముద్ర, కాప్రా :**
మల్లాపూర్ పరిధిలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. కుషాయిగూడ ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం రాంపల్లి, కీసర ప్రాంతానికి చెందిన పనుగంటి రాజు (20), తన సహచరులు విజయ్ కుమార్ మరియు ఎం.సతీష్ (45)తో కలిసి 9వ తేదీ రాత్రి సుమారు 8 గంటల సమయంలో ఎంజీ విండ్సర్ (TG09G6069) కారులో మల్లాపూర్ నుంచి రాంపల్లి వైపు వెళ్తున్నారు. మల్లాపూర్ ఎక్స్ రోడ్ వద్ద అదే దిశలో వెళ్తున్న బోలెరో వాహనం (TS09FP0094) డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా నడిపి వారి కారును వెనుక నుండి ఢీకొట్టి అక్కడి నుంచి పారిపోయాడు. దీంతో బాధితులు బోలెరో వాహనాన్ని వెంబడించి హెచ్‌బీ కాలనీ ఎన్టీఆర్ విగ్రహం సిగ్నల్ వద్ద పట్టుకున్నారు. ఈ సమయంలో సతీష్ వాహనాన్ని ఆపేందుకు ముందుకు వెళ్లగా, డ్రైవర్ ఆపకుండా సతీష్‌ను ఢీకొట్టి ముందుకు వెళ్లాడు. ఈ ఘటనలో సతీష్ వెన్నుప్రాంతంలో తీవ్ర రక్తస్రావ గాయాలయ్యాయి. వెంటనే ఆయనను సమీపంలోని శ్రీకర రాఘవేంద్ర ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పించారు. బాధితుడు పనుగంటి రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి నిందితులు ఉప్పరి మహేష్ (23), సంతోష్ నగర్, బాలాజీ నగర్ మరియు అనగండుల తరుణ్ (22), వెంకటేశ్వర నగర్, బాలాజీ నగర్ నివాసితులను అరెస్ట్ చేసి 13తేదిన కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం వారిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించింది. ఈ ఘటనపై పోలీసులు మరింత దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 15-02-2026
www.mudranews.in | @mudranews



### తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ శైవ ఆలయాలు

సామర్లకోట కుమారరామ భీమేశ్వర ఆలయం (కాకినాడ)

పంచారామాలలో ఒకటైన ఈ ఆలయం శిల్ప కళా వైభవానికి ప్రసిద్ధి. ఇక్కడ లింగం రెండు అంతస్తుల్లో దర్శనం ఇస్తుంది.



## రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక



**ముద్ర, పెద్దపల్లి:** ఈ నెలలో హైదరాబాద్ లో నిర్వ హించే రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు పెద్దపల్లి జిల్లా జట్టును ఎంపిక చేశారు. గోదావరిఖని జేఎల్ఎన్ స్టేడియంలోని వ్యాయామ శాలలో జరిగిన ఎంపిక పోటీలకు పవర్ లిఫ్టింగ్ 25 మంది మహిళలు, 20 మంది పురుషుల కేటగిరిలో పాల్గొన్నారు. కేటగిరికి ఒకరి చొప్పున ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ ఎంపిక పోటీలు వెయిట్ లిఫ్టింగ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాండ్ల రాజా, శారద, పవర్ లిఫ్టింగ్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, గాండ్ల శ్రీనివాస్ పర్యవేక్షణలో నిర్వహించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అసోసి యేషన్ ప్రతినిధులు అభినందించి మెడల్స్ అందజేశారు.

## ఎన్నికల హామీలు నెరవేర్చుతాం

- రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**ముద్ర, ధర్మపురి:** మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చుతామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి మున్సిపల్ పరిధిలోని 15 వార్డు లకు గాను 15 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించిన సందర్భంగా శనివారం మంత్రి ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గ ఓటర్లు 2023లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో తనను గెలిపిస్తే గడిచిన రెండు సంవత్సరాలుగా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతో పాటు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మెజార్టీ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించిన ఓటర్లు మున్సిపల్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను 100% గెలిపించడం సంతోషం అన్నారు. ఓటర్ల ఇచ్చిన తీర్పుతో తమపై మరింత బాధ్యత పెరిగిందని ధర్మపురి నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.

## ఓడినా విజయం మాదే..

మూడు పార్టీలు ఒక్కటే: బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ఫలితాల పరంగా ఆ పార్టీలు గెలిచినా నైతిక విజయం బీజేపీదేనని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎంఎల్ఏ ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో తమ పార్టీ కొన్ని ప్రధాన స్థానాల్లో ఓటమి పాలైనా బిజెపిని ఓడించేందుకు మైనార్టీ ఓట్ల కోసం ఎంఐఎం పార్టీతో కాంగ్రెస్, బిఆర్ఎస్ ఏకమయ్యాయని ఆయన ఆరోపించారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ కేవలం 52 శాతం ఓట్లు మాత్రమే సాధించిందని అన్నారు. దీన్ని బట్టి ప్రజల్లో 48 శాతం ప్రభుత్వం పట్ల అసంతృప్తితో ఉన్నారని స్పష్టం అవుతోందని అన్నారు. కేవలం రెండేళ్ల పాలనలో ఈ స్థాయిలో వ్యతిరేకత పెరిగేందుకు ప్రధాన కారణం వారిచ్చిన హామీల అమలులో విఫలం కావడమేనని అన్నారు. ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందు అన్ని పార్టీల సహకారంతో మైనార్టీ ఓట్లతో విజయం సాధించి మైండ్ గేమ్ ఆడుతోందని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికలతో గ్రామీణ ప్రాంతాల స్థానిక సంస్థల ఎన్నికల కోసం హైప్ కు యత్నించిందని విమర్శించారు. గత ఎన్నికలతో పోలిస్తే బీజేపీ ఓటు బ్యాంకు గణనీయంగా పెరిగిందని అన్నారు. నిర్మల్ పట్టణ ఓటింగ్ లో కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం సాధించిన ఓట్లు 27 వేలు కాగా, బీజేపీ సాధించిన ఓట్లు 20,335 లని, ఓట్లను చూస్తే బీజేపీకి వచ్చిన ఆదరణ అర్థం అవుతోందన్నారు. ఆ పార్టీల పోల్ మేనేజ్మెంట్, అధికార దుర్వినియోగం, డబ్బుల పంపిణీ, మైనార్టీ ఓట్ల కోసం ఇతర పార్టీలతో కుమ్మక్కు వల్లే గెలుపు సాధ్యమైందన్నారు. ఫలితాల పరంగా ఆ పార్టీలు గెలిచినా నైతిక విజయం బీజేపీదేనని అన్నారు. గత ఎన్నికల్లో నిర్మల్ లో కేవలం 1 వార్డులో గెలిచిన బీజేపీ ఇపుడు 13 కు పెరగడం పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణకు నిదర్శనమని అన్నారు.

ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, రావుల రాంనాథ్, సాదం అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిపక్ష పాత్రలో ప్రజల పక్షాన నిలబడతాం..

- బీజేపీ గెలుపులో మాజీ బీఆర్ఎస్ నేతలే ఎక్కువ..
- కాంగ్రెస్ - బీజేపీ మధ్య లోపాయికారీ ఒప్పందం
- బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లహరి శంకర్




**ముద్ర, కరీంనగర్:** నగర పాలక సంస్థ ఎన్నికల తీర్పును గౌరవిస్తూ, బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడతామని, నగర ప్రజల సమస్యలపై రాజీ పడకుండా పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అన్నారు. శనివారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగర ప్రజల తీర్పును శిరసావహిస్తున్నామని, తమను ఆదరించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేషన్‌లో బీజేపీ సాధించిన 30 సీట్లలో 11 మంది మాజీ బీఆర్ఎస్ అభ్యర్థులే ఉన్నారని, ఇతర పార్టీల నేతలను చేర్చుకొని గెలవడం బీజేపీ నైతిక విజయం కాదని విమర్శించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఇతర మున్సిపాలిటీల్లో బీజేపీ పరాజయం పాలవ్వడం కేంద్ర మంత్రి బండి సంజయ్ వైఫల్యమేనని ఎద్దేవా చేశారు. మేయర్ ప్రమాణ స్వీకారానికి ముందే బండి సంజయ్ ప్రజలకు స్పష్టమైన హామీ ఇవ్వాలని హరిశంకర్ డిమాండ్ చేశారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ అవినీతికి పాల్పడిందని ఆరోపించిన సంజయ్, అదే పార్టీకి చెందిన వారిని బీజేపీలో ఎలా చేర్చుకున్నారో సమాధానం చెప్పాలన్నారు. ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థికి రూ.50 లక్షలు ఖర్చు చేశారని, ఆ నిధులు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు వెల్లడించాలన్నారు. ఎన్నికల వేళ కాంగ్రెస్, బీజేపీ మధ్య లోపాయికారీ ఒప్పందం కుదిరిందని ఆయన ఆరోపించారు.

గతంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్ హయాంలో అభ్యర్థులు అక్రమాలకు పాల్పడితే ఫిర్యాదు చేయాలని ధైర్యంగా చెప్పారని, ఇప్పుడు బండి సంజయ్ తన కార్పొరేటర్ల విషయంలో అలాంటి హామీ ఇవ్వగలరా అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ప్రత్యేక నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తానని చెప్పిన బండి సంజయ్, గెలిచిన తర్వాత మాట మార్చారని విమర్శించారు. డివిజన్లలో బీఆర్ఎస్ అభ్యర్థులను లేకుండా చేస్తానని వ్యాఖ్యానించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, రాజకీయ ప్రతీకారం కాకుండా అభివృద్ధి మీద దృష్టి పెట్టాలని సూచించారు.

మూడేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన టీటీడీ ఆలయ పనులు ఎందుకు ఆగిపోయాయో చెప్పాలన్నారు. కేంద్ర మంత్రిగా నగరానికి ప్రత్యేక నిధులు తీసుకు రావాలని డిమాండ్ చేశారు.

పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన కార్యకర్తలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని, పార్టీ కోసం శ్రమించిన వారికి అండగా ఉంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్ జక్కని ఉమాపతి, బీఆర్ఎస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు చేతి చంద్రశేఖర్, తొంటి రాజేందర్ రాచకొండ నరేష్ అనుమల్ల ఉమా శంకర్ దూలం సంపత్ గౌడ్ నాగుల కిరణ్ కుమార్ గౌడ్ దుర్గం శ్రీకాంత్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహా శివరాత్రికి ఏర్పాట్లు పూర్తి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మహాదేవ్ శక్తి సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శివసాక్షాత్కార పొందిన మహాయోగి శివరాజయోగి కృష్ణ స్వామీజీ నేతృత్వంలో రాజశ్యామల పీఠంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా 15 అడుగుల మహాలింగ దర్శనం, ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనంతో పాటు మహా శివరాత్రి రోజున భక్తులు ఏ సమయంలోనైనా స్వయంగా అభిషేకం చేసుకునే అరుదైన అవకాశం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటల నుండి శివ జాగరణ కార్యక్రమాలు ప్రారంభమై, శివ–పార్వతుల కళ్యాణం, 11 అడుగుల టెంకాయతో ప్రత్యేక పూజలు, లింగ చర ప్రతిష్టాపన, 100 గోమయ లింగాల చరప్రతిష్టాపన, కోటి భస్మార్చన, దీపోత్సవం జరుగుతాయని వివరించారు. మహా మృత్యుంజయ మంత్ర పారాయణంతో శక్తివంతం చేసిన మహా మృత్యుంజయ భోజ్ పత్ర యంత్రం భక్తులకు అందజేస్తామని తెలిపారు.

## క్యాంపులో కాంగ్రెస్ కౌన్సిలర్లు



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ కౌన్సిలర్లను క్యాంప్ నకు తరలించారు. విజయానికి అవసరమైన మెజార్టీ లభించినప్పటికీ కౌన్సిలర్లు చేజారకుండా క్యాంపునకు తరలించారు. వీరు నేరుగా 16న మున్సిపల్ సమావేశానికి రానున్నారు. చైర్మన్ పదవి అప్పాల కావ్యకు అధిష్టానం ఖరారు చేసినట్లు సమాచారం. అలాగే వైస్ చైర్మన్ గా కావ్య భర్త అప్పాల గణేష్ చక్రవర్తిని ఖరారైనట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## వేములవాడ జాతరకు మెట్ పల్లి నుండి ప్రత్యేక బస్సు సర్వీసులు



**ముద్ర, జగిత్యాల:** మహాశివరాత్రిని పురస్కరించుకొని వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి జాతరకు మెట్ పల్లి నుంచి ప్రత్యేక బస్సులు నడిపించనున్నారు. మెట్ పల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో డిపో మేనేజర్ సరస్వతి జాతర కోసం ఏర్పాటు చేసిన బస్సులకు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. పెద్దలకు రూ.150, చిన్నారులకు రూ.80ల ఛార్జీలు వసూలు చేయనున్నారు. మెట్‌పల్లి డిపో నుంచి జాతర కోసం 30 ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు ఆమె తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు బలరాం, రాములు, నగేష్, రాఘవ, వేణుగోపాల్, ప్రవీణ్, రవీందర్, ఉపేందర్, రజిత తదితరులు పాల్గొన్నారు.

## రాగినేడులో ముస్తాబైన దేవస్థానం

**ముద్ర, పెద్దపల్లి:** పెద్దపల్లి మండలం రాగినేడులో వెలసిన స్వయంభూ నాగలింగేశ్వర స్వామి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన దేవాలయంలో మహా శివరాత్రి వేడుకలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా నేతృత్వంలో అత్యంత వైభవంగా నిర్మించబడ్డ శ్రీ నాగలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 15 ఆదివారం నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబ చేశారు. మహాశివరాత్రి పర్వదినం రోజున తెల్లవారు జామున 3.45కు స్వామివారికి మహా రుద్రాభిషేకం, 12 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం, సాయంకాలం 4 గంటలకు శివపార్వతుల శోభాయాత్ర, రాత్రి పది నుంచి 12 గంటల వరకు స్వయంభు నాగలింగేశ్వర స్వామికి మహా రుద్రాభిషేకం, బిల్వార్చన, లింగోద్భవ కాల కార్యక్రమాలు ఘనంగా నిర్వహించను న్నారు.

## కుక్కల దాడిలో 12 మేకలు మృతి



**ముద్ర, మంచిర్యాల:** కుక్కల దాడిలో 12 మేకలు మృతి చెందాయి. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా లక్షేటిపేట మండలం హన్మంతుపల్లి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. మేకల యజమాని వెల్పుల కొమురయ్య తెలిపిన ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి కుక్కల గుంపు మేకల మందిపై దాడి చేసింది. ఈ దాడిలో 12 మేకలు మృతి చెందగా మరో 3 మేకలు తీవ్రంగా గాయపడ్డాయి. సుమారు రూ.1.5 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

## ఘనంగా శివపార్వతుల కళ్యాణోత్సవం

**ముద్ర, పెద్దపల్లి:** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం రచ్చపల్లి గ్రామంలోని శ్రీ సాంబమూర్తి ఆలయంలో శనివారం శివపార్వతుల కళ్యాణం ఘనంగా జరిగింది. ఆలయంలో ఈ నెల 10 నుంచి జాతర మహోత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. 10న మల్లన్న కథ కార్యక్రమంతో ఉత్సవాలు మొదలయ్యాయి. ఈ ఉత్సవాలలో భాగంగా వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య శివపార్వతుల కళ్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ ఉత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పెర్క రవీందర్, సభ్యులు, గ్రామ సర్పంచ్ సూర రజిత – వెంకటేశం, వార్డు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. కాగా ఆదివారం మహాశివరాత్రి ఉత్సవాన్ని ఆలయంలో రథోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్ తెలిపారు. ఈ సందర్భంగా శివపార్వతుల ఉత్సవమూర్తులతో గ్రామంలో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఈ ఉత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని రవీందర్, ఆలయ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.



## గడ్డిమందు తాగిన వారిని బతికించవచ్చు

4-5 గంటల్లోపు ఆస్పత్రికి తీసుకు వస్తే బతికిస్తాం: మెడికవర్ ఆసుపత్రి నెఫ్రాలజిస్టు డాక్టర్ రాంచందర్

**ముద్ర, పెద్దపల్లి:** గడ్డిమందు (పారాకుట్) తాగిన వారిని 4–5 గంటల్లోపు ఆసుపత్రికి తీసుకు రాగలిగితే వారిని బతికించే అవకాశం ఉంటుందని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి నెఫ్రాలజిస్టు డాక్టర్ రాంచందర్ అన్నారు. శనివారం పెద్దపల్లిలోని ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎక్కువగా ఎండోసల్ఫాన్ మందు తీసుకునే వారని దానికి విరుగుడు ఉండడంతో దాదాపు అందరిని కాపాడగలిగామన్నారు. ఇటీవల ఆత్మహత్యలన్నీ గడ్డి మందుతోనే జరుగుతున్నాయన్నారు. విరుగుడు లేకపోవడం వల్ల చనిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. కానీ గడ్డి మందు తాగిన వారిని 4 నుంచి 5 గంటల్లోపు ఆసుపత్రికి తీసుకురాగలిగితే ఐదారు దశల్లో చికిత్స అందిస్తూ బ్రతికించగలుగుతున్నామని తెలిపారు.



**తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ శైవ ఆలయాలు**

పాలకొల్లు క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయం (పశ్చిమగోదావరి) పంచారామాలలో ఒకటి. ఇక్కడి రాజగోపురం చాలా ఎత్తుగా ఉండటం ప్రత్యేకత.



# పరకాలలో బలపడుతున్న బిజెపి

**ముద్ర, పరకాల:**



పరకాలలో బిజెపి బలపడుతున్న అంచనాలు కనిపిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికలు మొదలు డిసెంబర్లో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లోను నిన్న జరిగిన పరకాల మున్సిపాలిటీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తన సత్తాను చాటుకుంది. పరకాల నియోజకవర్గం నుండి రెండు పర్యాయాలు బిజెపి శాసనసభ్యుడిగా ఒంటేరు జయపాల్ గెలుపొందారు. నియోజకవర్గం కేంద్రమైన పరకాలలో బిజెపి కొంత బలాన్ని కలిగి ఉంది. అనంతరం జరిగిన అనేక అసెంబ్లీ ఎన్నికలలో నామమాత్రపు ఓట్లను పొంది అటు ప్రజల్లోను ఇటు కార్యకర్తల్లోనూ తీవ్రమైన అసంతృప్తిని ఎదుర్కొంది. ఈ క్రమంలో 2023 డిసెంబర్లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఖాళీ ప్రసాద్ రంగప్రవేశంతో బిజెపి తన అదృష్టాన్ని మరోసారి పరీక్షించుకునే ప్రయత్నం చేసింది. గత రెండు మూడు పర్యాయాలు 3వేల, 5వేల ఓట్లకు పరిమితమైనా బిజెపి 2023 లో జరిగిన ఎన్నికల్లో అనూహ్యంగా 39 వేల ఓట్లను పొందింది. దీంతో బీఆర్ఎస్ విజయ అవకాశాలకు పూర్తిగా గండి కొట్టినట్లు అయిందని బీఆర్ఎస్ శ్రేణులు భావించాయి. పరకాలలో వైద్యవృత్తిని ప్రారంభించిన డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ ప్రజల్లో విస్తృతమైన సంబంధాలను కలిగి ఉన్నాడు. సామాజికంగా మున్నూరు కాపు కులానికి చెందిన కాళీ ప్రసాద్ నియోజకవర్గంలోని తన సామాజిక వర్గంలోని వ్యక్తులను తనకు మద్దతుగా నిలుపుకొని బిజెపికి అనుకూలంగా ఉన్న క్యాడర్ను ప్రజలను ఎక్కువగా ప్రభావితం చేశాడు దాంతో కాళీ ప్రసాద్ అత్యధిక ఓట్లను పొంది బీఆర్ఎస్ కు తానేంటో నిరూపించుకున్నాడు. పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డులలో 22 మంది అభ్యర్థులను నిలిపి తన సత్తాను నిరూపించుకుంది. సుమారు 10 వార్డులలో బి ఆర్ ఎస్ విజయవకాశాలను గండి కొట్టిందని ఆ పార్టీ శ్రేణులు నెత్తినోరు బాదుకుంటున్నారు. 22 వార్డులలో పోటీ చేయగా బిజెపి మూడు వార్డులను గెలుపొందగా మరో ఆరేడు వార్డులలో గెలుపు ముంగిట నిలిచింది

## ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు..

# రేపు ప్రమాణ స్వీకారం

- యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతరావు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**



రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఎన్నికైన వార్డు కౌన్సిలర్స్ లతో ప్రమాణ స్వీకరణ ఈ నెల 16 న చేయించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శనివారం కలెక్టరేట్ లోని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ చాంబర్లో మున్సిపల్ ఎన్నికల స్పెషల్ ఆఫీసర్స్, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలో బాగంగా ఎన్నికైన వార్డ్ కౌన్సిలర్లు కలిసి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకై ఈ సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ నెల 16 న ప్రమాణస్వీకారం చేయనున్న వార్డు కౌన్సిలర్ల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, వార్డు కౌన్సిల్స్ మొత్తం ప్రమాణ స్వీకారం చేయాలని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాల ప్రకారం సమయ పాలన పాటించి ఉదయం 11 గంటలకు అందరూ సభ్యులు ఎన్నికైన వార్డు కౌన్సిలర్స్ ప్రమాణ స్వీకారం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రొసీజర్ ప్రకారం నిర్వహించాలని సూచన చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ మంచి వాతావరణంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించి ప్రమాణ స్వీకారం చేయాలని పేర్కొన్నారు. ఎన్నిక కై ఆథరైజ్ గా ఒక్కొక్క మున్సిపాలిటీకి ఒక్కొక అధికారిని నియమించడం జరిగిందని, భువనగిరి మున్సిపాలిటీ ఆథరైజ్డ్ ఆఫీసర్ గా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, యాదగిరి గుట్ట మున్సిపాలిటీకి గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, పోచంపల్లి మున్సిపాలిటీ కి సంబంధించి జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, ఆలేరు మున్సిపాలిటీకి సంబంధించి ఆర్డిఓ కృష్ణారెడ్డి, చౌటుప్పల్ మున్సిపాలిటీకి ఆర్డిఓ శేఖర్ రెడ్డి, మోత్కూర్ మున్సిపాలిటీకి సంబంధించి అడిషనల్ డిఆర్డిఓ సురేష్ ను నియమించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ నర్సిరెడ్డి, హరినాథ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు



## మున్సిపల్ చైర్మన్ గా అవకాశమివ్వాలి

- భువనగిరి 7వ వార్డు కౌన్సిలర్ కుక్కదువు పద్మ సోమయ్య

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

యాదాద్రి భువనగిరి జిల్లాలో భువనగిరి పట్టణానికి చెందిన కుక్కదువ్వ సోమయ్య 1987నుండి 2009 వరకు మూడుసార్లు కౌన్సిలర్ గా ప్రజలకు సేవలు అందించారు. భువనగిరి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా యాదాద్రి భువనగిరి జిల్లా ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షునిగా కాంగ్రెస్ పార్టీ క్రియాశీల రాజకీయాల్లో కుంభం అనిల్ కుమార్ రెడ్డి కి వెంట ఉంటూ ఎమ్మెల్యే గత ఎన్నికల గెలుపులో కీలక పాత్ర వహించిన సోమయ్య ఈ సారి మాత్రం కుక్కదువ్వ పద్మ సోమయ్య చైర్మన్ కి అన్ని అర్హత లు ఉన్నాయి కావున మున్సిపల్ చైర్మన్ అవకాశం ఇవ్వాలని ప్రజలు, నాయకులు కోరుతున్నారు.

# మంచి మనిషిని కోల్పోయాం

**ముద్ర, నడిగూడెం:**



మంచి వ్యక్తిత్వం మనసున్న మనిషిని కోల్పోయామని కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. మండల పరిధిలోని వల్లా పురం గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి రణబోతు బిక్షమా రెడ్డి అనారోగ్యం కారణంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ స్వగృహానికి చేరుకొని ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబద్ధత కలిగిన మనిషిని కోల్పోవడం బాధాకరమని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పల్లా నర్సిరెడ్డి మాజీ సర్పంచ్ వట్టికూటి చంద్రయ్య తవణం వెంకటరెడ్డి గ్రామ శాఖ అధ్యక్షులు నూకపంగు ఈదయ్య సింగిల్ విండో మాజీ డైరెక్టర్ వట్టికూటి వెంకన్న జానీమియా రామ నరసయ్య ఖాసిం పుల్లయ్య సంజీవరెడ్డి వెంకట రాములు వెంకటేశ్వర్లు జమాల్ సాహెబ్ నాగుల్ మీరా క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నిరంతర సాధన.. కృషితో విజయం

- కేజీ బీవీలో వ్యక్తిత్వ వికాస శిక్షణ
- చారుగుండ్ల రాజశేఖర్

**ముద్ర, నడిగూడెం:**



కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) నడిగూడెంలో వ్యక్తిత్వ వికాస శిక్షణా కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, జీవన నైపుణ్యాల ట్రైనర్, విజయీభవ సంస్థ వ్యవస్థాపకులు చారుగుండ్ల రాజశేఖర్ ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా ఎస్ఐ అజయ్ కుమార్, విశిష్ట అతిథిగా రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు బుగ్గారపు రామమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.., ప్రతి ఒక్కరూ వ్యక్తిత్వ వికాసంతో సంతోషకరమైన జీవితం గడపవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు వివిధ సమయాల్లో పని ఒత్తిడికి గురవుతారని, ఆ ఒత్తిడిని తగ్గించుకోవడానికి సరైన ప్రణాళిక, సమయపాలన అవసరమని సూచించారు. పదవ తరగతి పరీక్షల్లో విజయం సాధించేందుకు అనుసరించాల్సిన సోపానాలను వివరించారు. విద్యార్థుల్లో స్ఫూర్తి నింపే విజయ గాథలను పంచుకున్నారు. సోషల్ మీడియాలోని దుష్ప్రచారాల ప్రభావం, వాటిని ఎలా ఎదుర్కోవాలో, జీవన నైపుణ్యాల ప్రాముఖ్యతపై కూడా శిక్షణ అందించారు. కార్యక్రమంలో భాగంగా అభిరుచి పరీక్ష నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ వెంకటరమణ, ఎస్ఐ అజయ్ కుమార్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు బొగ్గారాపు రామమూర్తి, ఉపాధ్యాయులు సునీత తదితరులు పాల్గొన్నారు.



# పల్లకీ సేవలో శ్రీవారి దర్శనం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవ వేడుకలలో 7వ రోజు శనివారం ఉదయం పల్లకీ సేవలో స్వామివారు దివ్యంగా విరాజిల్లుతూ భక్తులకు దర్శనమిచ్చి కటాక్షానుగ్రహం ప్రసాదించారు. ఆలయంలో సుప్రభాత సేవతో మొదలుకొని నిత్య కైంకర్యాలు జరిగాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకర్షించాయి.




# యూనిటీ ఫార్మసీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ పార్టీ

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

యాదాద్రి భువనగిరి జిల్లా లోని రాయగిరి గ్రామంలో గల యూనిటీ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ పార్టీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అంపటి శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ పార్టీ కార్యక్రమంలో యూనిటీ గ్రూప్ ఆఫ్ కాలేజెస్ చైర్మన్ ఏ ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ చదువుతోపాటు క్రమశిక్షణ అలవరచుకొని తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఏఐ టెక్నాలజీకి అనుకూలంగా నూతన విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ఏవో సునీత రెడ్డి, పీజీ కళాశాల హెచ్ ఓడి సురేష్, ఫార్మసీ కళాశాల హెచ్ ఓడి రాజీవ్, ఇస్మాయిల్, అమర్నాథ్, నాగరాజు, అహ్మద్, మహేష్, ప్రియాంక, అమూల్య, పారిజాత, శైలజ, ఉమా, శ్వేత, కృష్ణ పాల్గొన్నారు.

# రోడ్డు పనులు పూర్తి చేయాలని సీపీఎం రాస్తారోకో

**ముద్ర, ఆత్మకూర్ (ఎం):**



మండలంలోని రాయగిరి మోత్కూరు కు తుక్కాపురం స్టేజి నుండి మోత్కూరు వరకు అసంపూర్తిగా వదిలివేసిన రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరు కాగా ,ఈ ప్రభుత్వం వచ్చిన కొద్ది రోజుల్లోనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేశారని ఆయన ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వేముల బిక్షం, రైతు సంఘం మండల కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ రెడ్డి, మహేష్ రాము, కుమార్, వెంకన్న, బుగ్గ రాములు, శ్రీశైలం, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# జీనియస్ లో గ్రాడ్యుయేషన్ డే

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

పట్టణంలోని జీనియస్ పాఠశాలలో శనివారం యూకేజీ విద్యార్థులకు ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ బి.సూర్యనారాయణ రెడ్డి, చైర్మన్ పడాల శ్రీనివాస్, డైరెక్టర్ తోట శ్రీధర్ హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం విద్యార్థులకు పట్టాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ డాక్టర్ బి. సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు మా ఉపాధ్యాయులు నూతన విద్య విధానంతో పాఠాలు బోధిస్తున్నామని అన్నారు. అన్ని రంగాలలో విద్యార్థులు రాణించడానికి వారిని ప్రోత్సహిస్తూ వారిలో నైపుణ్యాన్ని పెంపొందిస్తున్నామని అన్నారు. చైర్మన్ పడాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులకు కావలసిన అన్ని వసతులతో పాటు వనరులను సమకూర్చి విద్యార్థులకు ఎలాంటి లోటు పాట్లు లేకుండా విశాలమైన తరగతి గదులు క్రీడాస్థలాలు ఏర్పాటు చేసి విద్యార్థులను అన్ని రంగాల్లో ముందు ఉంచడానికి మా యాజమాన్యం ఎప్పుడు ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి స్వర్ణలత, ఏవో జి.రవి ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ఎవరికీ అమ్ముడుపోము

- కొత్తగూడెం బీఆర్ఎస్ కార్పొరేటర్లు

**ముద్ర, కొత్తగూడెం:**

ఇటీవలె కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు సమావేశ విషయమై సోషల్ మీడియాలో బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీకి అమ్ముడుపోయారని గ్లోబల్ ప్రచారం చేస్తున్న విషయాన్ని ఖండించారు. ఈ సందర్భంగా ఎనిమిది మంది కార్పొరేటర్లు మాట్లాడుతూ.. కేటీఆర్ గారి నిర్ణయం మేరకు సిపిఐ పార్టీతో పొత్తు ఉంటుందని అదేవిధంగా ఈ విషయంలో పార్టీ నిర్ణయానికి కట్టుబడి మా బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులందరూ ఏకధాటిమీద ఉంటామని ప్రమాణం చేశారు.





## పూర్వ విద్యార్థుల వితరణ

**ముద్ర, ఖమ్మం:**

ఖమ్మం నగరంలోని గుట్టల బజార్ ప్రాంతంలో గల మౌంట్ ఫోర్ట్ పాఠశాలకు ఆపాఠశాల లో విద్యనభ్యసించిన 1982 బ్యాచ్ విద్యార్థులు 50 కుర్చీలను వితరణగా ఇచ్చారు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లు, స్కేళ్ళు, పెన్నులు, పెన్సిల్లతో పాటు పరీక్ష సామాగ్రి అందజేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు,ఎస్.బి.ఐ.టి., ఆర్జెసి విద్యా సంస్థల చైర్మన్ గుండాల కృష్ణ హాజరై పాఠశాల ప్రధానోపాధ్యాయులు బ్రదర్ జాన్ పాల్ కు, పరీక్ష సామాగ్రి ని విద్యార్థుల కు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు థామస్, రవి, పూర్వ విద్యార్థులు బాల శౌరీ,బీవీ.రామారావు, గుడ్ల శ్రీనివాస్, పీవిజి. మూర్తి పాల్గొన్నారు.

## పింఛన్లు ఇవ్వాలి

**ముద్ర, ఆత్మకూర్ (ఎం):**



స్థానిక సంస్థల మాజీ ప్రజా ప్రతినిధులకు పింఛన్లు ఏర్పాటు చేయాలని మాజీ జెడ్పిటీసి ప్రతికంఠం పూర్ణచందర్ రాజు కోరారు. పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి తీర్మానించారు. ఎక్కువ శాతం బీద పరిస్థితి లో ఉన్నారని, స్థానిక సంస్థలలో సర్పంచ్ ఎంపీటీసీ, జడ్పిటిసి మండల పరిషత్ అధ్యక్షులు జిల్లా పరిషత్ అధ్యక్షులుగా పనిచేశారని గుర్తుచేశారు. ఈ సమావేశంలో మాజీ మండల అధ్యక్షులు ప్రతికంఠం హేమలత రాజు, మాజీ సర్పంచ్ లు నోముల నర్సిరెడ్డి, ఎరుకల స్వామి బి. లక్ష్మమ్మ, జోగు పిచ్చమ్మ యాస బుచ్చి రెడ్డి

# అవినీతి రహిత పురపాలికలుగా తీర్చి దిద్దండి..

- సూర్యాపేట పట్టణాభివృద్ధికి కృషి చేస్తా
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ముద్ర, సూర్యాపేట:**



సూర్యాపేట పురపాలక సంఘాన్నిఅవినీతి రహిత పురపాలక సంఘంగా తీర్చి దిద్దాలని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి హితవుపలికారు. గతంలో సూర్యాపేట పురపాలక సంఘంలో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలు పునరావృతం కాకుండా నూతన పాలక మండలి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఉద్బోధించారు. నూతనంగా ఎన్నికయిన సూర్యాపేట పురపాలక సంఘం ప్రతినిధులు శనివారం సాయంత్రం హైదరాబాద్ లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. 48 వార్డులకు గాను 31 స్థానాలలో విజయం సాధించిన కౌన్సిలర్లను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ రహదారి మీద ఉన్న సూర్యాపేట పట్టణం ఇప్పటివరకు ఊహించిన మేరకు అభివృద్ధి సాధించలేక పోయిందన్నారు. పట్టణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ మీద చూపిన ఆదరణ అనన్య సామాన్యమైనదని,ప్రజలు మనమీద అపారమైన నమ్మకంతో గురుతర బాధ్యత మోపారని వారి నమ్మకాన్ని నిలబెట్టేందుకు కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు పని చేయాలని ఆయన ఉపదేశించారు. జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రిగా సూర్యాపేట పట్టణాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ఎప్పటికప్పుడు పట్టణాభివృద్ధిపై సమీక్షించుకుని ప్రత్యేక ప్రణాళికలు రూపొందించేందుకు కార్యాచరణ పథకాన్ని రూపొందించుకుందమన్నారు. అందుకు సరిపడా నిధులు తెచ్చి సూర్యాపేట పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి,ఏ.ఐ.సి.సి సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి, సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, పిసిసి కార్యదర్శి చకిలం రాజేశ్వర్ రావు లతో పాటు నూతనంగా ఎన్నికయిన కౌన్సిలర్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
15.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ శైవ ఆలయాలు



అమరావతి అమరేశ్వర స్వామి ఆలయం (గుంటూరు) పంచారామ క్షేత్రాల్లో ముఖ్యమైనది. కృష్ణా నది తీరంలో ఉన్న పవిత్ర క్షేత్రం.

# 16న ప్రజావాణి రద్దు

- **కలెక్టర్ ప్రావీణ్య**

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**



ఈ నెల 16న (సోమవారం) నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని ఆమె కోరారు.

# కాంగ్రెస్ కు అండగా నిలిచిన ప్రజలు

- **20వ వార్డు కౌన్సిలర్ రియాజ్**

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**



మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా నిలిచారని 20వ వార్డు కౌన్సిలర్ రియాజ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనపై బీఆర్ ఎస్ నాయకులు బాకీ కార్డుల పేరుతో రద్దాంతం చేస్తున్నారని ఆరోపించారు. పది సంవత్సరాల పాలనలో మీరు ఇచ్చిన హామీలు ఎన్ని నెరవేర్చారో సమాధానం చెప్పాలని బీఆర్ ఎస్ నాయకులను నిలదీశారు. కాంగ్రెస్ ను ప్రశ్నించే నైతిక హక్కు బీఆర్ ఎస్ కు లేదని తేల్చి చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో మాజీ సీఎం కేసీఆర్ ఇలాకలో ఏడు వార్డులను కాంగ్రెస్ గెలుచుకుందని తెలిపారు. సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ సంగారెడ్డిలో ప్రచారం చేశారని, అక్కడ ఏలాంటి ఫలితాలు వచ్చాయో కనబడుతున్నాయన్నారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో దళితున్ని సీఎం ఎందుకు చేయలేదని, రేషన్ కార్డులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. దళిత, బీసీ, మైనార్టీ బంధులను వారి అనుచరులకు ఎందుకు ఇచ్చారని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పేదలకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సిద్దిపేటలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే మున్సిపాలిటీలో జరిగిన అవినీతిని బయట పెడతానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సలీం, అమీర్, సోహెల్ పాల్గొన్నారు.



# అబ్బురపరిచిన యోగా విన్యాసాలు

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**

సిద్దిపేట జిల్లా యువజన క్రీడా శాఖ, యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగ విన్యాసాలు అబ్బుర పరిచాయి. శనివారం జిల్లా కేంద్రంలోని షిరిడి సాయిబాబా గుడి హాల్ లో నిర్వహించిన సీఎం కప్ యోగా సెలక్షన్స్ అండ్ కాంపిటీషన్స్ లో జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు. ట్రెడిషనల్, ఆర్టిస్టిక్, రిథమిక్ విభాగాల్లో పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ వేడుకలో సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్ మాట్లాడుతూ ఎవరైతే యోగా సాధనకు దగ్గరుంటారో వారు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. వారు చదువుల్లో, అన్ని రంగాల్లో వికసిస్తారని చెప్పారు. యోగ సాధనకు దూరంగా ఉన్నవారు రోగాలకు దగ్గరగా అవుతారని హెచ్చరించారు. గత సంవత్సరం సిద్దిపేట జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి సీఎం కప్ యోగా పోటీల్లో పాల్గొన్న మనీష, సింధూరి బంగారు పతకాలు సాధించారని గుర్తు చేశారు. వీరికి ఇరువై వేల రూపాయల చొప్పున నగదు బహుమతులు వచ్చయన్నారు. తృతీయ స్థానం సాధించిన పూజితకు పది వేల రూపాయల బహుమతి వచ్చిందన్నారు. విద్యార్థులు, యువకులు నిరంతరం యోగా సాధన చేయాలని సూచించారు. వారికి అవసరమైన మెళకువలు, నైపుణ్యాలను అందిస్తామని హామీ ఇచ్చారు. సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పుష్కర కాలం నుంచి సిద్దిపేటలో అందిస్తున్న యోగ శిక్షణ ద్వారా ఎంతో మంది రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందరన్నారు.
షిరిడి సాయిబాబా దేవస్థానం అధ్యక్షుడు గంద శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులను ఆశీర్వదించారు. మరింత రాణించి రాష్ట్ర స్థాయిలో గెలుపొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు.
ప్రముఖ యోగా శిక్షకురాలు తోట సంధ్య మాట్లాడుతూ సీఎం కప్ లో జిల్లా స్థాయిలో ఎంపికైన బాలబాలికలకు ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. తద్వారా రాష్ట్రస్థాయిలో మెడల్స్ సాధించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ, ప్రముఖ యోగ శిక్షకులు తోట సతీష్, యోగ న్యాయ నిర్ణీతలుగా రాజకుమార్, గంగాపురం శ్రీనివాస్ , బి, సంధ్య, కిషన్, శ్రీ ప్రసన్న, వ్యాయామ ఉపాధ్యాయులు రాధిక, రజిత, రజిని, యోగా అసోసియేషన్ సభ్యులు పల్లె సురేష్, వాసవి, అర్చన తదితరులు పాల్గొన్నారు.



# శిబిరం నుంచి మున్సిపల్ ఆఫీస్ కు..

- **ధ్రువీకరణ పత్రాలు తీసుకెళ్లిన కాంగ్రెస్, బీఆర్ఎస్ విజేతలు**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు శిబిరం నుంచి వచ్చి ధ్రువీకరణ పత్రాలు తీసుకెళ్లారు.
పోలింగ్ పూర్తి కాగానే రెండు పార్టీల అభ్యర్థులు శిబిరాలకు వెళ్లారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు క్యాంప్ నుంచి మెదక్ మున్సిపల్ ఆఫీస్ కు తరలి వచ్చారు. వారి వెంట పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీలు సుభాష్ రెడ్డి, ఫరూక్ హుస్సేన్, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి ఉన్నారు. గెలుపొందిన అభ్యర్థులను మాత్రమే కార్యాలయంలోకి అనుమతించడంతో వీరు గేట్ ఎదుల వేచి ఉన్నారు. ధృవీకరణ పత్రం తీసుకున్న అనంతరం వారంతా తిరిగి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్ లో క్యాంప్ నకు తరలివెళ్లారు. అనంతరం కాంగ్రెస్ పార్టీకి చెందిన 15 మంది మెదక్ మున్సిపల్ కార్యాలయానికి వచ్చి గెలుపు ధృవీకరణ పత్రం తీసుకున్నారు. అనంతరం వారు శిబిరానికి బయలుదేరి వెళ్లారు. కాగా కాంగ్రెస్ పార్టీ నాయకులు గేట్ బయట వేచి ఉన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా టౌన్ ఇన్ స్పెక్టర్ మహేష్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.





# ఏడుపాయల జాతరకు భారీ బందోబస్తు

- **ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం నుంచి మూడు రోజుల పాటు జరుగనున్న ఏడుపాయల వనదుర్గ మాత జాతరకు వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు తెలిపారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతర ప్రాంగణం మొత్తం సీసీ టీవీ కెమెరాల నిఘాలో పెట్టమన్నారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో దర్శనం చేసుకుని వెళ్లేలా అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.
భక్తులు అనుమానాస్పద వస్తువులను తాకవద్దన్నారు. పోలీసుల సూచించిన ప్రాంతాల్లోనే వాహనాలను పార్క్ చేయాలని సూచించారు. క్యూ లైన్లు తప్పనిసరిగా పాటించాలన్నారు. బారికేడ్లు దాటి ముందుకు రావద్దన్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 లేదా సమీప పోలీసు సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. మహిళల భద్రత కోసం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ షీ టీమ్స్, మహిళా పోలీసు సిబ్బంది, మఫ్టీ పోలీసులను మోహరించినట్లు తెలిపారు.
రాత్రి వేళల్లో ఫుట్ పెట్రోలింగ్, మఫ్టీ పార్టీలు, క్యూఆర్టీ టీమ్స్ ద్వారా నిరంతర నిఘా కొనసాగుతుందని చెప్పారు. బందోబస్తులో అదనపు ఎస్పీ, నలుగురు డిఎస్పీలు, 19 మంది సీఐలు, 66 మంది ఎస్ఐలు, 150 మంది ఏఎస్ఐలు/హెడ్ కానిస్టేబుళ్లు, 220 మంది కానిస్టేబుళ్లు, 120 మంది మహిళా పోలీసులు, 266 మంది హోంగార్డులు సహా సుమారు 900 మంది అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు వివరించారు.



# ఏడుపాయల పుస్తకం ఆవిష్కరణ

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గా భవాని ఆలయంపై బుర్ర సంతోష్ రాసిన పుస్తకాన్ని శనివారం స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో ఏడుపాయల రెండో అతి పెద్ద జాతర అన్నారు. ఏడుపాయల జాతరకు రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు వచ్చి అమ్మవారిని దర్శనం చేసుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఏడుపాయల పుస్తకం రావడం సంతోషకరమని పేర్కొన్నారు.



# ఆర్థిక సాయం అందజేత

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**

జోగిపేట్ ఏరియా ఆసుపత్రిలో అనారోగ్యంతో మృతిచెందిన ఫార్మసిస్ట్ రాము కుటుంబానికి శనివారం ఆర్థిక సాయం అందజేశారు. వైద్య విధాన పరిషత్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ తరపున మృతుని కూతురి పేరుపై డిపాజిట్ చేసిన లక్షయాభై వేలకు సంబంధించిన పత్రాలను ఆయన భార్య మంజులకు సంగారెడ్డి డిసిహెచ్ఎస్ డా.షరీఫ్ సమక్షంలో అందజేశారు. జోగిపేట ఆసుపత్రి సిబ్బంది డిపాజిట్ చేసిన రూ. 43 వేలకు సంబంధించిన పత్రాలను హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. సౌజన్య అందజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ ఆర్ఎంవో డా. అశోక్, నర్సింగ్ సూపరింటెండెంట్లు పూలమాంబ, సునంద, ఫార్మసిస్ట్ యూనియన్ నాయకులు సోమమల్లన్న, పాండు, పరాబ్ కుమార్, రామారావు, శివకుమార్, సెల్వరాణి. హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



# పట్టణాభివృద్ధి కోసం కృషి చేస్తాం

- **ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**

**ముద్ర, హైదరాబాద్:**

భీమ్‌గల్ పట్టణాభివృద్ధి కోసం ప్రజలతో కలిసి పనిచేస్తూ, వారి సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ కృషి చేస్తుందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. భీమ్‌గల్ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని, బీఆర్ఎస్ పార్టీకి ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు బీఆర్ఎస్ విజయం సాధించడానికి కష్టపడిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు ధన్యవాదాలు తెలియజేశారు. గెలుపునకు పొంగిపోబోమని, ఓటమికి కుంగిపోబోమని తెలిపారు. ఓడినా ప్రజల పక్షాన నిలబడి, వారికి ఇచ్చిన హామీల అమలు సాధన కోసం నిరంతరం పోరాడుతూనే ఉంటామని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన బీఆర్ఎస్ కౌన్సిలర్లకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గెలుపొందిన అభ్యర్థులు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుని పారదర్శకంగా సేవ చేయాలని సూచించారు.

# మహా శివరాత్రికి ముస్తాబైన ఆలయాలు

**ముద్ర, హైదరాబాద్:**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండలం రామారం, మంతూరు తదితర గ్రామాల్లో శివాలయాలు ఉత్సవ శోభతో ముస్తాబయ్యాయి. రామారం మహాదేవుని ఆలయంలో ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా పంచామృత రుద్రాభిషేకం, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం రుద్రహోమం అనంతరం పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని ఘనంగా జరపనున్నారు. మంగళవారం ఉదయం రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, సర్పంచ్, పాలకవర్గ సభ్యులు తెలిపారు. మంతూరులో మల్లన్న కళ్యాణం.. మహాశివరాత్రి సందర్భంగా మంతూరు గ్రామంలోని మల్లన్న గుట్ట ఆలయంలో శనివారం హోమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం అభిషేకం నిర్వహించి, సాయంత్రం మల్లన్న కళ్యాణం, అన్నదాన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు.

**పార్థేశ్వరాలయంలో కల్యాణ మహోత్సవం..**

రాయపోల్ మండల కేంద్రంలోని శ్రీ ఉమా పార్థీవేశ్వర ఆలయంలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి స్వామివారికి పంచామృతాభిషేకం. పుష్పాలంకరణ. బిల్వార్చన. మంగళ హారతి. మంత్రపుష్పం. తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం స్వామివారి ఎదుర్కోలు పార్వతీ పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అర్ధరాత్రి ఒంటిగంట నుంచి ఉదయం 5 గంటల వరకు లింగోద్భవ కాలానికి పంచామృత అభిషేకం స్వామివారి అలంకరణ మంగళ హారతులు తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు.



# బీఆర్ఎస్ దే నైతిక విజయం

**ముద్ర, హైదరాబాద్:**

కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీదే నైతిక విజయమని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డిలో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని హత్య చేసి గెలిచిందని ఆరోపించారు. అధికారంలో ఉన్నామని స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పోలింగ్ కేంద్రాల లోపలికి వెళ్లడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. ఎమ్మెల్యే అనుచరులు, పీఏలు రాత్రింబవళ్లు నోట్ల కట్టలు పంపిణీ చేశారని, మద్యాన్ని ఏరులై పారించారని ఆరోపించారు. 4,6 వార్డుల్లో రిగ్గింగ్ చేయడంవల్లే అక్కడ గెలిచారని జాజాల తెలిపారు. అధికార బలాన్ని ఉపయోగించి ఎన్నికల్లో గెలిస్తే అది విజయం కాదన్నారు. ఎల్లారెడ్డి ప్రజలు కాంగ్రెస్ పార్టీ తీరును గమనిస్తున్నారని పేర్కొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
15.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ శైవ ఆలయాలు**

భీమవరం సోమేశ్వర స్వామి ఆలయం (పశ్చిమగోదావరి) పంచారామాలలో ఒకటి. అమావాస్య, పౌర్ణమి రోజుల్లో లింగం రంగు మారుతుందని విశ్వాసం.





# ప్రధాన పార్టీలకు సినిమా చూపిస్తాం

- **మున్సిపల్ ఎన్నికల్లో ట్రైలరే చూపించాం**
- **జాగృతి అధ్యక్షురాలు కవిత**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

రానున్న రోజుల్లో రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు సినిమా చూపిస్తామని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సవాల్ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి మద్దతు తెలిపి ఊహించని ఫలితాలతో ట్రైలర్ మాత్రమే చూపించామని చెప్పారు. పుర ఎన్నికల్లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, జాగృతికి చెందిన 40 మంది అభ్యర్థులను ప్రజలు గెలిపించారన్నారు, శనివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని జాగృతి ప్రధాన కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. హామీలను కాంగ్రెస్ నిలబెట్టుకోకుండానే మున్సిపల్ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలుచుకోవడం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. బీఆర్ఎస్ చాలా చోట్ల మూడు, నాలుగు స్థానాలకు పడిపోయిందని చెప్పారు. తెలంగాణకు రూపాయి ఇవ్వని బీజేపీ కరీంనగర్ మేయర్ స్థానం తప్ప అన్ని చోట్ల అష్టకష్టాలు పడిందని వ్యాఖ్యానించారు. తాము త్వరలోనే రాజకీయ పార్టీగా మారబోతున్నామని చెప్పారు. సమయం తక్కువగా ఉన్నప్పటికీ కార్యకర్తల ఒత్తిడి మేరకు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తో కలిసి పోటీ చేసినట్లు వివరించారు. జోగులాంబ గద్వాల జిల్లా వడ్డెపల్లి మున్సిపాలిటీలో తమకు క్లియర్ మాన్‌డేట్ ను ప్రజలు కట్టబెట్టారని చెప్పారు. కానీ కాంగ్రెస్ నేతలు తమ ప్రలోభాలతో వారిని లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. నారాయణ్ పేట మున్సిపాలిటీలోనూ తమకు వైస్ ఛైర్మన్ పదవి ఆఫర్ చేస్తున్నట్లు కవిత వెల్లడించారు.

# చైనా సరిహద్దుల్లో మోడీ సాహసం..

- **అస్సాం హైవే మీద దిగిన మోదీ విమానం**

**ముద్ర న్యూస్:**



అది చైనా సరిహద్దుల్లోని భారత్ లోని ఈశాన్య రాష్ట్రం అస్సాం. వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ)కి అత్యంత సమీపంలో ఉంటుంది. అత్యంత సున్నితమైన ఈ ప్రాంతంలో ఈశాన్య రాష్ట్రాల్ని కలిపే జాతీయ రహదారి ఉంది. దీనిపై ఇవాళ ప్రధాని మోడీ ప్రయాణించిన సీ130జే యుద్ధ విమానం హఠాత్తుగా ల్యాండ్ అయింది. దీంతో ఒక్కసారిగా జనం కేరింతలు కొడుతూ స్వాగతం పలికారు. ఈ ఫెసిలిటీ చైనా సరిహద్దుకు 300 కి.మీ దూరంలో ఉంది. ప్రధాని మోదీ దీన్ని నేడు ప్రారంభించారు. ఈ సందర్భంగా వాయుసేన ప్రత్యేక విన్యాసాలు ప్రదర్శించింది. ఈ ఫెసిలిటీ గురించి మోదీ ఇప్పటికే ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. క్లిష్ట సమయంలో సహాయ కార్యకలాపాలకు, అత్యవసర ప్రతిస్పందనకు ఈ ఈఎల్ఎఫ్ కీలకమని పేర్కొన్నారు. ప్రధాని మోడీ ఇవాళ అస్సాంలోని మోరాన్ లో ఉన్న హైవే మీద సీ13జే యుద్ధ విమానంలో అత్యవసర ల్యాండింగ్ అయ్యారు. ఇక్కడ యుద్ధ అవసరాల కోసం జాతీయ రహదారిని కాస్తా రన్ వేగా మార్చారు. అత్యవసర పరిస్థితుల్లో యుద్ధ విమానాలు ఇక్కడ ల్యాండ్ అయ్యేందుకు వీలుగా ఈ ఏర్పాటు చేశారు. దీన్ని పరీక్షించేందుకు ఇవాళ ప్రధాని మోడీ అక్కడికి వెళ్లారు. ఈశాన్య భారత దేశంలో నిర్మించిన తొలి అత్యవసర విమాన ల్యాండింగ్ ఫెసిలిటీ ఇది.సవాలుతో కూడిన పరిస్థితుల్లో రెస్క్యూ, రిలీఫ్ కార్యకలాపాలను సకాలంలో మోహరించడానికి వీలుగా అత్యవసర ప్రతిస్పందనకు ఈ సౌకర్యం చాలా ముఖ్యమైనదని ప్రధాని మోదీ ఎక్స్ లో తెలిపారు. దేశవ్యాప్తంగా యుద్ధ పరిస్థితుల్లో సాధారణ విమానాశ్రయాలు, ఎయిర్ స్ట్రిప్ ల మీద శత్రువులు దాడి చేస్తే.. ప్రత్యామ్నాయంగా మన యుద్ధ విమానాలు ల్యాండ్ అయ్యేందుకు వీలుగా ఇలా ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీలను ఆర్మీ నిర్మిస్తోంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న హైవేలనే ఇలా ఎయిర్ స్ట్రిప్ లుగా మారుస్తోంది. సాధారణ పరిస్థితుల్లో ఇవి హైవేలుగా ఉపయోగపడతాయి. అత్యవసర పరిస్థితుల్లో మాత్రం యుద్ధ విమానాలకు పనికొస్తాయి.





# శివోహం

- **ఎములాడ.. ఏడుపాయల సిద్ధం**
- **మహా శివరాత్రి జాతరకు ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం**
- **నేటి నుంచి మూడు రోజులు జాతర**
- **భారీ పోలీసు బందోబస్తు**
- **వేములవాడలో భక్తుల కోసం రెండు లక్షల లడ్డూలు తయారీ**

**ముద్ర న్యూస్:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎములాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం శివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. వేములవాడ అనుబంధమైన భీమేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉత్సవాల సందర్భంగా రాజన్న, భీమన్న ఆలయాలను రంగురంగుల విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. పట్టణం నలువైపులా స్వాగత తోరణాలు, భక్తులు రాజన్న సన్నిధికి చేరుకునేందుకు వీలుగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు వీధుల్లో చలువపందిళ్లు వేశారు. ఏర్పాట్లను ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్, ఎస్పీ మహేశ్ బి.గితే, ఆలయ ఈవో రమాదేవి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

**2.5 లక్షల మంది వస్తారని అంచనా..**

ఆదివారం జరిగే మహాశివరాత్రి జాతరకు సుమారు 2.5 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. అందుకు తగ్గట్లుగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. భక్తుల స్నానాల కోసం ప్రత్యేకంగా దేవస్థాన పార్కింగ్ వద్ద పురుషుల కోసం 120, మహిళల కోసం 140 వాటర్ షవర్లు ఏర్పాటు చేశారు.

భారీ సంఖ్యలో వచ్చే భక్తులకు ప్రధానంగా వసతి గదులు, తాగునీటి విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించారు. భక్తుల కోసం ఇప్పటికే రెండు లక్షల లడ్డూలను సిద్ధం చేసినట్లు ఆలయ ఆఫీసర్లు తెలిపారు. వేములవాడకు వచ్చే అన్ని మార్గాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అత్యవసర సెంటర్లను సైతం సిద్ధం చేశారు.

**ప్రత్యేక క్యూఆర్ కోడ్..**

వేములవాడకు వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు దేవస్థాన వివరాలు తెలుసుకునేలా ప్రత్యేక వాట్సప్ నంబర్, క్యూఆర్ కోడ్‌ను ఈవో రమాదేవి ప్రారంభించారు. పోస్టర్‌లో ఇచ్చిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేసినా లేదా 87369 36969 నంబర్‌కు వాట్సప్‌లో హాయ్ అని మెసేజ్ చేసినా దేవస్థానం వివరాలు కనిపించనున్నాయి. ఇందులో దర్శనం, సేవల సమయాలు, దర్శన టికెట్ కౌంటర్లు, ప్రసాదం కౌంటర్, అన్నప్రసాదం, రవాణా సదుపాయాలు, హాస్పిటల్, దివ్యాంగుల సౌకర్యాలు, తాగునీరు, మరుగుదొడ్లు, కల్యాణకట్ట, సమాచార కేంద్రం, పోలీస్ స్టేషన్ వంటి 12 రకాల సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు వెల్లడించారు.

**600 స్పెషల్ బస్సులు..**

వేములవాడలో జరిగే మహాశివరాత్రి జాతర ఉత్సవాల కోసం వివిధ ప్రాంతాల నుంచి 600 బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ బోనాల శ్రీనివాస్ తెలిపారు. వరంగల్‌తో పాటు కోరుట్ల, మెట్‌పల్లి, ఆర్మూర్, నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, కరీంనగర్, నర్సంపేట, హనుమకొండ, హైదరాబాద్, సిరిసిల్ల, హుజూరాబాద్ నుంచి బస్సులు నడుస్తాయని ప్రకటించారు. అలాగే వేములవాడ బస్టాండ్ నుంచి ఆలయం వరకు మూడు రోజులు 24 గంటల పాటు ఉచిత బస్సులను నడిపిస్తాయని చెప్పారు.

ప్రతి భక్తుడికి దర్శనం కల్పిస్తాం : ఈవో రమాదేవి

వేములవాడలో జరిగే మహాశివరాత్రి జాతర కోసం వచ్చే ప్రతి భక్తుడికి స్వామి దర్శనం కల్పిస్తాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, పూర్తి సమాచారం తెలుసుకునేందుకు క్యూఆర్ కోడ్‌ను రిలీజ్ చేశాం. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు హెల్త్ పరంగా ఇబ్బందులు తలెత్తకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అత్యవసర కేంద్రాలు, హెల్ప్ డెస్క్‌లు సిద్ధం చేశాం.

**ముస్తాబైన వన దుర్గ భవాని మాత క్షేత్రం..**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

పట్టణంలోని ఏడుపాయల వన దుర్గ భవాని మాత క్షేత్రం మహాజాతరకు ముస్తాబైంది. మూడు రోజుల పాటు జాతర జరగనుండగా అదివారం మహా శివరాత్రి, సోమవారం బండ్లు, బోనాలు, మంగళవారం రాత్రి రథోత్సవం ఉంటాయి. ఆలయం వెనక గుట్టమీద, ప్రాంగణంలో ఉన్న ఎత్తైన బండలకు సంప్ర దాయ బద్ధంగా సున్నం, జాజు నామాలతో అలంకరించారు. ఆలయం ముందున్న మంజీరా నది పాయ మధ్యలో భక్తులను ఆకట్టుకునేలా భారీ శివలింగం సెట్టింగ్ ఏర్పాటు చేశారు. ఆదివారం తెల్లవారు జామున పూజారులు రాతి గుహలో కొలువైన వనదుర్గా భవానీమాతకు అభిషేకం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేస్తారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తారు. జాతరకు తెలంగాణాలోని వివిధ జిల్లాలతోపాటు, పొరుగున ఉన్న కర్నాటక, మహారాష్ట్ర నుంచి 8 నుంచి 10 లక్షల మంది భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా వేశారు. కలెక్టర్ రాహుల్ రాజ్ జాతర ప్రాంగణంలో తిరిగి ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తుల కోసం షవర్ లు ఏర్పాటు చేశారు. తాగునీటి కోసం జాతర ప్రాంగణంలో 100 చోట్ల నల్లాలను బిగించారు. 40 వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా కోసం ఏర్పాట్లు చేశారు. అనేక చోట్ల టెంపరరీ టాయిలెట్స్ ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ మెదక్ రీజియన్ పరిధిలోని వివిధ డిపోల నుంచి 150 స్పెషల్ బస్సులు నడుపుతోంది. అలాగే హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి 50 స్పెషల్ బస్సులు ఏర్పాటు చేశారు. 150 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూసేందుకు, ట్రాఫిక్ నియంత్రణ కోసం ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మంది పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. 9 క్యూఆర్టీ టీమ్ లను నియమించారు. భక్తులకు నీడ కోసం రాజగోపురం నుంచి ప్రధాన ఆలయం వరకు షామియానాలు, కార్పెట్లు ఏర్పాటు చేశారు.

# ఏపీ బడ్జెట్ : "విశాఖ"కు నిధుల వరద!

**ముద్ర, అమరావతి :**

ఏపీ బడ్జెట్లో విశాఖకు అత్యంత ప్రాధాన్యం దక్కింది. విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేసిన ఆర్థిక ప్రాంతానికి సింహభాగం కేటాయింపులు చేశారు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఈరోజు బడ్జెట్ను ప్రవేశపెట్టారు. రూ. 3,32,205 కోట్ల రూపాయలతో బడ్జెట్ సభలో పెట్టారు. అన్ని రంగాలకు కేటాయింపులు జరిపారు. మరోవైపు విశాఖ ఆర్థిక ప్రాంతానికి గాను ఏకంగా 28 వేల కోట్ల రూపాయలు కేటాయించడం విశేషం. దాదాపు పది జిల్లాలతో విశాఖ ఆర్థిక కేంద్రాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. దేశంలో ముంబాయిని ఆర్థిక రాజధానిగా చూస్తున్న మాదిరిగా.. ఏపీలో ఆర్థిక రాజధానిగా విశాఖను అభివృద్ధి చేయాలని చంద్రబాబు సర్కార్ కృతనిశ్చయంతో ఉంది. కొద్ది రోజుల కిందట విశాఖ ఎకనమిక్ రీజియన్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు భారీగా కేటాయింపులు చేయడం ద్వారా ఏ స్థాయిలో ప్రాధాన్యమిస్తున్నారో అర్థం అవుతుంది. 2032 నాటికి 120 బిలియన్ డాలర్ల సంపద సృష్టి లక్ష్యంతో ముందుకు సాగుతోంది చంద్రబాబు సర్కార్.

**ప్రపంచ దిగ్గజ సంస్థలు రాక..**

ఇప్పటికే ప్రపంచ ఐటీ దిగ్గజ సంస్థలు విశాఖకు వస్తున్నాయి. పక్కనే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటయింది. సువిశాల తీర ప్రాంతంలో పర్యాటక ప్రాజెక్టులు ఏర్పాటు అవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు వస్తున్నాయి. విశాఖ తో పాటు అనుబంధంగా ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాలు నిలవాలన్నది చంద్రబాబు ప్రణాళిక.. తాజాగా కేటాయించిన



నిధులతో పది జిల్లాల్లో ఆర్థిక కార్యకలాపాలను ముమ్మరం చేస్తారు. లక్షలాది ఎకరాలను గుర్తించి పారిశ్రామిక అవసరాల కోసం వినియోగిస్తారు.

**ప్రణాళిక ఇదే..**

ప్రస్తుతం విశాఖ ప్రాంతం 36వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం. 15.5 మిలియన్ జనాభా ఉన్న ఈ ప్రాంతంలో 49 బిలియన్ డాలర్ల జిడిపి నమోదవుతోంది. 2032 నాటికి 20 నుంచి 24 లక్షల మేర ఉద్యోగాలు పెంచేందుకు అవకాశం ఉండడంతో.. ఈ ప్రాంతం రాష్ట్ర పురోగతిలో కీలకం కానుంది. సువిశాల తీర ప్రాంతం కావడంతో ఆరు పోర్టులు, 7 మ్యానుఫ్యాక్చరింగ్ నోడ్లు, 17 మేజర్ వ్యవసాయ క్షేత్రాలు, ఆరు సర్వీస్ హబ్స్, 12 పర్యాటక హబ్స్తో విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి చేయాలన్నది ప్రణాళిక. అందుకే ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా తన బడ్జెట్లో 28 వేల కోట్ల రూపాయలను కేటాయించింది. ఐటీ, వ్యవసాయం, పర్యాటకం, హెల్త్ కేర్, పట్టణీకరణ, మౌలిక వసతుల కల్పన.. ఇలా ఏడు గ్రోత్ డ్రైవర్లను నిర్ణయించారు.

**అంతా భారీ వ్యూహం..**

విశాఖ ఎకనామిక్ రీజియన్ కు ఈ స్థాయిలో నిధులు కేటాయించడం వెనుక భారీ వ్యూహం ఉంది. ఈ నిధులను సక్రమంగా ఖర్చు చేసి.. ప్రణాళికలు అమలు చేయగలిగితే వచ్చే ఏడు వేలలో 7.5 లక్షల గృహాలు, పదివేల హోటల్ రూములు, 20 వరకు ఇన్నోవేషన్ సెంటర్లు, పది కాలేజీలు, 7వేల ఆసుపత్రి బెడ్స్, 20వేల హెక్టార్ల పరిధిలో పరిశ్రమలు, 80 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్యాలయ సముదాయం, 60 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో గోదాములు నిర్మించేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధమయ్యాయి. మొత్తానికి అయితే విశాఖ ప్రాంతానికి బడ్జెట్ నిధుల కేటాయింపు అనేది ఒక గేమ్ చేంజర్ గా నిలవనుంది.

# కాంగ్రెస్ విజయం గుడ్డిలో మెల్ల

**మున్సిపల్ ఎన్నికల్లో డబ్బు, మద్యం ఎరులై పారింది**

- **మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**



మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గుడ్డిలో మెల్లలాగా గెలిచిందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దుయ్యబట్టారు. శనివారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో డబ్బులు, మద్యం ఎరులై పారిందని విమర్శించారు. బీఆర్ ఎస్ కార్యకర్తలు ధైర్యంగా పోరాటం చేసి గెలుపొందారన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ పాలనలో ఎన్నో అద్భుతాలు చూశారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం సాధించడం ఒక్క అద్భుతమైన ఘట్టామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్టాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని అనేక ప్రాజెక్ట్ లు నిర్మించారని చెప్పారు. రైతులకు అండ దండగ ఉన్నారన్నారు. గతంలో నీరు, విద్యుత్ లేక రాష్ట్రంలో రైతులు ఇబ్బంది పడ్డారన్నారు. పండించిన పంట కు గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడితే కేసీఆర్ పంట సాయం చేశారని తెలిపారు. తాను టీడీపీ లో ఉన్నపుడు ఐదు గంటలకు మించి విద్యుత్ రాకపోయేదన్నారు. కాని తెలంగాణ ఏర్పడ్డాక 24 గంటలు కరెంటు ఇచ్చామన్నారు. అందరి పోరాటం వల్ల వచ్చిన రాష్ట్రాన్ని కేసీఆర్ అద్భుతంగా తీర్చిదిద్దారన్నారు. సిద్దిపేట ను హరీష్ రావు బాగా అభివృద్ధి చేశారని చెప్పారు. రియల్ ఎస్టేట్ రంగం కాంగ్రెస్ ప్రభుత్వం లో కుదేలైందన్నారు. కేసీఆర్ హయాంలో భూముల ధరలు ఆకాశాన్ని అంటితే కాంగ్రెస్ హయాంలో ధరలు పడిపోయాయన్నారు. కేసీఆర్ తెచ్చిన రైతుబంధు పథకాన్ని ఐక్యరాజ్య సమితి అభినందించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాల పునాదులు మీద పుట్టి అన్ని దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని అధికారం నడిపిస్తోందని మండిపడ్డారు రాజకీయ వ్యవస్థలో ప్రభుత్వాలు ఎప్పుడు కూడా శాశ్వతం కాదన్నారు. ప్రజలు శాశ్వతం అనే విషయం గుర్తించాలన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ కుసరైన గుణపాఠం చెబుతారని జ్యష్యం చెప్పారు. కాంగ్రెస్ ఎక్కడ ఒక్క ప్రాజెక్ట్ నిర్మించిన దాఖలాలు లేవన్నారు. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణమంటూ మగవారికి పురుషులకు డబుల్ రెట్లు పెంచారని మండిపడ్డారు. ఈ సమావేశంలో సిద్దిపేట బీ ఆర్ ఎస్ నాయకులు రాజనర్సు, కొండం సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
15.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ శైవ ఆలయాలు**

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం (రాజన్న సిరిసిల్ల) తెలంగాణలో ప్రముఖ శైవ క్షేత్రం. "దక్షిణ కాశీ"గా ప్రసిద్ధి.



# మురుగు నీరు మళ్లింపు చేయాలి

- **పాపాయి కుంట పరిరక్షణకు కాలనీవాసుల నిరసన**

**ముద్ర, కుత్బుల్లాపూర్ :**

పాపాయి కుంటలో మురుగు నీరు కలవకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ కాలనీ వాసులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాజధాని స్కూల్ వద్ద నుంచి మురుగు నీటిని మళ్లించి ఎస్ఎన్‌డీపీ నాలాలో కలపాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఆకుల సతీష్, అల్లాడి మహేష్ ఆధ్వర్యంలో కాలనీవాసులు చేపట్టారు. తురక చెరువు నుంచి పాపాయి కుంటలోకి మురుగు నీరు వదలరాదని కోరారు. తురక చెరువు నుంచి రాజధాని స్కూల్ మీదుగా బండారు లేఔట్‌కు వెళ్లే ఎస్ఎన్‌డీపీ నాలాలోకి మురుగు నీటిని డైవర్షన్ చేయాలని కోరారు. పాపాయి కుంట నుంచి సిరి బాలాజీ వరకు రూ.2 కోట్లకు పైగా కేటాయించిన అభివృద్ధి నిధులను, తురక చెరువు నుంచి బండారు లేఔట్ ఎస్ఎన్‌డీపీకి మళ్లించాలని సూచించారు. అలాగే 2021కు ముందు ఉన్నట్లుగా పాపాయి కుంటను స్వచ్ఛమైన మంచినీటి చెరువుగా పునరుద్ధరించాలని, కుంటలో తక్షణమే గుర్రపు డెక్కను తొలగించాలని డిమాండ్ చేశారు.

# వికారాబాద్ జిల్లాలోనే అత్యధిక మెజార్టీ

**ముద్ర, తాండూర్ :**

జిల్లాలోనే ఇప్పటివరకు మున్సిపల్ పోరులో ఎవరు సాధించనంత మెజారిటీ 909 తాండూర్ మున్సిపల్ పరిధిలోని 11వ వార్డుకు చెందిన కాంగ్రెస్ అభ్యర్థి సాధించారు ఈ సందర్భంగా బంటు వేణు మాట్లాడుతూ.. ఎంతో నమ్మకంతో, జిల్లాలోని అత్యధిక మెజార్టీతో నన్ను గెలిపించిన 11వ వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సహకారంతో అన్ని రంగాల్లో కాలనీని అభివృద్ధి చేస్తానని ఆయన తెలిపారు.

# బీజేపీకి వేల కోట్ల విరాళాలు

- **బీజేపీకి వేల కోట్ల విరాళాలు**
- **కాంగ్రెస్‌కు ఎందుకింత తక్కువ?**

**ముద్ర డెస్క్ :**

2024-25 ఆర్థిక సంవత్సరంలో ఎలక్టోరల్ ట్రస్టుల ద్వారా రాజకీయ పార్టీలకు అందిన విరాళాల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) భారీ ఆధిక్యాన్ని సాధించింది. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం మొత్తం పంపిణీ చేసిన నిధుల్లో 82.52 శాతం బీజేపీకే దక్కాయి. మొత్తంగా రూ. 3,826.35 కోట్ల విరాళాల్లో బీజేపీ ఒక్కదానికే రూ. 3,157.65 కోట్లు అందాయి. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీకి రూ. 298.78 కోట్లు (7.81%) మాత్రమే లభించగా, తృణమూల్ కాంగ్రెస్‌కు రూ. 102 కోట్లు (2.67%) అందాయి. మిగిలిన 19 రాజకీయ పార్టీలకు కలిపి రూ. 267.92 కోట్లు పంపిణీ అయ్యాయి. విరాళాలు అందించిన సంస్థల్లో ఎలివేటెడ్ అవెన్యూ రియాల్టీ ఎల్ఎల్‌పీ రూ. 500 కోట్లతో అగ్రస్థానంలో ఉండగా, టాటా సన్స్, టీసీఎస్, మేఘా ఇంజినీరింగ్ తదితర సంస్థలు కూడా భారీగా విరాళాలు అందించాయి. రాష్ట్రాల వారీగా చూస్తే మహారాష్ట్ర నుంచి అత్యధికంగా రూ. 1,225 కోట్లు అందగా, తెలంగాణ నుంచి రూ. 358 కోట్లు రావడం విశేషం. దేశంలో నమోదైన 20 ఎలక్టోరల్ ట్రస్టుల్లో కేవలం 10 మాత్రమే తమ నివేదికలను సమర్పించగా, మిగిలిన వాటి వివరాలు బయటకు వస్తే మొత్తం విరాళాల పరిమాణం మరింత పెరిగే అవకాశం ఉందని ఏడీఆర్ తెలిపింది.



# విధ్వంసం నుంచి పునర్నిర్మాణం వైపు ఆంధ్రప్రదేశ్

- **అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ధీమా**
- **సంక్షేమం, అభివృద్ధి, వ్యవసాయానికి భారీ ప్రాధాన్యం**
- **రూ.53 వేల కోట్లతో వ్యవసాయ బడ్జెట్**
- **యువతను సాగు వైపు ఆకర్షించేలా ప్రయత్నాలు**

**ముద్ర, అమరావతి :**



ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక పరిణామాలకు వేదికగా నిలిచిన అసెంబ్లీలో సీఎం నారా చంద్రబాబు నాయుడు చేసిన ప్రసంగం రాష్ట్ర భవిష్యత్తుపై ప్రభుత్వ దిశను స్పష్టంగా తెలియజేసింది. గత వైసీపీ పాలనలో జరిగిన నష్టాలను గుర్తు చేస్తూనే, కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఆయన వివరించారు. రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి పునర్నిర్మాణ దిశగా తీసుకెళ్తామని ధీమా వ్యక్తం చేశారు.

**అసెంబ్లీ గౌరవం పునరుద్ధరణే లక్ష్యం..**

చట్టసభను ప్రజా దేవాలయంగా అభివర్ణించిన సీఎం, గతంలో దాన్ని బూతుల అడ్డాగా మార్చారని తీవ్ర విమర్శలు చేశారు. వైసీపీ పాలనలో తాను ఎదుర్కొన్న అవమానాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. సభ గౌరవాన్ని తిరిగి తీసుకురావడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యార్థులతో నిర్వహించిన మాక్ అసెంబ్లీ ఉదాహరణగా చూపుతూ, నేటి సభ్యుల కంటే వారు మరింత హుందాగా ప్రవర్తించారని చెప్పారు.

**సంక్షేమంలో దేశానికి ఆదర్శం..**

ప్రజల సంక్షేమంపై తమ ప్రభుత్వం భారీగా ఖర్చు చేస్తున్నట్లు సీఎం తెలిపారు. ముఖ్యంగా పెన్షన్ల కోసం ఏడాదికి రూ. 34వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని, దేశంలోనే ఇది అత్యధికమని చెప్పారు. 'తల్లికి వందనం' పథకం కింద రూ.10,700 కోట్లు అందించామని, ప్రపంచంలోనే అతిపెద్ద డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని వెల్లడించారు. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తూ, లక్షలాది మంది లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. ప్రజా రవాణాను మరింత బలోపేతం చేసేందుకు త్వరలో 1,000 ఏసీ బస్సులను ప్రవేశపెడతామని తెలిపారు. రైతులకు 'అన్నదాత సుఖీభవ' ద్వారా ఆర్థిక సాయం, మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు.

**అమరావతి పునర్నిర్మాణానికి వేగం..**

అమరావతి రాజధాని నిర్మాణంపై సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. 29 వేల మంది రైతులు 33వేల ఎకరాల భూమిని ప్రభుత్వంపై నమ్మకంతో ఇచ్చారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం రాజధాని అభివృద్ధిని నిలిపివేసినా, తమ ప్రభుత్వం మళ్లీ పనులను వేగవంతం చేసిందని తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చుతామని హామీ ఇచ్చారు.

**కూటమి విజయంపై విశ్వాసం**

రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేశాయని సీఎం వివరించారు. ప్రజలు 94శాతం స్ట్రైక్ రేట్‌తో విజయం అందించారని పేర్కొంటూ, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని చెప్పారు. గత ప్రభుత్వ వైఫల్యాలను శ్వేత పత్రాల ద్వారా ఇప్పటికే ప్రజల ముందుంచామని అన్నారు.

**వ్యవసాయానికి రూ.53,752 కోట్ల భారీ బడ్జెట్**

ఇక వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది. వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రవేశపెట్టిన 2026 27 వ్యవసాయ బడ్జెట్‌లో రూ.53,752 కోట్ల కేటాయింపులు చేశారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా ఈ నిధులను వినియోగిస్తామని మంత్రి స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ.1,674 కోట్ల ధాన్యం బకాయిలను చెల్లించి రైతులకు ఉపశమనం కల్పించారు. పెట్టుబడి రాయితీకి రూ.310 కోట్లు, యాంత్రీకరణకు రూ.136 కోట్లు కేటాయించారు. భూసార పరీక్షలు, విస్తరణ సేవలు వంటి కార్యక్రమాల ద్వారా లక్షలాది రైతులకు ప్రయోజనం కల్పించారు. సాగునీటి రంగంలో పోలవరం, వంశధార, హంద్రీనీవా, వెలిగొండ వంటి ప్రాజెక్టులను వేగవంతం చేస్తామని ప్రభుత్వం తెలిపింది. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేసింది. 2030 నాటికి ఉద్యానవన విస్తీర్ణాన్ని 14.41 లక్షల హెక్టార్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

**అన్నదాత సుఖీభవ – రైతులకు భరోసా..**

'అన్నదాత సుఖీభవ' పథకం ఈ బడ్జెట్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. రైతులకు పెట్టుబడి సాయం అందిస్తూ సాగు వ్యయం తగ్గించి ఆదాయం పెంచడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. పంట బీమా పథకాన్ని బలోపేతం చేసి ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు అండగా నిలుస్తామని మంత్రి తెలిపారు. పాడి పరిశ్రమ, మత్స్యరంగం, ఉద్యానవనం వంటి అనుబంధ రంగాలకు కూడా ప్రాధాన్యం ఇచ్చారు. డ్రోన్ల వినియోగం, యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. కౌలు రైతులకు కూడా పథకాల లబ్ధి అందేలా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

**రూ.3.32 లక్షల కోట్ల బడ్జెట్- అభివృద్ధి, సంక్షేమం సమతుల్యం**

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన 202627 బడ్జెట్ మొత్తం రూ.3,32,205 కోట్లతో రూపొందించబడింది. స్వర్ణాంధ్ర 2047 విజన్‌కు అనుగుణంగా సంక్షేమం, మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, ఉపాధికి ప్రాధాన్యం ఇచ్చారు.

**ముఖ్య ఆర్థిక అంశాలు :**

మొత్తం వ్యయం : రూ.3,32,205 కోట్లు
రెవెన్యూ వ్యయం : రూ.2,56,142 కోట్లు
మూలధన వ్యయం : రూ.53,915 కోట్లు
రెవెన్యూ లోటు : రూ.22,002 కోట్లు
ద్రవ్య లోటు : రూ.75,868 కోట్లు

కీలక కేటాయింపులు :

NTR భరోసా పెన్షన్ : రూ.27,719 కోట్లు
తల్లికి వందనం : రూ.9,668 కోట్లు
మహిళా శిశు సంక్షేమం : రూ.4,581 కోట్లు
విద్యా రంగం : రూ.32,308 కోట్లు
బీసీ సంక్షేమం : రూ.23,650 కోట్లు
పంచాయతీ రాజ్ : రూ.22,941 కోట్లు
వైద్యారోగ్యం : రూ.19,306 కోట్లు
నీటివనరులు : రూ.18,223 కోట్లు
విద్యుత్ రంగం : రూ.13,934 కోట్లు

దీపం2 పథకం కింద మహిళలకు సంవత్సరానికి మూడు ఉచిత LPG సిలిండర్లు అందించనున్నారు. స్టార్టప్‌ల కోసం ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ గ్రోత్ ఫండ్ కింద రూ.100 కోట్లు కేటాయించారు.

**సమగ్ర అభివృద్ధి దిశగా అడుగులు..**

మొత్తంగా చూస్తే, ఈ బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, వ్యవసాయం, మౌలిక సదుపాయాల మధ్య సమతుల్యాన్ని సాధించేలా రూపొందించబడింది. రైతు సంక్షేమం నుంచి మహిళా సాధికారత వరకు అన్ని వర్గాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చింది. విధ్వంసం నుంచి పునర్నిర్మాణం దిశగా ఆంధ్రప్రదేశ్‌ను తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తామని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది.

# దేశ రక్షణ కోసం ఆత్మ త్యాగానికైనా సిద్ధంగా ఉండాలి

- **పుల్వామా అమరులకు కొవ్వొత్తులతో నివాళి**

**ముద్ర, నారాయణ పేట :**



పుల్వామా ఉగ్ర దాడిలో అమరులైన ఆర్మీ జవాన్లకు ఘన నివాళి అర్పిస్తూ శనివారం నారాయణపేట జిల్లా కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీని గొడుగు గేరీ హనుమాన్ మందిరం నుంచి సత్యనారాయణ చౌరస్తా వరకు పెద్ద ఎత్తున నిర్వహించారు. భారత దేశ ద్రోహుల్లరా ఖబర్దార్.. ఖబర్దార్.. భారత్ మాత కి జై.. జోహార్ ఆర్మీ జవాన్లకు అంటూ నినాదాలు చేశారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రేమికుల రోజు అనేది ఉన్మాద భావన అన్నారు. భారత దేశం జోలికి వేస్తే ఏ గతి పడుతుందో పాకిస్తాన్కు ఇండియన్ ఆర్మీ సత్తా ఇటీవల జరిగిన యుద్ధ సమయంలో అర్థం అయి ఉంటుందన్నారు. భారతదేశంలో ఉంటూ పరాయి దేశానికి వత్తాసు పలికే వారిని వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు. దేశ భద్రత కోసం అందరూ ఐక్యమత్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ దేశాలకు విశ్వ గురువు భారత దేశమన్నారు. ప్రతి ఒక్కరూ దేశం కోసం పని చేయాలన్నారు. దేశ రక్షణ కోసం ఆత్మ త్యాగానికి కూడా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం అమరుల ఆత్మ శాంతించాలని మౌనం పాటించారు. విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షులు భీమ్ చందర్ గౌడ్, జిల్లా కార్యదర్శి కన్న శివకుమార్, మ్యాడమ్ ప్రభాకర్, రామచందర్, చంద్రకాంత్, కడుదాస్ ప్రవీణ్, శ్రవణ్, సచిన్, నరేష్, చరణ్ రెడ్డి, అనంత్ రెడ్డి, చంద్ర శేఖర్, చంద్ర కాంత్ యాదవ్, ఆశిష్, అశ్విన్, ఆకాష్, చక్రి, అరవింద్, శివాజీ రవి, రాజ శేఖర్, అనిల్ రెడ్డి, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

# నిజాంపేట్ ఎక్స్ రోడ్డుపై ఘోర ప్రమాదం

- **భర్త కళ్లముందే భార్య దుర్మరణం**

**ముద్ర, హైదరాబాద్(కూకట్‌పల్లి) :**

నిజాంపేట్ ఎక్స్ రోడ్డువద్ద జరిగిన రహదారి ప్రమాదంలో ప్రైవేట్ ఉపాధ్యాయురాలు గండ్ర నాగ సంధ్య (47) అక్కడికక్కడే మృతి చెందారు. భర్తతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా బైక్ అదుపు తప్పి కిందపడటంతో ఈ విషాదం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి పైప్‌లైన్ రోడ్డులోని విజయనగర్ కాలనీకి చెందిన గండ్ర దేవేందర్ రావు(50), ఆయన భార్య నాగ సంధ్య ఇద్దరూ ద్విచక్ర వాహనం (టి.జి08బి6088)పై హైదర్‌నగర్ నుంచి కూకట్‌పల్లి వైపు ప్రయాణిస్తున్నారు. నిజాంపేట్ ఎక్స్ రోడ్డువద్దకు చేరుకోగానే కుడివైపు నుంచి ఆర్టీసీ బస్సు వెళ్తుండగా వారి వాహనం స్కిడ్ అయి కిందపడింది. వెనుక సీట్లో కూర్చున్న నాగ సంధ్య రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయమై రక్తస్రావం జరిగింది. అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆమెను స్థానికుల సహాయంతో నిజాంపేట్‌లోని ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ ఘటనలో దేవేందర్ రావుకు కాలి మోకాలి వద్ద, శరీరంలోని ఇతర భాగాల్లో గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.




# లోకేష్ 'పెద్ద' మనసు

**ముద్ర డెస్క్ :**



ఎదిగే కొద్దీ ఒదిగి ఉండాలంటారు. పెద్దలపట్ల గౌరవభావంతో ఉండాలంటారు. ఈ విషయంలో మాత్రం జగన్మోహన్ రెడ్డి, కేటీఆర్ ల కంటే లోకేష్ భిన్నం. తన తండ్రి సమకాలీకులతో జగన్మోహన్ రెడ్డి ఎలా ఉంటారో తెలియనిది కాదు. వారికి తన పక్కన కుర్చీ వేసి కూర్చోబెట్టే సంస్కారం కూడా జగన్మోహన్ రెడ్డికి తెలియదు అన్న విమర్శ పొలిటికల్ వర్గాల్లో ఉంది. కేటీఆర్ సైతం తన తండ్రి కెసిఆర్ మాదిరిగా అహంకారపూరిత వ్యాఖ్యలు చేస్తారని కామెంట్స్ ఉన్నాయి.అయితే వినయ విధేయతలు సహజ సిద్ధంగా తమంతట తమకు రావాలి తప్ప ఎవరూ చెప్పరు. అయితే ప్రస్తుతం ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్నారు లోకేష్. తెలుగుదేశం పార్టీ భవిష్యత్ నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. ఇటువంటి సమయంలో ఆయన పార్టీలో సీనియర్లకు ఇస్తున్న గౌరవం అందర్నీ ఆకట్టుకుంటుంది.

**చాలా హుందాగా..**

ఇటీవల ఓ బహిరంగ సభలో మంత్రి రామానాయుడుని ఉద్దేశించి లోకేష్ చేసిన వ్యాఖ్యలు సరదాగా అనిపించాయి. అన్నా నీతో నేను పోటీ పడలేను. నీతో పోటీ పడాలంటే ఇంకా ఎక్కువ కష్టపడాలి. అది నా వల్ల కాదు. కనుక ఆ నంబర్ ఏదో మీరే తీసుకోండి అంటూ సరదాగా వ్యాఖ్యానించారు లోకేష్. స్పీకర్ అయ్యన్నపాత్రుడు రాజకీయ అనుభవం అంత వయసు లేదు లోకేష్ కు. అట్లాంటి సీనియర్ పట్ల లోకేష్ నిన్న శాసనసభ కారిడార్ లో ప్రదర్శించిన వినయం అందర్నీ ఆకట్టుకుంది. స్పీకర్ అయ్యన్న కారు వద్దకు వెళ్తుంటే నారా లోకేష్ స్వయంగా కార్ డోర్ తీసి ఆయన కూర్చున్నాక మూసి సాగనంపారు.

**సీనియర్లతో విందు..**

మరోవైపు తెలుగుదేశం పార్టీ సీనియర్లతో విందు చేస్తూ.. వారి అనుభవాలను తెలుసుకుంటూ.. విలువైన సలహాలు స్వీకరిస్తూ.. వారి ఆశీర్వాదాలు తీసుకుంటున్నారు. శాసనసభ సమావేశాలు జరిగినన్ని రోజులు పార్టీ ఎమ్మెల్యేలతో పాటు ఎమ్మెల్సీ కుటుంబ సభ్యులను పిలిచి సహపంతి భోజనాలు చేస్తున్నారు. వంగలపూడి అనిత వంటి మహిళలకు అయితే మంత్రి నారా లోకేష్‌తోబుట్టువు మాదిరిగా వస్త్రాలు పెట్టారు. బుచ్చయ్య చౌదరి లాంటి సీనియర్ నేతను తాతగారు అంటూ సంబోధిస్తూ చూపించే గౌరవభావం ఎవరినైనా ఆకట్టుకుంటుంది. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే నేతల వారసులు వచ్చారు. వారి వ్యవహార శైలి, వారి మాట తీరు జనాలకు తెలిసిందే. సొంత పార్టీ నేతలు సైతం వారి చర్యలతో ఇబ్బంది పడిన సందర్భాలు ఉన్నాయి. కానీ లోకేష్ మాత్రం హుందా రాజకీయాలతో.. పెద్దలపట్ల వినయ విధేయతలతో ముందుకు సాగుతున్న తీరు మాత్రం ఆకట్టుకుంటోంది.

**ఎవరూ ఊహించినది..**

అయితే లోకేష్ ఈ తరహా పరిణితి ఎవరు ఊహించలేదు. అంతెందుకు శాసనమండలిలో సీనియర్ నేత బొత్సతో నిత్యం సంవాదం చేసే మంత్రి లోకేష్.. ఎక్కడైనా బయట కనిపిస్తే ఆప్యాయంగా పలకరిస్తారు. సీనియారిటీతో పాటు ఆయన నిర్వర్తించిన పదవులకు గౌరవం ఇచ్చి మాట్లాడతారు. పార్టీలో సీనియర్ల పట్ల జగన్ తో పాటు కేటీఆర్ వ్యవహరించే తీరు ఎన్నో విమర్శలకు కారణం అయ్యింది. కానీ నారా లోకేష్ తన ఇంటి తలుపులు తెరిచి ఈ విధంగా పార్టీలో అందరినీ ఆహ్వానిస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
15.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ శైవ ఆలయాలు**

కేసరగుట్ట రామలింగేశ్వర స్వామి ఆలయం (హైదరాబాద్ సమీపం) ప్రాచీన చాళుక్య కాలానికి చెందిన ఆలయం. కొండపై ఉండటం వల్ల ఆహ్లాదకరమైన దర్శనం.



# ధోనీ నిర్ణయం... కోహ్లీకి మార్గదర్శనం




- **కెప్టెన్సీ మార్పు వెనుక ఆసక్తికర సంఘటన**

**ముద్ర. స్పోర్ట్స్ డెస్క్**

ఇటీవల రోహిత్ శర్మ నుంచి శుభ్‌మన్ గిల్‌కు కెప్టెన్సీ మార్పు జరిగిందన్న చర్చల మధ్య, గతంలో జరిగిన ఒక కీలక పరిణామం మళ్లీ వెలుగులోకి వచ్చింది. 2017లో ఎం.ఎస్. ధోనీ నుంచి విరాట్ కోహ్లీకి భారత జట్టు సారథ్య బాధ్యతలు బదిలీ అయిన సందర్భాన్ని బీసీసీఐ మాజీ సెలక్షన్ కమిటీ సభ్యుడు జతిన్ పరాంజ్‌పే తాజాగా గుర్తు చేశారు.

2014లోనే టెస్ట్ కెప్టెన్సీ నుంచి వైదొలిగిన ధోనీ, 2017లో అన్ని ఫార్మాట్ల కెప్టెన్సీని వదిలే ముందు సెలక్షన్ కమిటీతో చర్చించినట్లు ఆయన తెలిపారు. ఆ సమయంలో చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్‌తో కలిసి ధోనీతో మాట్లాడిన జతిన్ పరాంజ్‌పే, "మార్పుకు ఇదే సరైన సమయం" అని గౌరవంగా వివరించామని చెప్పారు. ఆ నిర్ణయాన్ని ధోనీ ఎంతో ప్రశాంతంగా స్వీకరించాడని ఆయన పేర్కొన్నారు. "ఇది సరైన నిర్ణయం. నా నుంచి మీకు ఏమి కావాలో చెప్పండి" అని ధోనీ స్పందించినట్లు చెప్పారు. రాతపూర్వకంగా కెప్టెన్సీ నుంచి తప్పుకుంటున్నట్లు తెలియజేయాలని చెప్పగా, అదే రోజు రాత్రి ధోనీ ఇమెయిల్ పంపి తన నిర్ణయాన్ని అధికారికంగా తెలియజేశాడని పరాంజ్‌పే వెల్లడించారు. ఆ సమయంలో విమర్శలు వచ్చినప్పటికీ, జట్టు భవిష్యత్తు దృష్ట్యా తీసుకున్న నిర్ణయమని ఆయన అన్నారు.

కెప్టెన్సీ మారిన తర్వాత కూడా ధోనీ, విరాట్ కోహ్లీకి పూర్తి మద్దతుగా నిలిచాడని పరాంజ్‌పే చెప్పారు. "విరాట్ నా తమ్ముడు లాంటి వాడు. నా అనుభవాన్ని అంతా పంచుకుంటా. మంచి జట్టును నిర్మిద్దాం" అని ధోనీ చెప్పిన మాటలు తనకు ఇప్పటికీ గుర్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

# కిందపడ్డ కంగారూ.. గర్వం నేర్పిన పాఠం అదేనా?

- **అహంకారం.. ఆసీస్ పతనం?**
- **గెలుపు నుంచి గబ్బు దాకా!**
- **వరుస ఓటములు.. ఆసీస్ షాక్**
- **మైండ్‌సెట్ మార్పు లేకే పరాజయాలు**
- **వినయం మరిచిన ఆసీస్?**

**ముద్ర. స్పోర్ట్స్ డెస్క్**




ఒకప్పుడు ఆస్ట్రేలియా అంటే మైదానంలో ఎదురులేని సైన్యం. ప్రత్యర్థి ఎవరైనా సరే, గెలుపు తమదే అన్నంత ధీమా. కానీ, 2023 ప్రపంచ కప్ విజయం తర్వాత ఆ జట్టులో పెరిగిన అతి విశ్వాసం, ప్రత్యర్థుల పట్ల చూపిన అగౌరవం ఇప్పుడు వారినే కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయా? వరల్డ్ కప్ ట్రోఫీపై కాలు పెట్టి కూర్చున్న నాటి 'అహంకారం' నుంచి, నేడు పసికూనల చేతిలో చిత్తవుతున్న 'నిస్సహాయత' వరకు.. ఆస్ట్రేలియా క్రికెట్ పతనం వెనుక దాగున్న చేదు నిజాలపై ఒక ప్రత్యేక విశ్లేషణ. ఒకప్పుడు ప్రపంచ క్రికెట్‌ను శాసించిన సామ్రాజ్యం అది. ప్రత్యర్థి ఎవరైనా సరే.. మైదానంలోకి దిగితే గెలుపు ఆస్ట్రేలియాదే అనేంత ధీమా. కానీ కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. 2023 వన్డే వరల్డ్‌కప్ గెలిచిన తర్వాత ఆ జట్టు ప్రదర్శించిన అతివిశ్వాసం, ఇప్పుడు వారిని పరాజయాల ఊబిలోకి నెట్టేసినట్లు కనిపిస్తోంది. గెలుపు తెచ్చిన గర్వం.. ఓటమి రూపంలో పాఠాలు నేర్పుతోంది.

**అహంకారం కూలదోసిన కథ**

వరల్డ్‌కప్ గెలిచిన మత్తులో ఆస్ట్రేలియా ఆటగాడు మిచెల్ మార్ష్ ట్రోఫీపై కాలు పెట్టి కూర్చున్న ఫోటో అప్పట్లో క్రీడా ప్రపంచాన్ని విస్మయానికి గురిచేసింది. అది కేవలం ఒక ఫోటో కాదు.. ఆ జట్టులో పెరిగిన 'అతిశయోక్తి'కి అద్దం పట్టింది. ప్రత్యర్థులను గౌరవించని ఏ క్రీడైనా, ఆటగాడైనా పతనం వైపు పయనించక తప్పదని విశ్లేషకులు హెచ్చరించారు. ఇప్పుడు అదే జరుగుతోంది.

**వరుస ఓటముల పరంపర.. గణాంకాలు చెబుతున్న సత్యం**

వరల్డ్‌కప్ తర్వాత ఆస్ట్రేలియా ప్రయాణం 'అజేయ శక్తి' నుంచి 'అస్థిరమైన జట్టు'గా మారిపోయింది. టీ20 వరల్డ్‌కప్ 2024లో పసికూన అఫ్గానిస్తాన్ చేతిలో షాకింగ్ ఓటమి.. కనీసం సెమీస్‌కు కూడా చేరలేకపోయింది. ద్వైపాక్షిక సిరీస్‌లలో పాకిస్తాన్, ఇండియా, సౌతాఫ్రికా వంటి జట్ల చేతిలో వైట్ బాల్ క్రికెట్‌లో వరుస పరాజయాలు ఎదురయ్యాయి.. గబ్బాలో వెస్టిండీస్ చేతిలో ఓటమి, తాజాగా జింబాబ్వే వంటి జట్లతో కూడా తడబడటం ఆస్ట్రేలియా క్రికెట్ ప్రమాణాల పతనాన్ని సూచిస్తున్నాయి.

**ఫామ్ లోపమా? లేక మైండ్‌సెట్ సమస్యా?**

ఆస్ట్రేలియా క్రికెటర్లలో మునుపటి కఠిన పోరాట పటిమ మృగ్యమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు ప్రత్యర్థికి కంటి మీద కునుకు లేకుండా చేసే ఆసీస్.. ఇప్పుడు అతి విశ్వాసం.. ప్రత్యర్థులను తక్కువ అంచనా వేసే ధోరణి వల్ల దెబ్బతింటోంది. ఆధునిక క్రికెట్‌లో అఫ్గానిస్తాన్, జింబాబ్వే వంటి జట్లు తమ స్థాయిని పెంచుకుంటున్న తరుణంలో ఆ మార్పును గుర్తించకుండా పాత గర్వంతోనే ఆడటం ఆసీస్‌ను దెబ్బతీసింది.

**గెలుపు వినయాన్ని నేర్పాలి**

క్రీడల్లో గెలుపుఓటములు సహజం. కానీ గెలిచినప్పుడు ఉండాల్సిన వినయం.. ప్రత్యర్థి పట్ల ఉండాల్సిన గౌరవం ఆస్ట్రేలియా జట్టులో తగ్గిందనేది జగమెరిగిన సత్యం. "గెలుపు మీది కావచ్చు.. కానీ క్రీడ పట్ల గౌరవం అందరి బాధ్యత" అనే సూత్రాన్ని వారు విస్మరించారు. నేడు వారు ఎదుర్కొంటున్న వరుస పరాజయాలు.. ఆనాడు వారు ప్రదర్శించిన గర్వానికి ప్రతిఫలమే అని క్రీడాభిమానులు అభిప్రాయపడుతున్నారు.

**పుంజుకుంటారా?**

ఆస్ట్రేలియా క్రికెట్ చరిత్రలో ఇలాంటి గడ్డు కాలాలు గతంలోనూ వచ్చాయి. ప్రతిసారి వారు ఫీనిక్స్ పక్షిలా పైకి లేచారు. అయితే ఈసారి వారు కేవలం టెక్నిక్‌ను మాత్రమే కాదు.. తమ మైండ్‌సెట్‌ను కూడా మార్చుకోవాల్సిన అవసరం ఉంది. గెలిచిన శిఖరం నుంచి పడిపోవడం ఎంత సులువో ఈ పరాజయాలు నిరూపించాయి. మళ్ళీ ఆ శిఖరాన్ని చేరాలంటే.. ప్రతిభకు 'వినయం' తోడవ్వాలి. "గెలుపు తల పొగరుకు దారి తీస్తే.. ఓటమి వినయాన్ని నేర్పుతుంది." ఆస్ట్రేలియా జట్టు ఇప్పుడు ఆ కఠినమైన పాఠాన్ని నేర్చుకుంటోంది. ఇప్పటికైనా వారు మేల్కొని, క్రీడాస్ఫూర్తితో ఆడితేనే పూర్వవైభవం సాధ్యం.

# భారత్‌కు కొత్త సవాల్..




- **పాక్ స్పిన్నర్ ఉస్మాన్ తారిక్ ప్రత్యేకత ఏమిటి?**

**ముద్ర. స్పోర్ట్స్ డెస్క్**

భారత్‌తో మ్యాచ్‌కు ముందు పాకిస్థాన్ జట్టులోని స్పిన్నర్ ఉస్మాన్ తారిక్ పేరు చర్చనీయాంశమైంది. ఇప్పటివరకు కేవలం నాలుగు అంతర్జాతీయ టీ20లు మాత్రమే ఆడిన ఈ 28 ఏళ్ల బౌలర్ తన విభిన్న శైలితో దృష్టి ఆకర్షిస్తున్నాడు. క్రీజ్‌లోకి వచ్చి బంతి వేయడానికి ముందు క్షణం ఆగడం అతడి ప్రత్యేకత. ఈ అలవాటు బ్యాటర్లను అయోమయానికి గురిచేస్తుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఐసీసీ నుంచి అనుమతి ఉన్నప్పటికీ, అతడి యాక్షన్‌పై చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి.

దుబాయ్‌లో ఉద్యోగం చేస్తూ ఉండగా M.S. Dhoni: The Untold Story చూసిన తర్వాత క్రికెట్‌పై మళ్లీ దృష్టి పెట్టినట్టు తారిక్ వెల్లడించాడు. కరేబియన్ లీగ్‌లో రాణించడంతో జాతీయ జట్టులో చోటు సంపాదించాడు. నాలుగు టీ20ల్లో 5.93 ఎకానమీతో 11 వికెట్లు తీసి మంచి ప్రభావం చూపాడు. మొత్తం 42 టీ20ల్లో 74 వికెట్లు సాధించాడు. డేవాల్డ్ బ్రెవిస్, రీజా హెండ్రిక్స్, కామెరూన్ గ్రీన్ వంటి హిట్టర్లను ఔట్ చేయడం అతడి సామర్థ్యాన్ని చూపిస్తోంది.

అతడి బౌలింగ్‌పై మాజీలు కూడా స్పందించారు. బ్యాటర్లు తమ బలంపై నమ్మకం ఉంచాలని సునీల్ గవాస్కర్ సూచించగా, యాక్షన్‌లో లోపం ఏమీ లేదని ఆరోన్ ఫించ్ అభిప్రాయపడ్డాడు. ఫీల్డ్ అంపైర్‌కే తుది నిర్ణయం ఉంటుందని ఉస్మాన్ ఖాజా, పేర్కొన్నాడు. బౌలర్ ఆగినప్పుడు బ్యాటర్ క్రీజ్ నుంచి తప్పుకోవచ్చని రవి చంద్రన్ అశ్విన్ సూచించాడు.

అయితే భారత శిబిరం మాత్రం ఆందోళనలో లేదన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇషాన్ కిషన్ మాటల్లో చెప్పాలంటే—బౌలర్ ఎంత భిన్నంగా ఉన్నా, దూకుడే ప్రత్యుత్తరం. తారిక్ ప్రత్యేక శైలి భారత్‌కు సవాల్ అయినా, దానికి తగిన వ్యూహంతోనే బరిలోకి దిగేందుకు సిద్ధంగా ఉంది టీమ్ఇండియా.




# ఒమన్‌పై ఐర్లాండ్ ఘన విజయం

**ముద్ర. స్పోర్ట్స్ డెస్క్**

టీ20 ప్రపంచకప్2026లో ఐర్లాండ్ జట్టు ఖాతా తెరిచింది. కొలంబో వేదికగా జరిగిన గ్రూప్‌బి పోరులో ఒమన్పై 96 పరుగుల భారీ తేడాతో గెలిచి సెమీస్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 235 పరుగులు చేసింది.

టాప్ ఆర్డర్ ఆశించిన స్థాయిలో రాణించకపోయినా, మిడిల్ ఆర్డర్ అదరగొట్టింది. లోర్కాన్ టక్కర్ 51 బంతుల్లో 94 పరుగులతో నాటౌట్‌గా నిలిచి ఇన్నింగ్స్‌కు పునాది వేశాడు. గారెత్ డెలానీ 30 బంతుల్లో 56 పరుగులు సాధించగా, జార్జ్ డాక్రెల్ కేవలం 9 బంతుల్లో 5 సిక్సర్లతో 35 పరుగులు చేసి స్కోరును వేగంగా పెంచాడు. ఒమన్ బౌలర్లలో షకీల్ అహ్మద్ మూడు, కలీం రెండు వికెట్లు తీశారు.

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఒమన్‌కు ఆరంభం నుంచే ఎదురుదెబ్బలు తగిలాయి. ఆమిర్ కలీం (50), హమ్మద్ మీర్జా (46) పోరాడినా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. 18 ఓవర్లలో 139 పరుగులకే జట్టు కుప్పకూలింది. ఐర్లాండ్ బౌలర్లలో జాషువా లిటిల్ మూడు వికెట్లు పడగొట్టగా, బారీ మెక్‌కార్తీ, మాథ్యూ హంఫ్రీస్ చెరో రెండు వికెట్లు సాధించారు. బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ సమిష్టి ప్రదర్శనతో ఐర్లాండ్ పూర్తి ఆధిపత్యం చాటింది.




# బాంటన్ అజేయ అర్ధశతకం స్కాట్లాండ్‌పై ఇంగ్లాండ్ గెలుపు




**ముద్ర. స్పోర్ట్స్ డెస్క్**

కోల్‌కతాలో జరిగిన మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై ఇంగ్లాండ్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆరంభంలో కొంత ఒత్తిడి ఎదురైనా చివరికి లక్ష్యాన్ని సులభంగా చేరుకుంది.

మొదట బ్యాటింగ్ చేసిన స్కాట్లాండ్ జట్టు 19.4 ఓవర్లలో 152 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లాండ్ బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టడంతో స్కాట్లాండ్ పెద్ద స్కోరు చేయలేకపోయింది.

153 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ 18.2 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసింది. 63 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు. 32, 28 పరుగులు చేశారు. 16 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.

స్కాట్లాండ్ బౌలర్లలో బ్రాండన్, బ్రాడ్, వీల్, లీస్క్, డేవిడ్‌సన్ తలో వికెట్ సాధించారు. అయినప్పటికీ లక్ష్యాన్ని కాపాడుకోలేకపోయారు.

# పాకిస్తాన్ తో ఢీ

- **కొలంబో చేరుకున్న టీమిండియా**
- **ఈ మ్యాచ్ లోనూ అభిషేక్ డౌటే?**
- **వాషింగ్టన్ సుందర్ కు ఛాన్స్ ఉండేనా?**
- **మ్యాచ్ కు వరుణ గండం?**
- **టీమిండియాకు విజయ పరంపరల వెంటే హెచ్చరికలు**

**ముద్ర. స్పోర్ట్స్ డెస్క్**




ప్రపంచకప్‌లో వరుసగా రెండు విజయాలు సాధించడంతో టీమ్‌ఇండియాపై ప్రశంసల వర్షం కురుస్తోంది. టాప్ ఆర్డర్ దూకుడు, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఆకట్టుకునే ఆట, హార్దిక్ పాండ్యా ఆల్‌రౌండ్ ప్రదర్శన, బౌలర్ల చెలరేగిన తీరు——ఇవన్నీ చూసి భారత్‌కు తిరుగులేదనిపిస్తోంది. కానీ లోతుగా పరిశీలిస్తే కొన్ని ఆందోళనకర సంకేతాలు కనిపిస్తున్నాయి.

అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ డకౌట్ కావడం ప్రారంభ హెచ్చరిక. ఇషాన్ కిషన్, తిలక్ వర్మ పరిస్థితిని చక్కదిద్దినా, మధ్యలో వరుస వికెట్లు కోల్పోవడం ఆందోళన కలిగించింది. చివరివరకూ సూర్యకుమార్ క్రీజ్‌లో నిలబడ్డా, మిడిల్ మరియు లోయర్ ఆర్డర్ నుంచి ఆశించిన మద్దతు రాలేదు. పిచ్ కష్టంగా ఉందని చెప్పుకోవచ్చు గానీ, స్థిరత్వం లోపం మాత్రం స్పష్టంగా కనిపించింది.

నమీబియాతో మ్యాచ్‌లో కూడా అదే బలహీనత బయటపడింది. ఇషాన్ కిషన్, సంజు శాంసన్ జోరుతో జట్టు భారీ స్కోరు దిశగా దూసుకెళ్లింది. 41 బంతుల్లో 103 పరుగులు చేసిన జట్టు చివరకు 209/9కే పరిమితమవడం మిడిల్ ఆర్డర్ వైఫల్యానికి ఉదాహరణ. ముఖ్యంగా చివరి ఓవర్లలో వరుస వికెట్లు కోల్పోవడం మ్యాచ్‌ల కీలక దశల్లో ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నామనే సంకేతం.

ఇప్పుడు అసలు పరీక్ష పాకిస్థాన్‌తో మ్యాచ్. ఆ తర్వాత నెదర్లాండ్స్‌తో పోరు. ఈ మ్యాచ్‌లలో టాప్ ఆర్డర్ మాత్రమే కాదు, చివరి బ్యాటర్ వరకూ బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది. పాక్ బౌలింగ్‌లో కొత్తగా వెలుగులోకి వచ్చిన తారిఖ్ వంటి బౌలర్లు మిడిల్ ఓవర్లలో ఒత్తిడి తీసుకురాగలరు. ప్రతి బంతిని భారీ షాట్‌గా మలచే దూకుడు ప్రతిసారి పని చేయదు. పరిస్థితులకు అనుగుణంగా ఆడే సామర్థ్యం అవసరం.

జట్టు దృష్టి పెట్టాల్సిన అంశాలు స్పష్టంగా ఉన్నాయి. టాప్ ఆర్డర్‌లో కనీసం ఒకరు చివరి వరకు నిలబడాలి. మిడిల్, లోయర్ ఆర్డర్‌లో దూబె, అక్షర్ పటేల్, రింకు సింగ్ వంటి ఆటగాళ్లు తమ పాత్రను సమర్థంగా నిర్వర్తించాలి. తిలక్ వర్మ స్ట్రైక్ రేట్ పెంచుకోవాలి. వరుసగా రెండు మూడు వికెట్లు కోల్పోయే అలవాటు నుంచి బయటపడాలి. స్పిన్ అనుకూల పిచ్‌లపై మెరుగైన ప్రణాళిక అవసరం.

గ్రూప్ దశలో భారత్, పాకిస్థాన్ సూపర్ 8కి చేరే అవకాశాలు ఎక్కువ. కానీ అక్కడి నుంచి పోటీ మరింత కఠినమవుతుంది. ఆల్‌రౌండర్లతో బలంగా కనిపిస్తున్నా, స్థిరత్వం లేకపోతే ప్రమాదం తప్పదు. ఇప్పటివరకు వచ్చిన విజయాలు మంచి సంకేతమే కానీ, అసలు కథ మాత్రం ముందుంది

సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

15.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## పసుపు చీరలో మెరిసిన ఆర్తి చికారా

పచ్చని ప్రకృతి నడుమ సూర్యకిరణాల తాకిడిలో దిగిన తాజా ఫొటోలో ఆర్తి చికారా తన సహజ అందాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు. పసుపు రంగు లేత చీరలో ఆమె కనిపించిన తీరు చిత్రానికి ప్రత్యేక కాంతిని తీసుకొచ్చింది. ఆ చీర నెమ్మదిగా జారే మడతలు ఆమె రూపానికి సౌమ్యతను జోడించాయి. చిన్నగా మెరిసే చెవిపోగులు, చేతుల్లో గాజులు ఆమె లుక్‌ను మరింత నాజూకుగా తీర్చిదిద్దాయి. అధిక అలంకరణలకంటే సరళతకే ప్రాధాన్యం ఇచ్చిన స్టైల్ ఆమె వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించింది. మినిమల్ మేకప్‌తో పాటు సహజంగా వదిలిన పొడవాటి జుట్టు ఆమె అందాన్ని మరింత హైలైట్ చేశాయి. చెక్క బెంచ్‌పై ప్రశాంతంగా కూర్చున్న ఆర్తి చిరునవ్వు ఈ ఫొటోకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. చుట్టూ ఉన్న పచ్చని వాతావరణం, సూర్యకాంతి తాకిడి—ఈ రెండూ కలసి ఫ్రేమ్‌కు ఓ సానుకూలమైన, ఆహ్లాదకరమైన మూడ్‌ను తీసుకొచ్చాయి. పసుపు రంగు దుస్తులు ఉత్సాహం, నమ్మకం, ఉల్లాసం వంటి భావాలను ప్రతిబింబిస్తూ మొత్తం చిత్రాన్ని జీవంతో నింపాయి.





## పాలక్ తివారి... వాలెంటైన్స్ డే పోస్ట్ వైరల్

వాలెంటైన్స్ డే సందర్భంగా యంగ్ బ్యూటీ పాలక్ తివారి సోషల్ మీడియాలో షేర్ చేసిన తాజా ఫొటో అభిమానులను ఆకట్టుకుంది. ఫిబ్రవరి 14న ఆమె తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో "Happy 14th of feb" అనే సింపుల్ క్యాప్షన్‌తో ఈ చిత్రాన్ని పోస్ట్ చేసింది. పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే ఈ ఫొటోకు వేలాది లైకులు, కామెంట్లు వెల్లువెత్తాయి. ఈ చిత్రంలో పాలక్ సాఫ్ట్ పింక్ రంగు ఎంబ్రాయిడరీ చీరలో కనిపించింది. చీరపై ఉన్న సున్నితమైన నూలు పనితనం ఆమె లుక్‌కు మరింత ఆకర్షణ జోడించింది. మెడలో ధరించిన పచ్చరంగు చోకర్ నెక్లెస్, దానికి సరిపోయే చెవిపోగులు ఆమెకు రాజసంగా మెరుపునిచ్చాయి. మినిమల్ మేకప్, నేచురల్ హెయిర్ స్టైలింగ్‌తో ఆమె క్లాసీ, ఎలిగెంట్ లుక్‌లో మెరిసింది. ప్రతి ఫొటోషూట్‌లో కొత్తదనాన్ని చూపించాలనే ప్రయత్నం ఆమె స్టైల్‌లో స్పష్టంగా కనిపిస్తుంది. ఎథ్నిక్ వేర్‌లోనూ, వెస్ట్రన్ డ్రెస్సుల్లోనూ సమానంగా మెరుస్తూ ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తోంది.



## రూట్ మార్చిన శైలేష్.. మాస్ నుంచి లవ్ స్టోరీకి షిఫ్ట్

'హిట్' ఫ్రాంఛైజీతో క్రైమ్ థ్రిల్లర్ జానర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు Sailesh Kolanu వరుస విజయాలతో స్టార్ డైరెక్టర్‌గా ఎదిగాడు. హిట్ ఐ ది ఫస్ట్ కేస్ తో ప్రారంభమైన ఈ సిరీస్ హిట్ 2: ది సెకండ్ కేస్, హిట్ 3 వరకు వసూళ్ల పరంగా మెరుగైన స్థాయికి చేరింది. అయితే మధ్యలో చేసిన విక్టరీ వెంకటేష్ తో చేసిన సైంధవ్ ఆశించిన ఫలితం ఇవ్వకపోవడంతో శైలేష్‌పై కొంత విమర్శలు వచ్చాయి.ఇప్పుడు ఆ ఇమేజ్‌కు పూర్తి భిన్నంగా శైలేష్ కొత్త ప్రయోగానికి సిద్ధమయ్యాడు. తొలిసారిగా ఫుల్ లెంగ్త్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌ను తెరకెక్కిస్తున్నాడు. యంగ్ హీరో రోషన్ మేక కథానాయకుడిగా నటిస్తుండగా, కన్నప్ప ఫేమ్ ప్రీతి ముకుందన్ హీరోయిన్‌గా కనిపించనుంది. 'ఏమో ఏమో ఇది' అనే కవితాత్మకమైన టైటిల్‌తో చిత్రాన్ని ప్రకటించారు. విడుదల చేసిన ఫస్ట్ గ్లింప్స్‌లో ప్రేమ, భావోద్వేగాలు, ఆహ్లాదకరమైన విజువల్స్ ప్రధానంగా కనిపించాయి. క్రైమ్ థ్రిల్లర్‌లతో గుర్తింపు తెచ్చుకున్న శైలేష్, ఈసారి ప్రేమకథను ఎంత సున్నితంగా చెబుతాడో చూడాలనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది.

## సీతా పయనం .. భావోద్వేగాల ప్రయాణం

ఫిబ్రవరి 14, 2026న విడుదలైన 'సీతా పయనం' చిత్రానికి అర్జున్ సర్జా దర్శకత్వం వహించడంతో పాటు నిర్మాణ బాధ్యతలు కూడా చేపట్టారు. తన కూతురు ఐశ్వర్య అర్జున్‌ను తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేస్తూ రూపొందించిన ఈ సినిమా తండ్రీ-కూతుళ్ల అనుబంధాన్ని ప్రధానంగా తీసుకుంది. నటీనటులుగా నిరంజన్ సుధీంద్ర, సత్యరాజ్, ప్రకాశ్ రాజ్, కోవై సరళ ముఖ్య పాత్రల్లో కనిపిస్తారు. అతిథి పాత్రల్లో అర్జున్ సర్జా, ధ్రువ సర్జా మెరుస్తారు.కథ విషయానికి వస్తే, సీత (ఐశ్వర్య అర్జున్) తన తండ్రి రాజేంద్ర ప్రసాద్ (సత్యరాజ్)తో గాఢమైన అనుబంధం కలిగిన యువతి. చిన్నప్పుడే తల్లిని కోల్పోయిన ఆమె తండ్రినే తన ప్రపంచంగా భావిస్తూ జీవిస్తుంది. పెళ్లి చేసుకుంటే తండ్రి ఒంటరిగా మిగిలిపోతాడనే ఆలోచనతో జీవితంపై సందిగ్ధంలో ఉంటుంది. ఒక సందర్భంలో ఆమె ఒంటరిగా హైదరాబాద్‌కు ప్రయాణం చేయాల్సి వస్తుంది. ఆ ప్రయాణంలో అభి (నిరంజన్ సుధీంద్ర) అనే యువకుడితో పరిచయం ఏర్పడుతుంది. ఆ పరిచయం ఎలా మారింది? ఆ ప్రయాణం సీత జీవితాన్ని ఎలా ప్రభావితం చేసింది? అన్నదే కథ సారం.దర్శకుడు రోడ్ ట్రిప్ నేపథ్యంతో భావోద్వేగ కథను చెప్పే ప్రయత్నం చేశారు. ప్రారంభ భాగంలో తండ్రీ-కూతుళ్ల అనుబంధం హృద్యంగా అనిపించినా, కథ ముందుకు సాగే కొద్దీ ఊహించదగిన మలుపులు ఎక్కువగా కనిపిస్తాయి. ద్వితీయార్థంలో కుటుంబ నేపథ్యంలో సాగే సన్నివేశాలు భావోద్వేగంగా ఉండాలని ప్రయత్నించినా, గాఢత పూర్తిగా అందలేదు. క్లైమాక్స్ కూడా సాధారణంగా ముగుస్తుంది.నటన పరంగా ఐశ్వర్య అర్జున్ ఆత్మవిశ్వాసంతో కనిపించింది. భావోద్వేగ సన్నివేశాల్లో ఆమె అభినయం ఆకట్టుకుంటుంది. నిరంజన్ సుధీంద్ర తన పాత్రను సరళంగా పోషించాడు. సత్యరాజ్, ప్రకాశ్ రాజ్




వంటి అనుభవజ్ఞులైన నటులు ఉన్నప్పటికీ, వారి పాత్రలకు తగిన బలం లేకపోవడం గమనార్హం. సంగీతం, పాటల చిత్రీకరణ చిత్రానికి కొంత బలం చేకూర్చాయి.మొత్తంగా 'సీతా పయనం' మంచి ఉద్దేశంతో రూపొందించిన కుటుంబ కథా చిత్రం. అయితే కథ, కథనాల్లో కొత్తదనం లేకపోవడంతో ఇది ప్రత్యేకమైన ప్రయాణ అనుభూతిని ఇవ్వలేకపోయింది.



## హైదరాబాద్‌కు గర్వకారణం

### లాంకో హిల్స్‌కు ప్రతిష్టాత్మక 'హురున్ ఇండియా' అవార్డు!

భాగ్యనగర రియల్ ఎస్టేట్ చరిత్రలో మరో స్వర్ణ అధ్యాయం లిఖించబడింది. భారతదేశ పట్టణ అభివృద్ధిలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన లాంకో హిల్స్ టెక్నాలజీ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ తాజాగా ప్రతిష్టాత్మకమైన "హురున్ ఇండియా రియల్ ఎస్టేట్ ఎక్సలెన్స్ అవార్డు"ను కైవసం చేసుకుంది. హైదరాబాద్ రూపురేఖలను మార్చిన మార్గదర్శక ప్రాజెక్టుగా లాంకో హిల్స్‌ను గుర్తిస్తూ ఈ గౌరవం దక్కింది.

**నగరానికి తలమానికం.. మణికొండకు ప్రాణం**

ఒకప్పుడు సాదాసీదాగా ఉన్న మణికొండగచ్చిబౌలి ప్రాంతాన్ని నేడు అంతర్జాతీయ ఐటీ, ఆర్థిక కేంద్రంగా మార్చడంలో లాంకో హిల్స్ కీలక పాత్ర పోషించింది. దేశంలో 'హైరైజ్ మిక్స్డ్ యూజ్ టౌన్‌షిప్' అనే భావన సరిగ్గా తెలియని కాలంలోనే అన్ని వసతులు ఒకే చోట ఉండేలా ఈ మెగా ప్రాజెక్ట్‌ను రూపొందించడం విశేషం.

**ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకతలు..**

ఎత్తైన నివాస గోపురాలు, SEZ హోదాతో




కూడిన ఐటీ పార్క్, లగ్జరీ హోటళ్లు , వాణిజ్య కేంద్రాల సమాహారం. అభివృద్ధి అంటే కేవలం కాంక్రీటు జంగిల్ కాదని నిరూపిస్తూ ఇక్కడ 25,000కు పైగా చెట్లను నాటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించారు. ఆఫీసు, ఇల్లు, వినోదం అన్నీ నడక దూరంలోనే ఉండటంతో ట్రాఫిక్ కష్టాలు లేని ఆధునిక జీవనశైలిని ఇది పరిచయం చేసింది.

**రికార్డుల రారాజు**

నిర్మాణ రంగంలో లాంకో హిల్స్ సృష్టించిన రికార్డులు సామాన్యమైనవి కావు. ఈ అవార్డు అందుకున్న సందర్భంగా సంస్థ సీఈఓ ఎస్. వెంకట రామ రెడ్డి కొన్ని ఆసక్తికరమైన మైలురాళ్లను గుర్తుచేసుకున్నారు. "2007లో కేవలం మూడు రోజుల్లోనే 1500 గృహాలను విక్రయించి జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించాం. హైదరాబాద్‌లో స్కైస్క్రాపర్ గగనతలాన్ని తాకే భవనాలు సంస్కృతికి మేమే పునాది వేసాం." అని తెలిపారు.

**తొలి అడుగులు ఇక్కడే**

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ నుండి ఎత్తైన భవనాలకు అనుమతి పొందిన తొలి ప్రాజెక్ట్ ఇదే కావడం విశేషం. నగరంలో మొదటి హైరైజ్ ఫైర్ సేఫ్టీ సర్టిఫికేషన్ సాధించిన ఘనత కూడా వీరి సొంతం. సొంతంగా ఇండోర్ ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ , 900 మిమీ ప్రత్యేక నీటి పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. 45 మీటర్ల వెడల్పు గల అత్యాధునిక వైట్ టాప్ రోడ్ల నిర్మాణం చేపట్టారు.

**పశ్చిమ హైదరాబాద్ అభివృద్ధికి దిక్సూచి**

లాంకో హిల్స్ రాకతో పశ్చిమ హైదరాబాద్ ప్రాంతం రియల్ ఎస్టేట్ హబ్‌గా మారింది. ముఖ్యంగా 2020 తర్వాత ఈ ప్రాంతం గ్లోబల్ ఇన్వెస్టర్లను.. ఐటీ దిగ్గజాలను ఆకర్షించడంలో




ముందంజలో ఉంది. ఇది కేవలం ఒక కట్టడం మాత్రమే కాదు.. వేలాది మందికి ఉపాధిని, మెరుగైన జీవన ప్రమాణాలను అందించిన ఒక సామాజిక వ్యవస్థ. వారసత్వం, ఆవిష్కరణ, స్థిరత్వానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తున్న లాంకో హిల్స్, ఈ 'హురున్ ఇండియా' అవార్డుతో తన కిరీటంలో మరో కలికితురాయిని చేర్చుకుంది. గ్లోబల్ టెక్ హబ్‌గా హైదరాబాద్ ఎదుగుతున్న ప్రయాణంలో లాంకో హిల్స్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com